బుధవారం
6•2•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 222
• పేజీలు : 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

అటవీశాఖకు కుదుపు

ఒకేరోజు ఐఎఫ్ఎస్ అధికారులు సహా 200 మందికి తబాదలా

నిర్లక్ష్యపు అధికారులపై బదిలీ వేటు

- అటవీప్రాంతాల్లో సమర్థులకు పోస్టింగ్
- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఉత్తర్వులు
- హైదరాబాద్‌లో కాదు.. క్షేత్రస్థాయిలో దృష్టిపెట్టండి
- ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

అటవీశాఖ భారీ కుదుపునకు లోనైంది. మునుపెన్నడూ లేని విధంగా ఒకేరోజు 200 మంది అటవీశాఖ అధికారులను తబాదలా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నది. అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమర్థులకు పోస్టింగ్ ఇచ్చింది. 'జంగల్ బచావో్-జంగల్ బడావో్' నినాదంతో ఒకవైపు స్మగ్లర్లు, అటవీ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతూనే.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై బదిలీ వేటువేసింది. ఐఎఫ్ఎస్ అధికారులు మొదలుకుని చీఫ్ కన్జర్వేటర్లు, కన్జర్వేటర్లు, డీఎఫ్‌వో, ఎఫ్‌డీవో, ఏసీఎఫ్‌స్థాయి అధికారులను పెద్దసంఖ్యలో బదిలీచేస్తూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర తెలంగాణ పరిధిలోని అడవులు, అభయారణ్యాల్లో క్షేత్రస్థాయినుంచి ఉన్నతస్థాయి వరకు చాలామందిని తబాదలా చేశారు. ఉన్నతాధికారులు కేవలం హైదరాబాద్ నుంచే పరిస్థితిని పర్యవేక్షించకుండా క్షేత్రస్థాయిలో దృష్టిసారించాలని ఆదేశించారు. అటవీశాఖలో భారీ స్థాయిలో బదిలీలు చోటుచేసుకోనున్నాయని నమస్తే తెలంగాణ మంగళవారం నాటి సంచికలో ముందే పేర్కొన్న సంగతి తెలిసిందే. అడవుల రక్షణను విస్మరించి, స్మగ్లర్లతో అంటకాగుతున్న అధికారులు, సిబ్బంది జాబితాను తయారుచేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో.. ఉన్నతాధికారులు పలువురి పేర్లతో లిస్ట్ రూపొందించి నివేదించారు. దీన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి.. సదరు అధికారుల బదిలీలకు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు అటవీశాఖ అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

కీలక అధికారుల బదిలీ

కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ శరవణన్‌ను బదిలీచేసి.. ఆయన స్థానంలో ప్రస్తుతం అచ్చంపేట, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్‌ను నియమించారు. చీఫ్ కన్జర్వేటర్‌స్థాయి అధికారి ఎస్కే సిన్హాకు అమ్రాబాద్ అభయారణ్యంలో ఫీల్డ్ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కఠినంగా వ్యవహరించగల సత్తాఉన్న, అంకితభావం కలిగిన అధికారులను నియమించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో అటవీ సంపద తరిగిపోవడంపై, కలప స్మగ్లింగ్‌పై కొంతకాలంగా సీఎం కేసీఆర్ సీరియస్‌గా ఉన్నారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో స్మగ్లింగ్ జోరుగా సాగుతున్నదని, అక్కడ అటవీ సంపదను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, పాల్వంచ, కిన్నెరసాని, వరంగల్, ఖానాపూర్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లెందు, కాగజ్‌నగర్, ఇచ్చోడకు కొత్త డీఎఫ్‌వోలను

మిగతా 9వ పేజీలో



జాతీయ ఉపాధిహామీ పథకం నిధుల వినియోగంపై మంగళవారం ప్రగతిభవన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నరేగా నిధులతో పల్లె ప్రగతి

కేంద్రం ఇచ్చే నరేగా నిధులకు సమానంగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తాం

- నిధులను సంపూర్ణంగా వినియోగించుకోవాలి
- హరితహారం, వైకుంఠధామాలకు ప్రాధాన్యం
- 20 బృందాలతో అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కే చంద్రశేఖర్‌రావు

2



20 తరువాత

బడ్జెట్ సమావేశాలు!

- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు అధికారుల కసరత్తు
- 18 నుంచి 20 వరకు ఆర్థికసంఘం పర్యటన
- కేంద్రం నుంచి వచ్చే నిధులపై స్పష్టత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 20వ తేదీ తరువాత జరుగనున్నట్టు సమాచారం. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 15వ ఆర్థికసంఘం ప్రతినిధిబృందం తెలంగాణలో పర్యటించనున్నది. మూడురోజులపాటు వరుసగా సమావేశాలు నిర్వహించనున్నది. దీంతో కేంద్రం నుంచి వచ్చే నిధులపై స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఆ తరువాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ నెల 25 నుంచి మార్చి 8వ తేదీలోపు కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పుడైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలచేసే అవకాశం ఉన్నది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుంది. ఆలోపే రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం తెలుపాల్సి ఉంటుంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆసరా పింఛన్ల పెంపు, రైతు పెట్టుబడి సాయం పెంపుపై కేటాయింపులు చేయాల్సి ఉన్న నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే అసెంబ్లీ సమావేశం కానున్నట్టు తెలిసింది. ఈ మేరకు అధికారులు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు.

అనుమతులు ఆన్‌లైన్‌లోనే!

- గ్రామాల్లో లే ఔట్లు, ఇండ్ల నిర్మాణాలు సులువు
- 300 చదరపు మీటర్లు దాటితే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- పంచాయతీరాజ్ నుంచి డీటీసీపీకి.. ఆపై అనుమతి
- త్వరలో అమలుకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు

3

భాషా పండితులకు పదోన్నతులు

- పీఈటీలు కూడా స్కూల్ అసిస్టెంట్లే • మొత్తం 10,800 మందికి ప్రయోజనం
- ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీ అమలు
- ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం • త్వరలోనే మిగిలిన సమస్యలకు పరిష్కారం
- సంబురాల్లో పండితులు, పీఈటీలు • ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 భాషా పండితులు, పీఈటీల సుదీర్ఘస్వప్నం సాకారమైంది. ప్రపంచ తెలుగు మహాసభలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చారు. భాషా పండితులకు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా (గ్రేడ్-1) పదోన్నతులు కల్పించారు. మంగళవారం అందుకు సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేశారు. దీంతో ఇక రాష్ట్రంలో గ్రేడ్-2 పండితులు, పీఈటీలు ఉండరు. ఉమ్మడిరాష్ట్రంలో పదోన్నతుల కోసం దశాబ్దాలుగా పోరాటంచేసినా పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత భాషా పండితులకు, పీఈటీలకు పదోన్నతులు కల్పించారు. ఈ నిర్ణయం వల్ల 8,800 మంది భాషా పండితులు, రెండువేల మంది పీఈటీలతో కలిపి మొత్తం 10,800 మందికి ప్రయోజనం కలుగుతుంది. విద్యాశాఖ చరిత్రలో ఒకేసారి ఇంతమందికి పదోన్నతులు కల్పించడం ఇదే ప్రథమమని అధికారులు చెప్తున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏకీకృత సర్వీస్‌రూల్స్ సాధించడంతోపాటు అంతర్‌జిల్లా బదిలీలు, భార్యాభర్తల బదిలీలు, రూ.398 వేతనంలో పనిచేసిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై కూడా సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని, త్వరలోనే ఉపాధ్యాయుల అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

సంబురాలు చేసుకుంటున్న పండితులు, పీఈటీలు

పదోన్నతుల ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా భాషా పండితులు, పీఈటీలు సంబురాలు చేసుకుంటున్నారు. మిఠాయిలు పంచుకుని వేడుకలు జరుపుకొంటున్నారు. ఉపాధ్యాయ

మిగతా 2వ పేజీలో

రైతుబంధే పెద్ద పథకం

రైతుబంధు అందరు రైతులకూ వరిస్తుంది

- చిన్న, సన్నకారు రైతులకే కిసాన్ సమ్మాన్ పరిమితం
- రాష్ట్ర, కేంద్ర పథకాలకు సంబంధం లేదు
- మార్చి చివరికి రైతుల ఖాతాల్లో రూ.రెండు వేలు చొప్పున జమ
- కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుధామిశ్రా



మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషితో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుధామిశ్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు చాలా పెద్ద పథకమని.. ఇది రైతులందరికీ వర్తిస్తున్నదని కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకేఎస్‌ఎన్) పథకం చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే పరిమితమైందని.. కుటుంబానికి ఐదెకరాలలోపు ఉన్న రైతులకే వర్తిస్తుందని తెలిపారు. పీఎంకేఎస్‌ఎన్ కింద మార్చి నెలాఖరునాటికి రైతుల బ్యాంకుఖాతాల్లో రూ.2,000 చొప్పున జమచేస్తామని ఆమె వెల్లడించారు. పీఎంకేఎస్‌ఎన్‌పై ఆమె మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, రెవెన్యూ, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అమలుచేస్తున్న రైతుబంధు పథకం అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంకేఎస్‌ఎన్ పథకంపై చర్చించేందుకు రాష్ట్రానికి వచ్చినట్టు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే అమలుచేసిన రైతుబంధు పథకానికి సంబంధించిన రైతుల డాటా ఇస్తామంటే తీసుకుంటామని, కేంద్రప్రభుత్వం వద్ద ఉన్న డాటాను రాష్ట్రానికి అందజేస్తామని తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి.. రైతుబంధుకు సంబంధం లేదని స్పష్టంచేశారు. కుటుంబం యూనిటీగా చేసుకొని పీఎంకేఎస్‌ఎన్ పథకం ఉంటుందని, రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమచేస్తామని చెప్పారు. ఆధార్ లేదా ఏదైనా గుర్తింపుకార్డుతోపాటు బ్యాంకు ఖాతా వివరాలు అందించాల్సి

మిగతా 4వ పేజీలో

ధాన్యం సేకరణ లక్ష్యం కోటి టన్నులు



- ధాన్యం కొనుగోళ్లలో పౌరసరఫరాలశాఖ రికార్డులు
- వానాకాలంలో 40లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- యాసంగిలోనూ అదే స్థాయిలో సేకరణకు సిద్ధం
- ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు

3

ముగిసిన మమత దీక్ష

పోరాటం ఇక్కడితో ఆగదు

ఇక ఢిల్లీలో కొనసాగిస్తామన్న బెంగాల్ సీఎం

5

హద్దుదాటితే లైసెన్స్ కట్!



- నిబంధనలు పాటించనివారిపై రవాణాశాఖ కఠినచర్యలు
- నాలుగేండ్లలో 12,369 డ్రైవింగ్ లైసెన్సుల సస్పెన్షన్
- హైదరాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యధికం
- డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌లోడ్ కేసులే ఎక్కువ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై రవాణాశాఖ ఉక్కుపాదం మోపుతున్నది. భారీగా జరిమానా విధించడంతోపాటు వారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దుచేస్తున్నది. 2015 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 12,369 డ్రైవింగ్ లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. పదేపదే మద్యం తాగి పట్టుబడటం, సిగ్నల్స్ జంప్ చేయడం, ఓవర్‌లోడ్‌తో వెళ్లడం వంటి కేసులలో ఈ కఠిన చర్యలు తీసుకున్నది. సస్పెన్షన్‌కాలంలో సంబంధిత వ్యక్తి రాష్ట్రంలో మరెక్కడా డ్రైవింగ్ లైసెన్సు తీసుకునేందుకు వీలులేకుండా ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటున్నది. నమోదైన మొత్తం కేసులను.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, నిర్లక్ష్యపు డ్రైవింగ్ క్యాటగిరీలుగా విభజించి చర్యలు తీసుకుంటున్నది. తీవ్రమైన నేరాల్లో లైసెన్సును శాశ్వతంగా రద్దు చేస్తున్నది.

జిల్లాల్లోనూ సస్పెన్షన్లు..

డ్రంకెన్ డ్రైవ్ కారణంగా లైసెన్సులు సస్పెండ్ అయిన కేసులు హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లోనూ ఎక్కువగానే ఉన్నట్టు తేలింది. హైదరాబాద్ సెంట్రల్ జోన్ పరిధిలో 554 లైసెన్సులను సస్పెండ్‌చేయగా పెద్దపల్లి జిల్లా ఆర్టీఏ పరిధిలో 286 లైసెన్సులు సస్పెండయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్ నార్త్ జోన్ (199), వరంగల్ అర్బన్ (183), రంగారెడ్డి (121), హైదరాబాద్ ఈస్ట్‌జోన్ (111) ఉన్నాయి. మంచిర్యాల,

మిగతా 4వ పేజీలో

సీటు బెల్టులు వాడేది ఏడుశాతమే!

నిస్సాన్ ఇండియా, సేవ్ లైఫ్ సర్వేలో వెల్లడి

4



- కేసును తప్పుదారి పట్టించేందుకు రోడ్డు ప్రమాదంగా చిత్రించే యత్నం
- వివరాలు వెల్లడించిన కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

డబ్బు కోసమే జయరాం హత్య

రూ.4 కోట్లు తిరిగి ఇవ్వకపోవడంతో పగపెంచుకున్న రాకేశ్‌రెడ్డి

పథకం ప్రకారం కిడ్నాప్.. రోజంతా హింసించి హత్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్థిక లావాదేవీలే వ్యాపారవేత్త చిగురుపాటి జయరాం హత్యకు కారణమని ఏపీ పోలీసులు తేల్చారు. అప్పుగా తీసుకున్న రూ.4 కోట్లు తిరిగి ఇవ్వనందుకే రాకేశ్‌రెడ్డి అతడిని హత్యచేసినట్టు గుర్తించారు. పథకం ప్రకారం జయరాంను హైదరాబాద్‌లో కిడ్నాప్ చేసి, రోజంతా హింసించి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. కేసును తప్పుదారి పట్టించేందుకు వాచ్‌మన్ శ్రీనివాస్‌తో కలిసి మృతదేహాన్ని కారులో ఉంచి ఏపీలోని నందిగామలో రోడ్డు పక్కన వదిలిపెట్టాడు. ఈ హత్యలో జయరాం మేనకోడలు శిఖాచౌదరి పాత్ర లేదని పోలీసులు ప్రకటించారు. నిందితుడు రాకేశ్‌కు సహకరించిన ఇద్దరు తెలంగాణ పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు

మిగతా 12వ పేజీలో



మంగళవారం ప్రగతిభవన్‌లో తనను కలిసిన ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

సీఎంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీల భేటీ

త్వరలో ఉన్నతస్థాయి సమావేశం: చీఫ్ విప్ పాతూరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సానుకూలంగా స్పందించారని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ తెలిపారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించిన నేపథ్యంలో.. మంగళవారం ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సమస్యలపై సీఎంను కలిశారు. అంతర్‌జిల్లాల బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వేర్వేరుచోట్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న భార్యాభర్తల బదిలీలు, పరస్పర అంగీకార (మ్యూచువల్) బదిలీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటుచేస్తామని తమకు సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్సీలు చెప్పారు.



మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్. చిత్రంలో మాజీమంత్రి ఈటల రాజేందర్ ఉన్నారు.

సేంద్రియ సాగుకు రుణాలు

- టెస్కాబ్ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, కంది, పెసర, మినుములు సాగుచేసే రైతులకు ప్రత్యేకంగా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) నిర్ణయించింది. వివిధ రకాల పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను టెస్కాబ్ ఖరారు చేసింది. రాష్ట్రంలో పండించే దాదాపు వందరకాల పంటలకు 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఎంతెంత రుణాలు ఇవ్వాలన్న దానిపై టెస్కాబ్ భారీ కసరత్తు చేసింది. సాగుఖర్చు, ఉత్పాదకత ఆధారంగా రుణ నిర్ధారణ చేసింది. సంబంధిత నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ)కి పంపించింది. సేంద్రియ పద్ధతిలో సాగుచేసే కంది, మినుము, పెసర్లకు ఎకరానికి రూ.17 వేల నుంచి రూ.20 వేలు ఇవ్వాలని ఖరారు చేసింది.

వరికి, పత్తికి రూ. 38 వేలు

తెలంగాణలో అత్యధికంగా సాగు చేసే వరికి ఎకరానికి రూ.34వేల నుంచి రూ.38 వేలుగా ఖరారు చేసింది. వరి విత్తనోత్పత్తి రైతులకు రూ.40 వేల నుంచి రూ.42 వేలు, పత్తికి రూ. 35 వేల నుంచి రూ.38 వేలకు పెంచారు.

నరేగా నిధులతో పల్లె ప్రగతి

- కేంద్రం ఇచ్చే నిధులకు సమానంగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తాం
- నిధులను సంపూర్ణంగా వినియోగించుకోవాలి
- హరితహారం, వైకుంఠధామాలకు ప్రాధాన్యం
- 20 బృందాలతో ఆకస్మిక తనిఖీలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కే చంద్రశేఖర్‌రావు



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మాజీమంత్రి ఈటల రాజేందర్, ఎంపీ బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, బాల్క సుమన్, సీఎస్ ఎస్కే జోషి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (నరేగా) నిధులను సంపూర్ణంగా వినియోగించుకొని గ్రామాల్లో హరితహారం, వైకుంఠధామాల (శ్మశానవాటికలు) నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరుగాలని, హరితహారం పనులకు మొదటి ప్రాధాన్యం, శ్మశానవాటికల నిర్మాణానికి రెండో ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి నిధులను ఉపయోగించాలని సూచించారు.అన్ని గ్రామపంచాయతీలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై సీఎం కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు 20 బృందాలుగా విడిపోయి ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కావద్దని, ప్రతి పైసా సద్వినియోగం కావాలని చెప్పారు.

నరేగా నిధులతో హరితహారం

'తెలంగాణకు హరితహారంలో భాగంగా రాష్ట్రంలోని 12,751 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటుచేయాలి. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, రక్షించాలి. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతరత్రా పనులకు ఈ నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. అటవీ శాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటుచేయాలి. మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామ పంచాయతీలు చేపట్టాలి' అని సీఎం చెప్పారు.

ఆరు నెలల్లో వైకుంఠధామాల నిర్మాణం

అన్ని గ్రామాల్లో ఆరునెలల్లో వైకుంఠధామాలు (శ్మశానవాటికలు) నిర్మించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. 'ప్రభుత్వభూమి లేకుంటే గ్రామ పంచాయతీలు తమ నిధులతో స్థలాలు సమకూర్చాలి. దాతల నుంచి స్వీకరించాలి. వైకుంఠధామం నరేగా నిధులతో నిర్మించాలి. మూడు వేలలోపు జనాభా కలిగిన 11,412 గ్రామాల్లో ఒకటి చొప్పున, మూడువేలకు పైగా జనాభా కలిగిన 1300 గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14,012 వైకుంఠధామాలు నిర్మించాలి' అని సీఎం తెలిపారు.

అన్ని పంచాయతీలకు బీటీ రోడ్లు

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. 'కొత్తగా 859 గ్రామాలకు రహదారులు నిర్మించాలి. వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి, పనులు ప్రారంభించాలి' అని ఆదేశించారు.సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి, ఎంపీలు బీ వినోద్‌కుమార్, బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, డీఎస్ రెడ్యానాయక్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే మాలోతు కవిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 55 విలేజ్ కోర్టులు

- ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ ప్రజల ముగింట్లోకి న్యాయాన్ని తీసుకెళ్లే ఉద్దేశంతో తెలంగాణ సర్కారు గ్రామీణ న్యాయాలయాలు ఏర్పాటుచేస్తున్నది. రాష్ట్రంలోని 55 చోట్ల విలేజ్ కోర్టులను ఏర్పాటుచేస్తూ ఈ నెల 1న ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) నుంచి వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో వీటిని ఏర్పాటుచేయనుంది. విలేజ్ కోర్టు జడ్జిగా జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జూనియర్ మెజిస్ట్రేట్ వ్యవహరిస్తారు. ఒక్కో కోర్టులో జడ్జితోపాటు హెడ్ క్లర్క్, జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్, అటెండర్ ఉంటారు. జడ్జి మినహా మిగతా సిబ్బందిని కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించనున్నట్టు ప్రభుత్వం పేర్కొన్నది. వేతనాలు, సిబ్బంది కేటాయింపులకు సంబంధించి ఆర్థికఉత్తర్వులు జారీచేస్తుందని న్యాయశాఖ ఉత్తర్వుల్లో తెలిపింది. వేతనాలకు రూ.9.90 కోట్లు, ఇతర ఖర్చులకు 2.75కోట్లు వ్యయం కానున్నది.

విలేజ్ కోర్టులు ఏర్పాటుచేసేదిక్కడే

ఆదిలాబాద్: ముథోల్, బాసర, నర్సాపూర్, శ్రీరాంపూర్, మందమర్రి, ఆర్కేపూర్ పీఎస్

కరీంనగర్: చిగురుమామిడి, కోహెడ, బెజ్జంకి, మల్యాల, ధర్మపురి, పెద్దపల్లి, గొల్లపల్లి, సారంగాపూర్, రాయికల్, కేశవపట్నం, సైదాపూర్, ఎల్కతుర్తి, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్.

ఖమ్మం: వీఎం బంజారా, అశ్వారావుపేట, దమ్మపేట, బోనకల్, వైరా, తల్లాడ.

మెదక్: పటాన్‌చెరు

మహబూబ్‌నగర్: ఆమన్‌గల్, కొత్తూర్, కొందుర్గు

నల్లగొండ: మునగాల, వేములపల్లి, త్రిపురారం, నిడమనూర్, హాలియా, పెద్దవూర, చింతపల్లి, చిట్యాల, వలిగొండ, చౌటుప్పల్, మోత్కూర్, బీబీనగర్, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం.

రంగారెడ్డి: శామీర్‌పేట్, కుత్బుల్లాపూర్, కీసర, పేట్ బషీర్‌బాద్

వరంగల్: భూపాలపల్లి, గీసుకొండ, వర్ధన్నపేట్, పర్వతగిరి, సంగెం, కేసముద్రం.

విలేజ్ కోర్టుల ఏర్పాటుకు జీవో తెచ్చాం

హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 55 విలేజ్ కోర్టులను ఏర్పాటుచేస్తూ జీవో విడుదల చేశామని ప్రభుత్వం.. హైకోర్టుకు తెలిపింది. విలేజ్ కోర్టులను ఏర్పాటుచేయలేదని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం చీఫ్ జస్టిస్ తొట్టతిల్ బీ రాధాకృష్ణన్, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టగా.. ఈ మేరకు ప్రభుత్వం వివరించింది.

గ్రూప్-1 అభ్యర్థులకు గిరిజన సంక్షేమశాఖ శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ వీ సర్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ముందస్తు పరీక్షల శిక్షణ కేంద్రంలో (పీఈటీసీ) మూడునెలల శిక్షణకు ఏర్పాట్లుచేసినట్టు పేర్కొన్నారు. 75 మంది ఎస్టీ, 15 మంది ఎస్సీ, 10 మంది బీసీ విద్యార్థులను టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల ఆధారంగా ఎంపికచేసి మార్చి ఒకటి నుంచి శిక్షణ ఇస్తామని వెల్లడించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఆయా క్యాటగిరీల అభ్యర్థులు మాత్రమే శిక్షణ పొందేందుకు ఆన్‌లైన్‌లో http//studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జేడీ సూచించారు.

కంటివెలుగు@ 1.44 కోట్లు

కంటి వెలుగు

106 వ రోజు

- మూడు జిల్లాల్లో సంపూర్ణం
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో కంటిపరీక్షలు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అంధత్వరహిత తెలంగాణ సాధన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతున్నది. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 106 రోజుల్లో మొత్తం 1,44,08,370 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 28,74,117మందికి రీడింగ్ అద్దాలను అందజేశారు. మరో 17,06,474 మందికి ప్రత్యేక అద్దాలను ప్రతిపాదించారు. శస్త్రచికిత్సలకు 8,85,872 మందిని రిఫర్‌చేశారు. కాగా మంగళవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా 85,180 మందికి కంటి పరీక్షలు చేసి, 6146 మందికి కండ్లద్దాలు అందజేశారు. మరో 4,800 మందికి ప్రత్యేక అద్దాలు ప్రతిపాదించారు. శస్త్రచికిత్సలకు 4,311 మందిని రిఫర్‌చేశారు.

మూడు జిల్లాల్లో సంపూర్ణం

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో కంటివెలుగు శిబిరాల నిర్వహణ పూర్తయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 826 గ్రామాలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 320 గ్రామాల్లో కంటపరీక్షలు పూర్తిచేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 445 గ్రామాలకుగాను.. 420 గ్రామాల్లో కంటిపరీక్షలు పూర్తిచేసి 88.42శాతం లక్ష్యం చేరారు. ఆసిఫాబాద్ జిల్లాలో 464గ్రామాలకుగాను.. 348గ్రామాల్లో కంటిపరీక్షలు పూర్తిచేసి 87.22శాతం లక్ష్యం చేరారు. మంచిర్యాల జిల్లాలో 340 గ్రామాలకుగాను.. 323 గ్రామాల్లో, నిర్మల్ జిల్లాలో 428గ్రామాలకుగాను.. 330గ్రామాల్లో కంటి పరీక్షలు పూర్తిచేశారు. నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామాలకుగాను 273 గ్రామాల్లో కంటిపరీక్షలు పూర్తిచేశారు. కామారెడ్డి జిల్లాలో 401 గ్రామాల్లో కంటి పరీక్షలు పూర్తిచేసి.. 64 శాతం లక్ష్యం సాధించారు. కరీంనగర్ జిల్లాలో 204 గ్రామాల్లో కంటిపరీక్షలు నిర్వహించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 174 గ్రామాల్లో పూర్తిచేశారు. జగిత్యాల జిల్లాలో 282 శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించగా.. 251శిబిరాల్లో విజయవంతంగా పూర్తిచేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 75శాతం కంటివెలుగు శిబిరాల నిర్వహణ పూర్తయింది. జిల్లాలో 166 గ్రామాలకుగాను 145 గ్రామాల్లో కంటిపరీక్షలు పూర్తిచేశారు. 54 మున్సిపల్ వార్డులకుగాను 30 వార్డుల్లో కంటి పరీక్షలు పూర్తిచేశారు. పెద్దపల్లి జిల్లాలో 84శాతం పూర్తయింది. జిల్లాలోని 163 గ్రామాలు, 54 వార్డుల్లో కార్యక్రమం పూర్తయింది. మెదక్ జిల్లాలో 338 గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహించారు. మరో 70 గ్రామాల్లో కంటిపరీక్షలు కొనసాగుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో 335 గ్రామాలు, 13 వార్డుల్లో కంటిపరీక్షలు పూర్తికాగా.. ప్రస్తుతం 16 గ్రామాలు, రెండు వార్డుల్లో కంటివెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 610 గ్రామాలకుగాను 466 గ్రామాల్లో కంటిపరీక్షలు నిర్వహించారు. వరంగల్ రూరల్ జిల్లాలో 93.67శాతం, వరంగల్ అర్బన్ జిల్లాలో 78శాతం, జనగామ జిల్లాలో 75శాతం, మహబూబాబాద్ జిల్లాలో 66.69శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 85శాతం మేర కంటివెలుగు శిబిరాల నిర్వహణ పూర్తయింది. నల్లగొండ జిల్లాలో 82 శాతం, సూర్యాపేట జిల్లాలో 80 శాతం మేర కంటివెలుగు శిబిరాల నిర్వహణ పూర్తయింది. ఖమ్మం జిల్లాలో 367 గ్రామాలకుగాను 328 ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాల నిర్వహణ పూర్తయింది. కొత్తగూడెం జిల్లాలో 321 గ్రామాల్లో కంటిపరీక్షలు పూర్తిచేసి.. 95.54 శాతం లక్ష్యం సాధించారు.



సిద్దిపేటలో కంటివెలుగు శిబిరం వద్ద పేర్లు నమోదు చేస్తున్న ఆశావర్కర్లు

కంటి వైద్యశిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	మంగళవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	85,180	1,44,08,370
కండ్లద్దాలు పొందినవారు	6146	28,74,117
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	4,800	17,06,474
కంటి సమస్యలపై రెఫరల్	4311	8,85,872
కంటి సమస్యలు లేనివారు	69,923	97,54,445

ఆనందంగా ఉన్నది

చాలా రోజుల సంది కంటిసూపు బరాబరి కనిపిస్త లేదు. కంటివెలుగు శిబిరంలో కంటిపరీక్షలు చేయించుకున్న. కండ్లద్దాలు ఇచ్చింండ్రు. ఇప్పుడు బాగా కనిపిస్తున్నయి. చాల ఆనందంగా ఉన్నది. కేసీఆర్ సర్కారుకు రుణపడి ఉంటాం.

- గుంటి రాజయ్య, బోయినపల్లి (రాజన్న సిరిసిల్ల)





కంటి సమస్య పోయింది

నాకు కండ్లు మసకమసకగా కనిపించేవి. కంటివెలుగు శిబిరంలో కంటి పరీక్ష చేయించుకున్నా. ఇప్పుడు మసక సమస్యపోయింది. ప్రవేటు దావఖానకు వెళ్లకుండా ఉచితంగా అద్దాలు ఇవ్వడంతో సుమారు రూ.రెండువేల ఖర్చు తప్పింది.

- బోయిని నారాయణ, శ్రీరాములపల్లి, కమలాపూర్ మండలం

ఏర్పాట్లు బాగున్నాయి

కంటివెలుగు శిబిరంలో ఏర్పాట్లు బాగున్నాయి. పరీక్షల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచినీటి సౌకర్యం, వృద్ధులు, మహిళలు కూర్చోవడానికి టెంట్‌వేసి కుర్చీలువేశారు. కంటిపరీక్షలు కూడా బాగా చేస్తున్నారు. అద్దాలు ఇచ్చారు. సంతోషంగా ఉన్నది. - శశికళ (సిద్దిపేట)





సీఎం కేసీఆర్ సార్ దేవుడు

పేదల కోసం గింత మంచి కార్యక్రమం పెట్టిన ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ సార్ దేవుడు. నా కండ్లు మసక మసక కనిపించేవి. కంటివెలుగులో కండ్ల పరీక్ష చేయించుకున్న. అద్దాలు వారం, పదిరోజుల్లో ఇత్తమన్నరు. మందులు ఇచ్చిండ్లు చాలా సంతోషంగా ఉన్నది. పేదల కోసం ఇలా ఎవరు గతంలో ఆలోచించలే. -పులి రాజమ్మ, ఇందారం

ముహూర్తం

సూర్యోదయం: 6.50 గంటలకు

సూర్యాస్తమయం: 6.10 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం విదియ, నక్షత్రం: ధనిష్ఠ ఉదయం 9.09 వరకు, తదుపరి శతభిషం, అమృతఘడియలు: లేవు, రాహుకాలం మధ్యాహ్నం 12.30 నుంచి 1.55 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.08 నుంచి 12.53 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.15 నుంచి 6.51 వరకు.

లోకం పోకడ



ఒకే సీజన్లో రెండూ అమ్మేస్తున్నా.. పొద్దున గొడుగులు, రాత్రి స్వెట్టర్లు..

భాషా పండితులకు పదోన్నతులు

మొదటిపేజీ తరువాయి...

సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తంచేసున్నారు. పదోన్నతుల ఫైల్‌పై సంతకంచేసిన సీఎం కేసీఆర్‌కు ఉపాధ్యాయుల తరుపున శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర నాయకులు సరోత్తంరెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సీహెచ్ రాములు, చావ రవి, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర నాయకులు భుజంగరావు, సదానందంగౌడ్, రాష్ట్ర భాషా పండితుల సంఘం నాయకులు అబ్దుల్లా, జగదీశ్, పీఆర్టీయూ నాయకులు మారెడ్డి అంజిరెడ్డి, చెన్నయ్య, తెలుగు యూనివర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు భాషపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఈ నిర్ణయం నిదర్శనమని కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఎస్సీ చైర్మన్ల 21వ సదస్సులో కీలక చర్చలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పబ్లిక్ సర్వీస్ కమిషన్ల 21వ సదస్సులో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో సోమ, మంగళవారాల్లో (ఫిబ్రవరి 4, 5 తేదీల్లో) సదస్సు జరిగింది. ఒడిశా గవర్నర్ ప్రొఫెసర్ గణేశ్‌లాల్ సదస్సును ప్రారంభించగా, యూపీఎస్సీ చైర్మన్ అరవింద్ సక్సేనా, స్టాండింగ్ కమిటీ కన్వీనర్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అధ్యక్షత వహించారు. అరవింద్ సక్సేనా మాట్లాడుతూ.. పీఎస్సీలు మతం, కులం, లింగభేదాలు, భయం, పక్షపాతం లేకుండా ఉద్యోగ నియామకాలు జరిపినట్టు తెలిపారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత నెలకొన్న విషయమై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి వివరించారు. పరీక్షల నిర్వహణ, టెక్నాలజీని ఉపయోగించుకోవడం, డిజిటల్ ఎవల్యూషన్ ప్రాసెస్ తదితర ముఖ్యాంశాలపై సదస్సు కూలంకషంగా చర్చించింది. ఈ సదస్సుకు వచ్చిన చైర్మన్లకు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ గౌరవ సూచకంగా ఆతిథ్యమిచ్చారు.



భువనేశ్వర్‌లో జరిగిన పీఎస్సీ చైర్మన్ల సదస్సులో పాల్గొన్న యూపీఎస్సీ చైర్మన్ అరవింద్ సక్సేనా, తెలంగాణ పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, వివిధ రాష్ట్రాల పీఎస్సీల చైర్మన్లు



యూపీఎస్సీ చైర్మన్ అరవింద్ సక్సేనాకు మెమెంటో ఇస్తున్న తెలంగాణ పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల జాబితా

ములుగులోని అటవీ కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియమకానికి సంబంధించిన జాబితాను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

మందు తాగితే..బండి కదలదు!

■ కోరుట్ల యువకుడి ఆవిష్కరణకు కేటీఆర్ ఫిదా ■ సహకరించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మద్యం తాగినప్పుడు వాహనాలు ముందుకు కదలకుండాచేసి, ప్రమాదాలకు చెక్ పెట్టే వినూత్న పరికరాన్ని జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన సాయితేజ (22) ఆవిష్కరించాడు. టెన్త్‌తో చదువు ఆపేసినా ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై మక్కువతో ఇంటర్నెట్ నుంచి జ్ఞానం సంపాదించాడు. డ్రైవర్ మద్యం వాహనం ఎక్కితే ఈ పరికరం వెంటనే గుర్తిస్తుంది. పరికరంలో రిజిస్టర్ చేసిన సెల్‌ఫోన్ నంబర్‌కు 'ఆల్కహాల్ డిటెక్టెడ్'అనే మెసేజ్ వస్తుంది. వాహనం కూడా నిలిచిపోతుంది. ఈ ఆవిష్కరణకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఫిదా అయ్యారు. మీడియా ఈ కథనం రావడాన్ని గుర్తించిన ఆయన, సాయితేజకు అవసరమైన సహకారం అందించాలని ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ సీఈవో సామ ఫణీంద్ర, టీహబ్, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతంను మంగళవారం ట్విట్టర్ ద్వారా ఆదేశించారు.



జగిత్యాల జిల్లా కోరుట్ల యువకుడు రూపొందించిన పరికరం (ఇన్‌సెట్) సాయితేజ

కల్యాణమండపానికి స్తంభాల స్థాపన

స్తంభాలపై రామాయణఘట్టాలు ■ చురుకుగా కొనసాగుతున్న యాదాద్రి పనులు

యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ : యాదాద్రి ఆలయవిస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మంగళవారం నిత్యకల్యాణ మండపనిర్మాణానికి స్తంభాలను స్థాపన చేశారు. యాదాద్రిలో ప్రతిరోజు భక్తులు స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. యాదాద్రి ఆలయంలో శ్రీవారికి కల్యాణం జరిపించి ఇండ్లల్లో శుభకార్యాలు జరిపితే అంతా శుభమే కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో కల్యాణమండపాన్ని పూర్తిగా కృష్ణశిలలతో నిర్మిస్తున్నారు. మండపానికి అవసరమైన నాలుగు స్తంభాలను స్థాపన చేసిన స్థపతులు వాటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఇనుపరాడ్లతో కూడిన రక్షణవ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆలయ స్తపతి డాక్టర్ ఆనందాచారి వేలు పర్యవేక్షణలో శిల్పులు స్థాపన పనులు చేపట్టారు. కల్యాణమండపానికి ఉపయోగించిన నాలుగు స్తంభాలపై రామాయణ ఘట్టాలను తీర్చిదిద్దారు. సీతాజననము, సీత పెరిగిన తీరు, రామలక్ష్మణుల విద్యాభ్యాసము, వనవాసము, సీత మాయలేడిని చూడటం, రావణుడు సీతను అపహరించుట, రావణవధ తదితర ఘట్టాలను కళ్లకు కట్టినట్టుగా చెక్కారు. స్తంభాల స్థాపన కార్యక్రమంలో ఉపస్థపతులు సంజయ్, మొగిలి, శ్రీనివాస్, హేమాద్రి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



రామలక్ష్మణులతో హనుమంతుడు



యాదాద్రి పుణ్యక్షేత్రంలో కల్యాణమండపానికి జరిగిన స్తంభాల స్థాపన

అనుమతులు ఆన్‌లైన్‌లోనే!

■ గ్రామాల్లో లే అవుట్లు, ఇండ్ల నిర్మాణాలు సులువు
■ 300 చదరపు మీటర్లు దాటితే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
■ త్వరలో అమలుకు పంచాయతీరాజ్‌శాఖ కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్లు లేదా అంతకన్నా మించి చేపట్టే నిర్మాణాలు, లేఔట్లకు డీటీసీపీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతి ఇస్తుంది. గతంలో మాదిరిగా దరఖాస్తు చేసుకొని అధికారుల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేదు. ఈ ప్రక్రియను రెండువారాల్లో అమల్లోకి తెచ్చేందుకు పంచాయతీరాజ్‌శాఖ కసరత్తు చేస్తున్నది. రాష్ట్రంలోని 12,751 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 300 చదరపు మీటర్లలోపు అభివృద్ధి చేసే ఇండ్లు, భవనాలకు పంచాయతీ రాజ్ ఆన్‌లైన్‌లో అనుమతుల్ని ఇస్తున్నది. అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో జరిగే అపార్ట్‌మెంట్లు, లే అవుట్‌ల అనుమతి ప్రక్రియ మ్యాన్యువల్‌గా జరిగేది. మొదట స్థానిక పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తును సెక్రటరీ పరిశీలించి డీటీసీపీకి పంపడం ఆనవాయితీ. ఆయా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డీటీసీపీ అనుమతులు మంజూరు చేసేది. అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ఉండేందుకు ఈ ప్రక్రియను ఆన్‌లైన్ చేస్తున్నది.

ఎంత విస్తీర్ణానికి ఎవరు అనుమతిస్తారు?

పట్టణ సమీప పంచాయతీల పరిధిలో లే అవుట్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కొందరు తక్కువ విస్తీర్ణంలో లేఅవుట్లు చేస్తే.. మరికొందరు అధికస్థలంలో వెంచర్లు వేస్తున్నారు. విస్తీర్ణాన్ని బట్టి అనుమతి ఇచ్చే విధానాన్ని అమల్లోకి తేనున్నారు. పంచాయతీల్లో 2.5 ఎకరాల్లోపు వెంచర్లకు స్థానిక జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి అనుమతి ఇస్తారు. 2.50 ఎకరాల నుంచి ఐదు ఎకరాల్లోపు లేఅవుట్లకు డీటీసీపీ రీజినల్ డైరెక్టర్.. ఐదెకరాలు దాటిన లేఅవుట్లు, అపార్టుమెంట్లను నిర్మించే వారికి నేరుగా డీటీసీపీ ప్రాంతీయ సంచాలకుడు అనుమతి మంజూరు చేస్తారు.

1,440 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఆమోదం

■ వందశాతం సొమ్ము చెల్లించిన వారికే అవకాశం
■ పురపాలకశాఖ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్లాట్ల క్రమబద్ధీకరణకు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) పూర్తి సొమ్ము చెల్లించి, తుది క్లియరెన్స్ కోసం ఎదురుచూసే దరఖాస్తుదారులకు శుభవార్త. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ సుమారు 1,440 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆమోదిస్తూ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు 1,61,693 దరఖాస్తులను హెచ్‌ఎండీఏ అందుకున్నది. వీటిలో 91,658 దరఖాస్తులను ఆమోదించింది. 58,052 దరఖాస్తులను తిరస్కరించింది. 2018 అక్టోబర్ 31 నాటికి ఎల్‌ఆర్‌ఎస్ తుది ప్రొసీడింగులను అందజేయడంలో హెచ్‌ఎండీఏ విఫలమైంది. ఈ అంశాన్ని గమనించి 1,440 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను అరవింద్‌కుమార్ ఆమోదించారు.

కోటి టన్నుల ధాన్యం లక్ష్యం

సేకరణకు పౌరసరఫరాలశాఖ కసరత్తు

■ వానకాలంలో రికార్డుస్థాయి కొనుగోళ్లు
■ యాసంగిలో మరో 40 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు సిద్ధం
■ ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు
■ సాంకేతికత, పారదర్శకతల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ధాన్యం కొనుగోళ్లలో కొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ఏటేటా ధాన్యం కొనుగోళ్లు పెంచుకుంటూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. వానకాలం సీజన్‌లో 40 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించి, ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. యాసంగిలో మరో 40 లక్షల మెట్రిక్‌టన్నులు కొనుగోలుకు సమాయత్తమవుతున్నది. భవిష్యత్‌లో కోటి మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి చెప్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, 24 గంటల విద్యుత్ సరఫరా, రైతుబంధులాంటి పథకాల వల్ల సాగువిస్తీర్ణంతోపాటు ధాన్యం దిగుబడి విపరీతంగా పెరిగింది. దీనికితగ్గట్టుగా పౌరసరఫరాలశాఖ.. రైతులకు నష్టం, కష్టం కలుగకుండా మద్దతుధర ప్రకారం ధాన్యం కొంటున్నది. కొనుగోలు చేసినతర్వాత సకాలంలో సొమ్మును ఆన్‌లైన్ ద్వారా రైతుల బ్యాంకుఖాతాల్లో జమచేస్తున్నది.



యాసంగి కొనుగోళ్లకు సమాయత్తం

రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ 2017-18 ఏడాదికిగాను వానకాలం సీజన్‌లో 18.27 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం, యాసంగిలో 35.81 లక్షల మెట్రిక్‌టన్నులు.. మొత్తంగా 54.08 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసింది. ఈ ఏడాది ఒక్క వానకాలంలోనే 3,297 కొనుగోలు కేంద్రాల ద్వారా 40 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసింది. వచ్చే యాసంగిలోనూ 40లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలుచేయాలనే లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకుగాను పౌరసరఫరాలశాఖ కేంద్ర కార్యాలయంలో పనిచేసే అధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ధాన్యం దిగుబడి పెరగటంతో దాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు పౌరసరఫరాలశాఖ కసరత్తుచేస్తున్నది. ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇందుకుగాను ప్రత్యేకంగా బిజినెస్‌వింగ్‌ను ఏర్పాటు చేసింది. రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యాన్ని మిల్లింగ్‌చేసి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేయడానికి చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ పౌరసరఫరాలశాఖ గతంలో తమిళనాడుకు మూడువేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సరఫరాచేసింది.

కొనుగోళ్లలో నిజామాబాద్ టాప్

2018-19 వానకాలం ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్ జిల్లా మొదటి, కరీంనగర్ జిల్లా రెండోస్థానంలో నిలిచాయి. పౌరసరఫరాల సంస్థ నిజామాబాద్ జిల్లాలో 282 కొనుగోలు కేంద్రాల ద్వారా 4.8 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలుచేసింది. కరీంనగర్‌లో 202 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.7 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించింది. క్వింటాల్ గ్రేడ్ ఏ రకానికి రూ.1,770, కామన్ రకానికి రూ.1,750 చొప్పున మద్దతు ధర చెల్లిస్తూ పౌరసరఫరాలసంస్థ వానకాలం కొనుగోళ్లను దాదాపుగా పూర్తిచేసింది. మొత్తం ఏడు లక్షలపైగా రైతులకు రూ.6,970కోట్లను నేరుగా వారి బ్యాంకుఖాతాల్లో జమచేసింది.

అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లుచేసిన ఐదు జిల్లాలు..

జిల్లా	ధాన్యం (లక్షల మెట్రిక్‌టన్నులు)
నిజామాబాద్	4,89,567
కరీంనగర్	3,72,838
కామారెడ్డి	3,59,661
పెద్దపల్లి	3,34,441
నల్లగొండ	2,23,264

కొనుగోళ్లకు సిద్ధమవుతున్నాం

పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు ప్రణాళికలను సిద్ధంచేసుకుంటున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా సమీపంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నాం. చెల్లింపుల్లోనూ పారదర్శకత పాటిస్తున్నాం. ఓపీఎంఎస్ సిస్టం ద్వారా రైతు ఖాతాల్లోకి సకాలంలో సొమ్ము జమచేస్తున్నాం. వచ్చే యాసంగి కొనుగోళ్ల కోసం ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాం. అధికారులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాం.

-అకున్ సబర్వాల్,
పౌరసరఫరాలశాఖ కమిషనర్

ప్రతిగింజకు మద్దతు ధర

రైతులు పండించిన ప్రతిగింజకు మద్దతు ధర కల్పించి కొనుగోలుచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. సాగు విస్తరించడంతోపాటు దిగుబడి కూడా పెరుగుతున్నది. ఎంత దిగుబడి పెరిగినా ప్రతి గింజను కొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భవిష్యత్‌లో కోటి మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలుచేస్తాం. దేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ పౌరసరఫరాలశాఖ ఆదర్శంగా నిలుస్తున్నది.

-మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,
పౌరసరఫరాలసంస్థ చైర్మన్

సీఎం కేసీఆర్ వెంటే బ్రాహ్మణులు

■ ప్రభుత్వ సహకారం సద్వినియోగం కావాలి
■ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు
■ బెస్ట్ పథకం కింద 42 మందికి రూ.1.33 కోట్ల సహాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూనే బ్రాహ్మణుల్లోని పేదల ప్రగతికి ప్రోత్సాహం అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. కేసీఆర్ చొరవతో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసుకొని ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రభుత్వం చూపుతున్న ఆదరణ కారణంగా తెలంగాణలోని బ్రాహ్మణులు కేసీఆర్ వెంటే ఉన్నారని తెలిపారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు సబ్సిడీ చెక్కులు, వివేకానంద విదేశీవిద్య పథకం కింద ఎంపికైన విద్యార్థులకు ఆర్థిక సహాయం మంజూరు పత్రాల పంపిణీ చేపట్టారు. బెస్ట్ పథకం కింద వ్యాపార, సూక్ష్మతరహా పరిశ్రమల ఏర్పాటుకు 42 మంది లబ్ధిదారులకు రూ.1,33,22,000 ఆర్థిక సహాయం అందించినట్టు తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి పేర్కొన్నారు. బ్రాహ్మణ పేద కుటుంబాల ప్రగతికి అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 200 మందికి ఈ ఏడాది సహాయం చేయాలనుకుంటున్నట్టు తెలిపారు. బుధవారం నుంచి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్షేత్ర పరిశీలన చేపట్టి ప్రత్యేక కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్టు తెలిపారు. వివేకానంద ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 110 మంది విద్యార్థులకు విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు రూ.19.75 కోట్ల సహాయం అందించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ పురాణం సతీశ్ మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు, నాయకులు తమను ఓట్లువేసేవారిగానే చూశారని, సీఎం కేసీఆర్ మాత్రమే బ్రాహ్మణుల్లోని పేద కుటుంబాల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణులకు అన్ని రకాలుగా అండగా ఉందని, సీఎం కేసీఆర్ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. కోకాపేటలో ఇప్పటికే భవన నిర్మాణం జరుగుతున్నదని, హైదరాబాద్‌కు వచ్చే పేద విద్యార్థులకు అందులో బస ఏర్పాటుచేస్తామని తెలిపారు. టీబీఎస్పీ ఉపాధ్యక్షుడు వనం జ్వాలా నరసింహారావు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో బ్రాహ్మణుల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు అమలుచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్య కార్యదర్శి వీ అనిల్‌కుమార్, సభ్యులు వీ మృత్యుంజయశర్మ, అష్టకాల రామ్మోహన్‌రావు, జోషి గోపాలశర్మ, బండారు శేషగిరిరావు (భద్రకాళి శేషు), సుమలతశర్మ, సువర్ణ సులోచన, ఎం వెంకటరమణశర్మ, బొర్పట్ల హన్మంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం లబ్ధిదారులకు ఆర్థికసాయం మంజూరు పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్. చిత్రంలో ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ జీఎంసీలో వైద్యుల నియామకం

■ ఒప్పంద ప్రాతిపదికన.. 12న ఇంటర్వ్యూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాల, జనరల్ హాస్పిటల్‌లో ఏడాదిపాటు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు వైద్యుల నియామకం చేపట్టనున్నట్లు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ కే ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 ప్రొఫెసర్, 3 అసోసియేట్ ప్రొఫెసర్, 5 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు www.gmcnzb.org వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా ఈ నెల 12న నిజామాబాద్ జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. రూ.1.90 లక్షల గౌరవవేతనంతో తొమ్మిది ప్రొఫెసర్ పోస్టులను, రూ.1.50 లక్షల గౌరవ వేతనంలో మూడు అసోసియేట్ ప్రొఫెసర్, రూ.1.25 లక్షల గౌరవవేతనంతో ఐదు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఎన్నికల తరువాతే విభజన సమస్యల పరిష్కారం!

■ వాయిదాపడుతూ వస్తున్న కేంద్రహోంశాఖ సమావేశం
■ ఏపీలో బడ్జెట్ సమావేశాలతో ఫిబ్రవరి 1 నుంచి 18కి వాయిదా
■ ఆర్థికసంఘం పర్యటన నేపథ్యంలో మళ్లీ వాయిదా కోరనున్న తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్ర విభజన సమస్యలు ఇప్పట్లో పరిష్కారమయ్యే మార్గం కనిపించడం లేదు. ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టం అమల్లోకి వచ్చిన తరువాత 2014 జూన్ 2వ తేదీని కేంద్రం అపాయింటెడ్ డేగా నిర్ణయించింది. ఆ రోజు నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిం ది. రెండురాష్ట్రాల మధ్య ఉద్యోగులు, సంస్థల విభజన తాత్కాలిక ప్రాతిపదికన హడావిడిగా జరిగింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, సంస్థల విభజన, ఆస్తులు, అప్పులు పంపకం కోసం కమిటీలు వేశారు. ఈ కమిటీల ద్వారా పరిష్కారం కాని సమస్యలను కేంద్రం ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తున్నది. అయితే, నాలుగున్నరేండ్లు పూర్తవుతున్నా ఇంకా అనేక సమస్యలు అలాగే మిగిలిఉన్నాయి. దీంతో కేంద్ర హోం శాఖ ఎనిమిది అంశాల ప్రాతిపదికగా ఫిబ్రవరి 1న రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. కానీ, రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు ఉన్నందున తాము రాలేమని, మరో తేదీని నిర్ణయించాలని ఏపీ కోరింది. దీంతో సమావేశాన్ని వాయిదావేసి ఫిబ్రవరి 18న నిర్వహించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించింది. అయితే, ఈ నెల 18 నుంచే 15వ ఆర్థిక సంఘం తెలంగాణ పర్యటనకు రానున్నది. హైదరాబాద్‌లో మూడురోజుల పాటు ఆర్థిక సంఘం సమావేశాలు నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సీఎస్, రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శులు ఢిల్లీ వెళ్లడానికి వీలు కాదు. ఈ పరిస్థితులను వివరిస్తూ 18న నిర్వహించే సమావేశాన్ని వాయిదావేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర హోంశాఖను కోరనున్నది. ఆ రోజు జరిగే సమావేశం వాయిదాపడితే ఇక సాధారణ ఎన్నికల తరువాతే జరిగే అవకాశం ఉంటుంది. ఫిబ్రవరి 25వ తేదీ తరువాత ఏ క్షణమైనా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదలచేసే అవకాశం ఉండటంతో సాధారణ ఎన్నికల తరువాతనే విభజన సమావేశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

జనాభా కాదు.. అభివృద్ధే ప్రాతిపదిక

■ ఆర్థిక సంఘానికి నివేదించనున్న రాష్ట్ర ప్రభుత్వం
■ జీవన ప్రమాణాలనూ పరిగణనలోకి తీసుకోవాలి
■ ఉత్తరాది రాష్ట్రాలు, ఏపీతో పోల్చితే వాటాలో తెలంగాణకు అన్యాయం
■ 18 నుంచి ఆర్థికసంఘం పర్యటన


ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి నిధుల విడుదలలో జనాభా, పేదరికం కాకుండా.. అభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, పన్నుల రాబడిని ప్రాతిపదికగా తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం.. ఆర్థిక సంఘాన్ని కోరనున్నది. రాష్ట్రాలకు వాటా చెల్లింపుల్లో ఆర్థికసంఘం మార్గదర్శకాలను మార్చాలని డిమాండ్ చేయనున్నది. ఫైనాన్స్‌కమిషన్ నిబంధనలు అభివృద్ధి చెందుతున్న, ఆర్థికంగా బలపడుతున్న రాష్ట్రాలకు ఏ విధంగా ప్రతిబంధకంగా మారనున్నాయో వివరించనున్నది. ఈ నెల 18 నుంచి రాష్ట్రంలో పర్యటించనున్న 15వ ఆర్థిక సంఘానికి ఈ మేరకు నివేదిక సమర్పించేందుకు ఆర్థికశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు నిధుల వ్యయం, కేటాయింపు లక్ష్యాలు, అవసరమైన నిధులు, ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, గతంలో కేటాయించిన నిధులు తదితర అంశాలపై పూర్తి వివరాలతో ఇప్పటికే సమగ్ర నివేదికను రూపొందించారు. మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ, తెలంగాణకు హరితహారం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, గురుకుల పాఠశాలల ఏర్పాటు, జనాభా నియంత్రణ, సులభతర వాణిజ్య విధానం తదితర పథకాలు, పరిపాలనా సంస్కరణల ఫలితాలపై సమగ్ర నివేదిక తయారుచేసి.. వాటి ఆధారంగా గ్రాంట్లు పొందాలని నిర్ణయించారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులు స్థానిక సంస్థల గ్రాంట్లపై దృష్టి సారించారు. ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాలు ఎలా ఉండాలి.. రాష్ట్ర ప్రత్యేక అవసరాలు ఏమిటనే విషయంపై ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి పూర్తిస్థాయిలో కసరత్తు చేశారు.

నిధుల కేటాయింపులో అన్యాయం..

కేంద్రపన్నుల ద్వారా వచ్చిన మొత్తం రాబడిలో 42 శాతం నిధులను ఆర్థికసంఘం సిఫారసు మేరకు కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంచుతుంది. ఆయా రాష్ట్రాల జనాభా నిష్పత్తి, పేదరికాన్ని ప్రధానంగా ఆధారం చేసుకుని వీటిని కేటాయిస్తుంది. దీనిప్రకారం తెలంగాణకు మొత్తం పన్నుల రాబడిలో 2.47 శాతం నిధులు వస్తున్నాయి. తలసరి ఆదాయంతోపాటు, రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) అంచనాలకు మించి పెరుగుతున్నది. అయితే అదేస్థాయిలో కేంద్రం పన్నుల వాటాలో రాబడి తగ్గిపోతున్నది. సొంత వనరులను ఉపయోగించుకుని సంపదను పెంచుకుంటున్న తెలంగాణ వంటి రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వ విధానాలు ప్రతిబంధకంగా మారాయి. ఆర్థిక క్రమశిక్షణతో ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోతున్న తెలంగాణకు కేంద్రం నుంచి ప్రోత్సాహం అందకపోవడమే కాకుండా పన్నుల వాటాలో కోత పడుతున్నది. రాష్ట్రప్రభుత్వ ప్రగతికాముక విధానాలు, ఆర్థిక 'క్రమశిక్షణ' ఒకరకంగా 'శిక్ష'గా మారుతున్నది. నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా.. అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించకుండా, ఆర్థికంగా గాడితప్పిన రాష్ట్రాలు కేంద్ర పన్నుల వాటాలో అధిక ప్రయోజనం పొందుతున్నాయి. ఇందులో ఉత్తరాది రాష్ట్రాలు ముందున్నాయి. కేంద్ర పన్నుల వాటాలో బీహార్‌కు 10.9 శాతం , ఉత్తరప్రదేశ్‌కు 19.677 శాతం, మధ్యప్రదేశ్‌కు 7.55 శాతం, పశ్చిమబెంగాల్‌కు 7.264 శాతం వాటా లభిస్తుండగా.. అన్ని రంగాల్లో దూసుకుపోతూ కేంద్రానికి అత్యధిక ఆదాయం ఇస్తున్న రాష్ట్రాల్లో అగ్రభాగాన ఉన్న తెలంగాణకు మాత్రం కేవలం 2.44 శాతం పన్నుల వాటా రావడం గమనార్హం. పొరుగు రాష్ట్రం ఏపీకీ రాబడి తక్కువ ఉన్నా జనాభా,ఆర్థిక లోటు ప్రాతిపదికన కేంద్ర పన్నులలో 4.31 శాతం వాటా ఇస్తున్నది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ప్రత్యేక దృష్టితో చూడాలని, ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇవ్వాలన్న తెలంగాణ డిమాండ్‌నూ పట్టించుకోవడం లేదు. మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ వంటి బృహత్తర ప్రజోపయోగ పనులకు ఆర్థిక సాయం అందించాలనే నీతిఆయోగ్ సూచనను, 14వ ఆర్థికసంఘం సిఫారసును పెడచెవినపెట్టింది.

ఆర్థిక సంఘం పర్యటనపై సమీక్ష

ఎస్కే సింగ్ నేతృత్వంలోని పదిహేనవ ఆర్థిక సంఘం రాష్ట్రంలో పర్యటించనున్న నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, నిధులు, గ్రాంట్లకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదికను సిద్ధంచేయాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. వారంరోజుల్లోగా పూర్తినివేదికను అందజేయాలని సూచించారు. ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన అంశాలపై మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 20 వరకు 15వ ఆర్థిక సంఘం రాష్ట్రంలో పర్యటిస్తుందని తెలిపారు. 18న గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమవుతుందని చెప్పారు. 19న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో భేటీ అవుతుందన్నారు. 20న ఆర్థిక నిపుణులతో సమావేశమై అనంతరం క్షేత్రస్థాయి పర్యటనకు వెళుతుందని వివరించారు. 2020-25 సంవత్సరాల మధ్య రాష్ట్రానికి ఎన్ని నిధులు అవసరమనే విషయంపై సమగ్ర నివేదికను రూపొందించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇంధన, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌తివారీ, వివిధశాఖల ముఖ్యకార్యదర్శులు సోమేశ్‌కుమార్, అరవింద్‌కుమార్, శాంతికుమారి, సునీల్‌శర్మ, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.



రైటప్

ఎన్నార్సీని ఛిన్నాభిన్నం చేస్తున్నారు


- కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- గడువును పొడిగించేదిలేదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అసోంలో నిర్వహిస్తున్న నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్నార్సీ) విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. ఎన్నార్సీ పనులను అడ్డుకోవాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తున్నదని మండిపడింది. ఎన్నికల విధుల్లో కేంద్ర సాయుధ బలగాలు పోషించాల్సిన పాత్రను దృష్టిలో ఉంచుకుని ఎన్నార్సీ పనులను రెండు వారాలపాటు నిలిపివేయాలని కేంద్ర హోంశాఖ విజ్ఞప్తి చేయడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఎన్నార్సీ ప్రక్రియను పూర్తిచేసేందుకు నిర్దేశించిన గడువు (జూలై 31)ను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ప్రసక్తే లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎన్నార్సీ ప్రక్రియను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించడంలేదని, ఈ మొత్తం ప్రక్రియను ఛిన్నాభిన్నం చేసేందుకు కేంద్ర హోంశాఖ ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తున్నదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నార్సీ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా కొందరు అసోం అధికారులను ఎన్నికల విధుల నుంచి మినహాయించే అంశాన్ని పరిశీలించాలని ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు సూచించింది.

గణాంకాలు ఎప్పటికప్పుడు విడుదల చేయాల్సిందే

సర్కార్ అలసత్వాన్ని నిరసిస్తూ రాజీనామా చేశా: ఎన్ఎస్సీ మాజీ చైర్మన్ మోహనన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఎవరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా నిర్దిష్ట గడువు ప్రకారం అధికారిక సమాచారాన్ని విడుదల చేయాల్సిందేనని జాతీయ గణాంకాల కమిషన్ (ఎన్ఎస్సీ) మాజీ తాత్కాలిక చైర్మన్ పీసీ మోహనన్ స్పష్టం చేశారు. లేకపోతే దానికి విశ్వసనీయత ఉండదని పేర్కొన్నారు. ఉద్యోగాలు, నిరుద్యోగులపై నిర్వహించిన సర్వే సారాంశాన్ని విడుదల చేయడంలో జాప్యాన్ని నిరసిస్తూ గత నెల 28న మోహనన్‌తోపాటు మరో ఎన్ఎస్సీ సభ్యురాలు జే మీనాక్షి తమ పదవులకు రాజీనామా చేశారు. తర్వాత మూడు రోజులకే ఒక ఆంగ్ల దినపత్రికలో నిరుద్యోగ సమస్య 45 ఏండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నదన్న వార్త ప్రచురితమైంది. దీంతో రాజకీయంగా పెద్ద కలకలమే చెలరేగింది. మోహనన్ ఇచ్చిన సమాచారంతోనే సదరు ఆంగ్ల దినపత్రిక సదరు కథనం ప్రచురించినట్లు వార్తలొచ్చాయి. కానీ తాము ఆ పని చేయలేదని మోహనన్ పేర్కొన్నారు. ఇటీవల ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్ఎస్సీ మాజీ తాత్కాలిక చైర్మన్ మోహనన్.. సమాచారం విడుదలలో సర్కార్ జాప్యానికి నిరసనగా తన పదవికి రాజీనామా చేసినందుకు విచార పడటం లేదని స్పష్టం చేశారు. సాధారణంగానైతే గతేడాది డిసెంబర్ ఐదో తేదీన ఎన్ఎస్సీ ఆమోదించిన నివేదికను కేంద్రం త్వరలోనే విడుదల చేస్తుందని భావించినా అలా జరుగలేదన్నారు.

దీక్ష విరమించిన హజారే

- మహారాష్ట్ర సీఎంతో చర్చలు ఫలప్రదం
- డిమాండ్లను ఒప్పుకున్న ప్రభుత్వం



హజారేతో దీక్ష విరమింపజేస్తున్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్

రాలెగావ్ సిద్ధి (మహారాష్ట్ర), ఫిబ్రవరి 5: కేంద్రంలో లోక్‌పాల్‌ను, రాష్ట్రాల్లో లోకాయుక్తాలను ఏర్పాటు చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించడానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా నిరవధిక నిరహార దీక్ష చేస్తున్న ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష విరమించారు. మంగళవారం మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, కేంద్రమంత్రులు రాధామోహన్ సింగ్, సుభాష్ బామ్రె, మహారాష్ట్ర మంత్రి గిరిష్ మహజన్ తదితరులు దీక్షా స్థలికి వెళ్లి పలు దఫాలు హజారేతో చర్చలు జరిపారు. డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకుంటున్నదని ఫడ్నవీస్ చెప్పడంతో హజారే దీక్షను విరమించారు. అహ్మద్‌నగర్ జిల్లాలోని తన స్వగ్రామం రాలెగావ్ సిద్ధిలో ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్న హజారే వారం రోజుల్లో 4.30 కిలోల బరువు తగ్గారు.

ముప్పేట దాడి

ప్రపంచం ఎదుట మూడు భారీ సవాళ్లు

ఒంటరితనం, వాతావరణ మార్పులు, ఆర్థిక అసమానతలు

నేడు ప్రపంచానికి పది ప్రధాన ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రపంచ ఆర్థిక ఫోరం ఇటీవల గ్లోబల్ రిస్క్స్-2019 పేరిట విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అవి వాతావరణ పరిస్థితులు, సమాజంలో పెరుగుతున్న ఒంటరితనం, ప్రకృతి విపత్తులు, డేటా మోసాలు లేదా చోరీ, సైబర్‌దాడులు, సామూహిక విధ్వంసక ఆయుధాలు, జల సంక్షోభం, మానవ తప్పిదాల వల్ల కలిగే ప్రకృతి విపత్తులు (చమురు పైకి ఎగచిమ్మడం, అణుధార్మిక కాలుష్యం), ఆర్థిక సంక్షోభం, జీవవైవిధ్య నష్టం, పర్యావరణ వ్యవస్థ పతనం .వీటిలో మూడింటిని అతి ప్రమాదమైనవిగా అది వివరించింది. అవి ఒంటరితనం, వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభం.

ఏకాకి జీవితం



మానసిక ఉల్లాసం కోసం వ్యాయామం చేయాలని, ఫోన్ వినియోగం తగ్గించాలని, వినోదం అందించే కార్యక్రమాల్లో పాల్గొనాలని, పౌష్టికాహారం తినాలని.. ఇవేవీ పనిచేయకపోతే వైద్యుని వద్దకు వెళ్లాలని చెప్తుంటారు. మానసిక ఆరోగ్యానికి ప్రధాన ముప్పు ఒంటరితనం అని, ప్రపంచానికి అది పెద్ద సవాలుగా మారుతున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒంటరి జీవుల సంఖ్య పెరుగుతుండగా, అమెరికా, బ్రిటన్, జపాన్ దేశాలలో వీరి సంఖ్య కొంత ఎక్కువగా ఉన్నట్టు ఇటీవల జరిగిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. గత కొన్ని దశాబ్దాలలో తమకు నమ్మకమైన ఒక్క ఆప్తుడు కూడా లేడని చెప్పే వారి సంఖ్య అమెరికాలో మూడింతలు పెరిగింది. అమెరికా, బ్రిటన్, జపాన్ దేశాలలో మూడింట రెండువంతుల మంది ప్రజలు తమకు అండగా నిలిచే స్నేహితులు లేదా బంధువులు చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారని లేదా అసలు ఎవరూ లేరని చెప్తున్నారు. వయోవృద్ధులలో వీరి సంఖ్య గణనీయంగా ఉన్నట్టు తెలుస్తున్నది. యువత, టీనేజర్లు కూడా వివిధ కారణాల రీత్యా ఒంటరిగా జీవిస్తున్నారు. పారిస్ నగర జనాభాలో 50 శాతం మంది, స్టాక్‌హోం నగరంలో 60 శాతం మంది ఒంటరి జీవులంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఆధునిక జీవన విధానాల కారణంగా సామాజిక సంబంధాలు తగ్గిపోయి అనేకులు ఏకాకులుగా మిగిలిపోతున్నారు. మానసిక ఉల్లాసానికి సానుకూలమైన సామాజిక సంబంధాలు ఎంతో అవసరం. పట్టణీకరణ వల్ల కుటుంబంతో అనుబంధాలు బలహీనపడుతున్నాయి. వారానికి సగటున 24 గంటల చొప్పున ప్రజలు ఆన్‌లైన్‌లో ఉంటున్నట్టు ఒక అధ్యయనం వెల్లడించింది. ఈ ఒంటరితనం ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావం చూపుతున్నదని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ తెలిపింది. బ్రిటన్‌లో కుటుంబాలుగా జీవిస్తున్న వారి ఖర్చు కన్నా ఒంటరిగా జీవిస్తున్న వారి ఖర్చు సగటున ఏటా ఆరువేల పౌండ్లు అధికమని పేర్కొంది. 2010లో ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రభావం రెండున్నర లక్షల కోట్ల డాలర్లుగా ఉందని తెలిపింది. ఒంటరి జీవులలో నిరాశా నిస్పృహలకు, మానసిక రుగ్మతలకు ఇది కూడా ఒక కారణమని తెలుస్తున్నది.

విపత్తులతో భూమికి భారీ ముప్పు



ప్రపంచాన్ని వేధిస్తున్న మరో ప్రధాన సమస్య వాతావరణ మార్పులు. వాతావరణ మార్పుల వల్ల కలుగుతున్న ముప్పును 'ప్రపంచం నిద్ర మత్తులో విపత్తు వైపు నడుస్తున్నది' అని ప్రపంచ ఆర్థిక ఫోరం వ్యాఖ్యానించింది. వాతావరణ మార్పుల వల్ల భూగ్రహానికి భారీ ముప్పు పొంచి ఉన్నదని ఆ నివేదిక హెచ్చరించింది. గత సంవత్సరం ఫిలిప్పీన్స్ నుంచి అమెరికా వరకు భీకరమైన తుఫానులు సంభవించాయి. ఆస్ట్రేలియా నుంచి చైనా మీదుగా కాలిఫోర్నియా వరకు అడవులు అగ్నికి ఆహుతయ్యాయి. జపాన్ నుంచి భారత్ వరకు వరదలు ముంచెత్తాయి. ఐరోపా నుంచి ఆర్కిటిక్ వరకు వడగాలులు అదరగొట్టాయి. ఈ ప్రకృతి విపత్తులతో కొన్ని లక్షల కోట్ల రూపాయల విలువైన సంపద, కొన్ని వేల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయాము. ఈ విపత్తుల వల్ల 2017లో దాదాపు నాలుగు కోట్ల మంది ఆహార కొరతను ఎదుర్కొన్నారు. కర్బన ఉద్గారాల విడుదలను గణనీయంగా తగ్గించకపోతే ఈ శతాబ్దంలో ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగవచ్చని తెలిపారు. ఈ మార్పుల వల్ల మానవులకే కాకుండా వన్యమృగాలకు కూడా ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు.

తీవ్రమవుతున్న అసమానతలు



పలు దేశాలలోని ప్రభుత్వాలు, పాలకులు అంతర్జాతీయ సంబంధాలను, నిబంధనలను బేఖాతరు చేస్తుండటంతో ప్రపంచ ఆర్థిక పురోగతికి ముప్పు వాటిల్లుతున్నది. ప్రపంచీకరణ కారణంగా కొంతకాలం ముందుకు సాగిన ఆర్థికాభివృద్ధి ఇప్పుడు తిరోగమదిశగా సాగుతున్నది. అగ్ర రాజ్యాల మధ్య వ్యాపార పోటీ తీవ్ర స్థాయికి చేరుతుండగా, వృద్ధి రేటు దిగజారుతున్నది. మరోవైపు వర్ధమాన దేశాలపై అప్పుల భారం పెరుగుతున్నది. 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం నాటికంటే ప్రపంచ దేశాలపై ఉన్న అప్పుల భారం ప్రస్తుతం అధికంగా (జీడీపీలో 250 శాతం) ఉన్నట్టు గ్లోబల్ రిస్క్స్ నివేదిక వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా జీడీపీ పెరుగుదల 2018లో 2.4 శాతం ఉండగా, అది 2019లో 2.1 శాతానికి తగ్గిపోగలదని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2022 నాటికి జీడీపీ 1.5శాతానికి పడిపోగలదని తెలిపింది. అగ్ర రాజ్యాలపై జీడీపీ వృద్ధి రేటు ప్రభావం అంతగా లేకపోయినా చైనా, భారత్ వంటి వర్ధమాన దేశాలు తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొంది. ఓ వైపు ఆదాయం పెరుగుతున్నప్పటికీ ఆ సంపద కొందరి వద్దనే పోగుపడుతున్నది. మరోసారి ఆర్థిక సంక్షోభం వస్తే మునుపటి సహకారం, మద్దతు లభించకపోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

-నేషనల్ డెస్క్

బోఫోర్స్ కేసులో ఓ అధికారి అనుమానాస్పద మృతి

సీబీఐ ప్రశ్నించిన కొద్ది రోజులకే మరణం

భోపాల్ /జబల్‌పూర్: బోఫోర్స్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారి అనుమానాస్పదస్థితిలో మరణించారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు భావిస్తుండగా.. హత్య చేశారని ఆయన భార్య ఆరోపిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న గన్స్ క్యారేజ్ ఫ్యాక్టరీ (జీసీఎఫ్)లో ఎస్‌సీ కతువా జూనియర్ వర్క్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 17 నుంచి కతువా కనిపించకపోవడంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు జీసీఎఫ్ వెనుక ఉన్న సెక్షన్ 2 ప్రాంతంలో కతువా మృతదేహం లభించింది.

12వ తేదీ వరకు తుంబ్డేని అరెస్టు చేయం

బాంబే హైకోర్టుకు తెలిపిన పుణె పోలీసులు

ముంబై: సామాజిక కార్యకర్త ప్రొఫెసర్ తేల్‌ఆనంద్ తుంబ్డేను ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి వరకు అరెస్టు చేయబోమని పుణె పోలీసులు బాంబే హైకోర్టుకు తెలియజేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది అరుణా పాయ్ మంగళవారం జస్టిస్ ఎన్‌డబ్ల్యూ సాంబ్రే నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఈ ప్రకటన చేశారు. ఎల్గార్ పరిషత్-కొరెగావ్ భీమా కేసులో ముందస్తు బెయిలు కోసం ఆనంద్ తేల్‌తుంబ్డే దాఖలు చేసుకున్న పిటిషన్‌పై ఈ ధర్మాసనం విచారణ జరుపుతున్నది.

అబుదాబీలో పోప్ చారిత్రక సభ

అబుదాబీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబీలోని జాయెద్ స్పోర్ట్స్ స్టేడియంలో సుమారు 1.70 లక్షల మంది క్యాథలిక్‌లతో మంగళవారం జరిగిన చారిత్రక సభలో పోప్ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. స్టేడియంలో బహిరంగ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మిడిల్ ఈస్ట్ దేశాల్లో అంతర్యుద్ధాలకు చరమగీతం పలికి పౌరులందరి హక్కులను కాపాడాలని సూచించారు.

అందరూ నాయకులే!

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం హిమాచల్‌ప్రదేశ్‌లో జంబో కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారు. పీసీసీ కొత్త చీఫ్ కుల్దీప్ సింగ్ రాథోడ్ నేతృత్వంలోని ఈ కమిటీలో ఏకంగా 15 మందికి ఉపాధ్యక్షులుగా, 18 మందికి ప్రధాన కార్యదర్శులుగా, మరో 68 మందికి కార్యదర్శులుగా చోటు కల్పించడం విశేషం. హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్యను పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాహుల్.. వీరభద్ర సింగ్, ఆయన భార్య ప్రతిభ (మాజీ ఎంపీ) తదితరులకు శాశ్వత ఆహ్వానితులుగా చోటు కల్పించారు.

రోడ్ల విస్తరణపై ఆర్‌అండ్‌బీ సమావేశం నేడు

గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీపై సమగ్ర ప్రణాళిక తయారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే ఐదేండ్లలో రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, రహదారుల విస్తరణ, గ్రామాలకు రోడ్డుసౌకర్యాల గురించి సమగ్ర ప్రణాళిక తయారీపై చర్చించేందుకు బుధవారం రోడ్లు భవనాలశాఖ స్ట్రాటజిక్ సమావేశాన్ని నిర్వహిస్తున్నది. న్యాక్‌లో జరిగే ఈ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రోడ్లు, విస్తరించాల్సిన రహదారులు తదితర అంశాలపై చర్చిస్తారు. రాష్ట్రంలో అన్నిరకాల రోడ్లు కలిసి 29,679 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. 95 శాతం గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ ఉన్నది. మిగిలిన 5 శాతం కనెక్టివిటీ కోసం అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రోడ్డు కనెక్టివిటీని విధిగా ఏర్పాటుచేయనున్నారు. అలాగే మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్‌లేన్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగులేన్ల రోడ్డు సౌకర్యాన్ని 100 శాతం కల్పించే లక్ష్యాన్ని ఇప్పటికే ఆర్‌అండ్‌బీ శాఖ పూర్తిచేసింది. గత నాలుగున్నరేండ్లలో 312 వంతెనలను పూర్తిచేసింది. 130 చెక్‌డ్యాంలు పూర్తిచేసింది.

కోర్టుల్లో మౌలిక సదుపాయాలు

- అధికారుల సమావేశంలో సీఎస్

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి తెలిపారు. న్యాయస్థానాల్లో సౌకర్యాల కల్పనపై మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లో కోర్టు భవనాలు, నివాసాల పనులను వేగవంతంచేయాలని ఆదేశించారు.కోర్టుల్లో ఖాళీ పోస్టులను ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం భర్తీచేయాలన్నారు. సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయవాది అగర్వాల్, ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, సునీల్‌శర్మ, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.



మంగళ వారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషితో సమావేశమైన కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుధామిశ్రా.చిత్రంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, రాజేశ్వర్ తివారి, రాహుల్‌బొజ్జా తదితరులు ఉన్నారు.

రైతుబంధే పెద్ద పథకం

మొదటిపేజీ తరువాయి...

ఉంటుందన్నారు. రైతుబంధుతో కలిపి అమలు చేస్తామనే అంశంపై రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని చెప్పారు. పీఎంకేఎస్ఎన్‌ను మార్చి నుంచి అమలుచేయనున్నట్టు వెల్లడించారు. పీఎంకేఎస్‌వై పథకం గురించి కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వివరించారని.. ఇప్పటికే రైతులకు సంబంధించిన అన్నివివరాలు ఉండటంతో తెలంగాణ మొదటగా ఈ పథకాన్ని విజయవంతంగా అమలుచేస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారని సీఎస్ జోషి తెలిపారు. సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి , కమిషనర్ రాహుల్ బొజ్జా, అదనపు కమిషనర్ విజయ్‌కుమార్, సీసీఎల్ఏ డైరెక్టర్ కరుణ పాల్గొన్నారు.

మార్గదర్శకాల తిరకాసు..

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలుపై కేంద్రప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు పెద్ద తిరకాసుగా కనిపిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం ఐదెకరాల సాగు భూమికి ఏడాదికి రూ.6 వేలు మూడు విడతలుగా అమలుచేస్తామని ప్రకటించింది. దీంతోపాటు అనేక నిబంధనలూ విధించింది. రైతుకు కాకుండా.. కుటుంబం మొత్తానికి కలిపి 5 ఎకరాలలోపు ఉంటేనే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం వర్తించనున్నట్టు పేర్కొన్నది. ఒక వ్యక్తికి, లేదా కుటుంబసభ్యులకు ఎన్నిచోట్ల సాగుభూమి ఉన్నా ఐదెకరాలకు మించి ఉండరాదు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పెన్షనర్లు, ఐటీ చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులను అనర్హులుగా పేర్కొన్నది. పీఎంకేఎస్ఎన్‌తో పోల్చితే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకం మార్గదర్శకాలు చాలా పారదర్శకంగా ఉన్నాయి. రాష్ట్రంలో చిన్న, సన్నకారు, పెద్ద రైతులు అనే తేడాలేకుండా.. సాగుభూమి ఉన్నవారందరికీ లబ్ధి చేకూరుతున్నది. కుటుంబంలో ఒక్కొక్కరికి ఎన్ని ఎకరాలు ఉన్నా.. అందరికీ వర్తిస్తుంది.

ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి

- 4,28,855కు చేరిన లబ్ధిదారులు
- ఇప్పటివరకు సర్కారు సాయం రూ.2763.99కోట్లు





హైదరాబాద్, నమస్తే తెలంగాణ :

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెండ్లి భారం కావద్దన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారుల సంఖ్య 4,28,855కు చేరింది. ఈ పథకం అమలుతో తల్లిదండ్రులు అప్పుల బాధ లేకుండా.. ఆడబిడ్డకు ఘనంగా పెండ్లిచేసి అత్తారింటికి పంపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు కల్యాణలక్ష్మి పేరిట, మైనార్టీలకు షాదీముబారక్ పేరిట ఈ పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పటివరకు రూ. 2763.99 కోట్లు ఆర్థిక సహాయం అందించడం విశేషం. సోమవారం ఈ పథకాల లబ్ధిదారుల సంఖ్య 4,28,855 మందికి చేరింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ఆన్‌లైన్‌లో నమోదుచేసుకునే వారి సంఖ్య ఏటేటా అధికమవుతున్నది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారు 5,49,072 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో అర్హత కలిగిన 4,28,855 మంది ఆర్థిక సహాయం దక్కింది. కల్యాణలక్ష్మి పథకం కింద మొదట రూ.51వేలు అందించే సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.75,116కు పెంచింది. కాగా పెరుగుతున్న ఖర్చులు, లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.00,116కు ఆర్థిక సహాయాన్ని పెంపుదల చేసింది.

లబ్ధిదారుల సంఖ్య..ఆర్థిక సహాయం

విభాగం	2014-15	2015-16	2016-17	2017-18	2018-19	లబ్ధిదారులు	రూ.కోట్లల్లో
ఎస్సీ	5,159	30,614	25,340	25,223	16,071	1,02,407	626.31
ఎస్టీ	2,472	17,736	14,715	16,326	10,660	61,909	385.56
మైనార్టీ	5,414	27,446	27,383	24,927	21,327	1,06,497	655.17
బీసీ	—	—	35,652	61,469	49,989	1,47,110	1017.94
ఈబీసీ	—	—	—	3,722	7,210	10,932	79.01
మొత్తం	13,045	75,796	1,03,090	1,31,667	1,05,257	4,28,855	2763.99

సకాలంలో చెల్లింపులు



కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలకు ప్రభుత్వం నిధులు ముందుగానే సమకూర్చుతున్న కారణంగా లబ్ధిదారులకు సకాలంలో చెల్లింపులు చేసే అవకాశం ఏర్పడింది. ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెరుగడంతో అధికసంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లాల వారీగా అర్హుల ఎంపికను వేగవంతంగా చేపట్టి లబ్ధిదారులకు సహాయం అందించగలుగుతున్నాం.

- పీ కరుణాకర్, ఎస్సీ అభివృద్ధిశాఖ సంచాలకులు

సీటు బెల్టులు వాడేది ఏడుశాతమే!

వెనుక సీట్లోనివారు కూడా సీటు బెల్టు ధరించాలి ▪ అవగాహన లేక.. నిర్లక్ష్యంతో అనేక దుర్మరణాలు

పదేండ్లలో చనిపోయిన చిన్నారులే 55వేలమంది ▪ నిస్సాన్ ఇండియా, సేవ్ లైఫ్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీటు బెల్టు పెట్టుకోవడంలో ప్రదర్శించే చిన్న నిర్లక్ష్యం నిండు ప్రాణాలను తీస్తున్నది. సీటు బెల్టు వినియోగిస్తే రోడ్డు ప్రమాదాల్లో 20% మరణాలను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్తున్నది. అయినా అవగాహన పెరుగడం లేదు. మన దేశంలో గత పదేండ్లలో జరిగిన రోడ్డుప్రమాదాల్లో.. సీటుబెల్టు పెట్టుకోకపోవడం వల్ల 55 వేల మంది చిన్నారులు మరణించారని నిస్సాన్ ఇండియా, సేవ్ లైఫ్ ఫౌండేషన్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇందులో దాదాపు 9,400 మంది 18 ఏండ్ల వయసులోపు విద్యార్థులే కావడం మరో విషాదం. రోడ్డు ప్రమాదాలకు కారణాలు, వాటిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సంస్థలు దేశంలోని పది నగరాల్లో సర్వే నిర్వహించాయి. ఇటీవలే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ విడుదల చేసిన ఈ నివేదికలో పలు ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి.

పరిష్కారమార్గాలివే..

వెనుక సీటులో కూర్చున్నవారు సీటుబెల్టు పెట్టుకోవడంపై అవగాహన పెంచాలి. ఈ విషయంలో చట్టం తేవాలని 24.2 శాతం మంది కోరుతుండగా, జరిమానా విధించాలని పలువురు సూచిస్తున్నారు. స్కూలు బస్సుల్లో ప్రతి చిన్నారి సీటుబెల్టు పెట్టుకోవాలనే నిబంధన పెట్టాలి. స్కూలు బస్సుల్లో సీసీ కెమెరాలను బిగించాలని అధికశాతం మంది తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ద్విచక్ర వాహనాలపై కూర్చునేవారందరూ తప్పకుండా హెల్మెట్లను వినియోగించాలనే నిబంధనను దేశవ్యాప్తంగా అమల్లోకితేవాలి.

నివేదికలోని ముఖ్యాంశాలు

- దేశంలో ఏటా దాదాపు 1.5 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. ఇలా గత దశాబ్దకాలంలో దాదాపు 13 లక్షల మంది దుర్మరణం చెందారు.
- మరణాలకు రెట్టింపు సంఖ్యలో గాయపడుతున్నారు. చికిత్స కోసం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.
- సీటు బెల్టు వాడకపోవడం వల్ల ఏటా 26వేలమంది చనిపోతున్నారు. 31వేలకుపైగా గాయపడుతున్నారు.
- మనదేశంలో సీటు బెల్టులను వినియోగించేవారు కేవలం 7 శాతం.
- 17.6% మంది సీటుబెల్టుఅసౌకర్యంగా భావిస్తున్నారు. 9.4%మంది దానివల్ల భద్రత పెద్దగా ఉండదంటున్నారు.
- సీటు బెల్టు నిబంధన గురించి తెలిసింది 37.8 శాతం మందికి మాత్రమే.
- నాలుగు చక్రాల వాహనాల్లో వెనుక సీటులో ఉన్నవారు కూడా సీటు బెల్టు వాడాలన్న సంగతి 23.90 శాతం మంది ప్రజలకు తెలియదు. 8.4 శాతం మందికి వెనుక సీటులోని బెల్టును ఎలా వినియోగించాలో తెలియదట.
- కారుల్లో తల్లిదండ్రులతో ప్రయాణించే చిన్నారుల్లో 53.2 శాతం మంది సీటు బెల్టు పెట్టుకోవడం లేదు.
- 91 శాతం మంది సీటు బెల్టు పెట్టుకోకుండా తమముందే డ్రైవింగ్ చేస్తున్నా పోలీసులు ఆపడం లేదు.
- కేవలం 11.20% స్కూలు బస్సులు/వ్యాన్లలో మాత్రమే సీటు బెల్టులు ఉన్నాయి. అయినా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. కేవలం 15.10 మంది పేరెంట్స్ మాత్రమే ఈ విషయంపై ఫిర్యాదు చేశారు.

హద్దుదాటితే లైసెన్స్ కట్!

మొదటిపేజీ తరువాయి...

కరీంనగర్, వరంగల్ రూరల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, వనపర్తి, సూర్యాపేట, ఖమ్మం, మేడ్చల్, ఉప్పల్, సంగారెడ్డి, జహీరాబాద్, మెదక్ జిల్లాల్లోనూ పలు లైసెన్సులు రద్దుచేశారు. ఓవర్‌లోడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, పరిమితికి మించి ప్రయాణికులకు తరలించిన కేసుల్లో.. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 1,310 లైసెన్సులపై వేటు పడింది. హైదరాబాద్ సౌత్‌జోన్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల్లో సగటున 700-900 లైసెన్సులు సస్పెన్షన్‌కు గురయ్యాయి.

పోలీసుల సిఫారసులే ఎక్కువ

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా దాడులు కొనసాగిస్తున్నాయి. డ్రైవింగ్ లైసెన్సుల సస్పెన్షన్‌లో పోలీస్‌శాఖ సిఫారసుచేసిన కేసులే అధికంగా ఉన్నాయి. పోలీస్‌శాఖ మొత్తం 8,672 డ్రైవింగ్ లైసెన్సుల సస్పెన్షన్‌కు సిఫారసు చేయగా, వీటిని రవాణాశాఖ అధికారులు పరిశీలించి 5,034 లైసెన్సులను సస్పెండ్ చేశారు. మిగిలిన వారికి తుది హెచ్చరికల నోటీసులు జారీచేశారు. ఇందులో డ్రంకెన్‌డ్రైవ్-1846, సెల్‌ఫోన్ డ్రైవింగ్-549, ఓవర్ స్పీడ్-65, సిగ్నల్ జంపింగ్-119, ఓవర్‌లోడ్-2,165, ఇతర కారణాలు-290 ఉన్నాయి. రవాణాశాఖ మొత్తం 7,362 లైసెన్సులను సస్పెండ్ చేసింది.

కారణం	రద్దయిన లైసెన్సులు
డ్రంకెన్ డ్రైవ్	1846
సెల్‌ఫోన్ డ్రైవింగ్	549
ఓవర్‌లోడ్	2169
గూడ్స్ వాహనాల్లో ప్రయాణికుల తరలింపు	290
ఓవర్ స్పీడ్	65
సిగ్నల్ జంపింగ్	199
నిర్లక్ష్యపు డ్రైవింగ్	7,362
మొత్తం	12,396

శాశ్వతంగా రద్దు చేసే దిశగా.. : రమేశ్, రవాణాశాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జేటీసీ

నిబంధనలను ఉల్లంఘించినవారిపై కేసు నమోదుచేసి కోర్టులో ప్రవేశపెడుతాం. కోర్టు తీర్పు ఆధారంగా ఆ వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సును సస్పెండ్ చేస్తాం. అదే వ్యక్తి మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టుబడితే లైసెన్సును శాశ్వతంగా రద్దుచేసేదిశగా ఆలోచిస్తున్నాం. పోలీస్, రవాణాశాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమన్వయంతో నిఘా పెడుతుండటంతో ప్రమాదాలు తగ్గుతున్నాయి.

ప్రశ్నించండి.. అరెస్టు చేయొద్దు

కోల్‌కతా పోలీస్ కమిషనర్ విషయంలో సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం
నిజాయితీగా సహకరించాలని రాజీవ్‌కుమార్‌కు సూచన
షిల్లాంగ్‌లోని సీబీఐ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పశ్చిమ బెంగాల్ పోలీసులకు, కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి మధ్య తలెత్తిన ఘర్షణపూరిత పరిస్థితికి సుప్రీంకోర్టు మంగళవారం తెరదించింది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించిన కేసులో సీబీఐ ముందు హాజరై, 'నిజాయితీ'గా సహకరించాలని న్యాయస్థానం కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ఆదేశించింది. అనవసరమైన వివాదాన్ని నియంత్రించేందుకు గాను ఇటు ఢిల్లీలో లేదా అటు కోల్‌కతాలో కాకుండా మధ్యస్థంగా మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని సీబీఐ కార్యాలయంలో రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించాలని సూచించింది. అదేసమయంలో కోల్‌కతా కమిషనర్‌ను అరెస్టు చేయరాదని కూడా ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం సీబీఐని ఆదేశించింది. శారదా కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను రాజీవ్ కుమార్ ధ్వంసం చేస్తున్నారన్న ఆరోపణలపై సోమవారం తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు మంగళవారం మాత్రం 'దర్యాప్తుకు ఆయన అన్ని వేళలా నిజాయితీగా సహకరిస్తారు' అన్న నమ్మకాన్ని వ్యక్తం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు వ్యతిరేకంగా సీబీఐ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ఈ నెల 18లోగా సమాధానం ఇవ్వాలని ధర్మాసనం ఆ ముగ్గురిని ఆదేశించింది. ఈ కేసులో సీబీఐ తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించగా, పశ్చిమ బెంగాల్ పోలీసుల తరఫున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. చిట్‌ఫండ్ కుంభకోణం కేసును సీబీఐకి సుప్రీంకోర్టు అప్పగించిందని గుర్తుచేసిన కేకే వేణుగోపాల్, కేసు దర్యాప్తులో కోల్‌కతా కమిషనర్ సహకరించడం లేదని





ఆరోపించారు. ఆ కుంభకోణంపై దర్యాప్తు జరిపిన సిట్‌కు నేతృత్వం వహించిన రాజీవ్‌కుమార్ తనవద్దనున్న పత్రాలను సీబీఐకి అప్పగించలేదని తెలిపారు. కొన్ని పత్రాలను తారుమారు కూడా చేశారని ఆరోపించారు. రాజీవ్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన 25 మంది సీబీఐ అధికారులను బెంగాల్ పోలీసులు బస్సులో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పారు. కొందరు పోలీసులు సీబీఐ జాయింట్ డైరెక్టర్ వికాస్ శ్రీవాస్తవ ఇంటిని చుట్టుముట్టి తలుపులు బాదుతుండగా, ఆయన భార్య పిల్లలు భయంతో బిక్కుబిక్కుమంటూ గడిపారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుసరించిన ఈ వైఖరి చూస్తే ఆ రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగాలు పూర్తిగా స్తంభించిపోయినట్టు తెలుస్తున్నదని ఆరోపించారు. ఈ వాదనలను అభిషేక్ సింఘ్వీ వ్యతిరేకించారు. కోల్‌కతా కమిషనర్‌ను వేధించేందుకు సీబీఐ ప్రయత్నించిందని ఆరోపించారు. కోల్‌కతాలో ఇటీవల పలు ప్రతిపక్ష పార్టీల భారీ బహిరంగ సభ నిర్వహించటంతో వారిపై ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు కేంద్రం చేసిన ప్రయత్నమే ఈ సీబీఐ వ్యవహారమని పేర్కొన్నారు. శారదా కుంభకోణం దర్యాప్తులో సిట్ పాత్రను సుప్రీంకోర్టు అప్పట్లో ప్రశంసించిందని, ఈ కేసు వ్యవహారాలు ఇతర రాష్ట్రాల్లో కూడా జరిగినందునే కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించిందని సింఘ్వీ గుర్తు చేశారు. రాజీవ్‌పై ఇంతవరకు ఒక్క ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు కాలేదని, చిట్‌ఫండ్ కేసుల్లో ఆయన నిందితుడు కూడా కాదని తెలిపారు. సీబీఐ దర్యాప్తుకు రాజీవ్ సహకరించడం లేదన్నది సరైనది కాదని, ఈ కేసుకు సంబంధించి తనను ఎప్పుడైనా, ఎక్కడైనా కలువవచ్చని ఆ రాష్ట్ర డీజీపీ సీబీఐకి మూడు లేఖలు రాశారని చెప్పారు. ఈ కేసును సీబీఐ ఐదేండ్లుగా దర్యాప్తు జరుపుతున్నదని, సాక్ష్యాధారాలు ధ్వంసమయ్యాయని ఇప్పుడెలా చెప్పగలరని సింఘ్వీ నిలదీశారు. కాగా, కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసంలోకి సీబీఐ అధికారులు ప్రవేశించడాన్ని సవాల్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కలకత్తా హైకోర్టు వాయిదా వేసింది.

దీదీ దాదాగిరికి అడ్డుకట్ట

- సుప్రీంకోర్టు తీర్పు మమతకు చెంపపెట్టు
- సీబీఐకి నైతిక విజయం: బీజేపీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ సీబీఐ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందేనని మంగళవారం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మమతా బెనర్జీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీజేపీ అభివర్ణించింది. సీబీఐకి ఇది నైతిక విజయమని పేర్కొంది. బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ... 'సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. పోలీస్ కమిషనర్‌తో సహా చట్టం ముందు ఎవరూ ఎక్కువ కాదని విషయం కోర్టు తీర్పు ద్వారా రుజువైంది. సుప్రీంకోర్టు తీర్పు మమతాబెనర్జీ ప్రభుత్వానికి గట్టి దెబ్బ. సీబీఐకి నైతిక విజయం' అని చెప్పారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ... మమతా బెనర్జీ రాజకీయ డ్రామాలకు సుప్రీంకోర్టు ముగింపు పలికిందని వ్యాఖ్యానించారు. దీదీ దాదాగిరికి రాజ్యాంగంతో కోర్టు అడ్డుకట్ట వేసిందని చెప్పారు. కోర్టు తీర్పు తమకు నైతిక విజయమని మమతా బెనర్జీ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మమత చేపట్టిన ధర్నాకు విపక్ష నేతలు హాజరవడంపై స్పందిస్తూ... మోసగాళ్లందరికీ అది వేదికగా మారిందని విమర్శించారు. రాజీవ్‌ను అరెస్ట్ చేయొద్దని కోర్టు ఆదేశించడాన్ని తమ విజయంగా మమత పేర్కొంటున్నారని, అయితే రాజీవ్‌ను అరెస్ట్ చేస్తామని సీబీఐ ఎప్పుడూ చెప్పలేదని ఇరానీ వివరించారు. రాజీవ్‌ను కాపాడేందుకు మమత ఎందుకు ప్రయత్నిస్తున్నారు?, ఆమెను కలవరపెట్టే సంగతులేమైనా రాజీవ్ వద్ద ఏమున్నాయి? అని ప్రశ్నించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గీయ మాట్లాడుతూ... కోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయమని చెప్పారు. మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓ పోలీస్ ఆఫీసర్‌ను కాపాడేందుకు మమత ధర్నా చేస్తున్నారు. అదే చిట్‌ఫండ్ బాధితులకు నగదు తిరిగివ్వాలని డిమాండ్ చేస్తూ ఆమె ధర్నా చేసి ఉంటే దేశ ప్రజలు హర్షించేవారు' అని ఆయన వ్యాఖ్యానించారు.



నైతిక విజయం మాదే

సుప్రీంకోర్టు తీర్పుపై మమత • ధర్నాను విరమించిన పశ్చిమ బెంగాల్ సీఎం
ఈ యుద్ధం ఇక్కడితో ఆగదు.. ఢిల్లీలో కొనసాగిస్తామని వెల్లడి
కోల్‌కతా పోలీస్ కమిషనర్ కోసం నేను పోరాడటం లేదు
ప్రజలలో విభేదాలు సృష్టిస్తున్న మోదీ సర్కార్‌పై ఉద్యమిస్తున్నామని వ్యాఖ్య

కోల్‌కతా, ఫిబ్రవరి 5: కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయరాదని, ఆయనపై ఏ నిర్బంధ చర్యలు చేపట్టరాదని సుప్రీంకోర్టు సీబీఐని ఆదేశించడం తమ నైతిక విజయమని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు అధికారులకు నైతిక బలాన్నిస్తాయన్నారు. 'భారత్‌ను కాపాడండి' అంటూ మూడు రోజులుగా ధర్నా చేస్తున్న మమత కోర్టు తీర్పు తర్వాత మంగళవారం సాయంత్రం ఆందోళన విరమిస్తున్నట్టు ప్రకటించారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉండటంతో పలువురు ప్రధాన విపక్ష నేతలను సంప్రదించాక ధర్నాను విరమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగదని ఢిల్లీలో కొనసాగిస్తామని మమత చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి తదితర నేతలు మమతను కలుసుకున్నవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ, విపక్ష నేతల బ్లాక్‌మెయిల్‌కే కేంద్రం సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించుకుంటున్నదని ఆరోపించారు. సీబీఐ అంటే తనకు ఎంతో గౌరవమని చెప్పారు. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాల అమలుకు ప్రదర్శించిన ఉత్సాహాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ పతకం చోరీ కేసు పరిష్కారంలోనూ చూపాలని ఆమె సీబీఐకి హితవు చెప్పారు. బీజేపీ బెదిరింపులకు లొంగిన వారు ఆ పార్టీలో చేరగానే, వారిపై కేసులను రద్దు చేస్తున్నారన్నారు. నందిగ్రామ్ హత్యలు, సింగూర్‌లో తాప్సీ మాలిక్ మరణంపై సీబీఐ మందకొడి దర్యాప్తు వెనుక కేంద్రం రాజకీయ ప్రతీకార చర్య ఉన్నదన్నారు.

ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్న మోదీ

'ప్రతి సమాఖ్య దేశంలో ప్రజల చేత ఎన్నికైన ఓ ప్రభుత్వం ఉంటుంది. కేంద్ర రాష్ట్రాలకు నిర్దిష్టమైన అధికార పరిధులుంటాయి. కానీ సీబీఐ ఏం చేసిందో చూడండి. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఓ అధికారిని అరెస్టు చేసేందుకు వచ్చింది. ఇది మాపై ప్రతీకారంతో తీసుకున్న చర్య మాత్రమే. రాజ్యాంగ బాధ్యతలను ఉల్లంఘించడమే' అని ఆరోపించారు. రాజీవ్‌కుమార్‌కు సీబీఐ ఐదు లేఖలు రాస్తే, వాటికీ ఆయన సమాధానం ఇచ్చారని చెప్పారు. దర్యాప్తుకు సహకరించబోమని తామెప్పుడూ చెప్పలేదన్నారు. కేవలం రాజకీయ ప్రతీకారంతోనే కేంద్రం తమపై ఈ చర్యకు దిగిందన్నారు. ఓ సీఎం ఇలా ధర్నా చేయవచ్చా అన్న ప్రశ్నకు 'కేజ్రీవాల్, జయలలిత కూడా ధర్నాలు చేశారు' అని గుర్తు చేశారు. 'సీబీఐ వ్యవహారం వెనుక ఏదో కథ ఉంది. ప్రధాని మోదీ కి వ్యతిరేకంగా మాట్లాడేందుకు ఎవరూ ధైర్యం చేయలేరు. కానీ మాది ప్రజా ఉద్యమం. మేము సమైక్యంగా పోరాడుతాం' అని మమత చెప్పారు. ప్రజల మధ్య అనవసర విభజనలు తెస్తూ దేశాన్ని ధ్వంసం చేస్తున్న వ్యక్తికి వ్యతిరేకంగానే తాము ఆందోళన చేస్తున్నామని, ఆయన ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నారని మోదీని ఉద్దేశించి పేర్కొన్నారు. 'కోల్‌కతా పోలీస్ కమిషనర్ సామాన్యుడు, 34 ఏండ్లుగా సర్వీస్‌లో ఉన్నాడు. ఆయనకోసం నేను పోరాడటం లేదు. కానీ దేశ ప్రజల కోసం పోరాడుతున్నా' అని చెప్పారు. 'మేం చట్టాన్ని గౌరవిస్తాం కానీ, ఎవరైనా ప్రజాస్వామ్య పునాదుల ధ్వంసానికి ప్రయత్నిస్తే.. మనం గర్వపడుతున్న ప్రజాస్వామిక ప్రక్రియలో ఏమీ మిగలదు. అందుకే నేను ఈ నిరసన చేపట్టాను. ఇది నా వ్యక్తిగత పోరు కాదు.. సామూహిక పోరు' అని అన్నారు.

యోగి తన రాష్ట్రంపై దృష్టి పెట్టాలి

బెంగాల్‌లో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ దిగేందుకు అనుమతి నిరాకరణపై మమత మాట్లాడుతూ, 'కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సహా పలువురు ఇతర నేతలకు అనుమతులిచ్చాం. ఇతర రాష్ట్రాల సీఎంలు పశ్చిమబెంగాల్‌ను సందర్శించడంపై మాకు ఏ అభ్యంతరం లేదు. యోగి తన సొంత రాష్ట్రంపై దృష్టి పెట్టాలి' అని అన్నారు. గత నెల 22న బెంగాల్‌లో జరిగిన ఒక సభలో అమిత్‌షా ప్రసంగించడాన్ని ప్రస్తావిస్తూ.. 'స్వైన్‌ఫ్లూ వ్యాధికి చికిత్స పొంద గానే దవాఖాన నుంచి నేరుగా ఇక్కడికి వచ్చి సభలో పాల్గొంటే మేం అభ్యంతరం పెట్టలేదు. స్వైన్‌ఫ్లూ అంటు వ్యాధి. అందువల్ల బీజేపీ కార్యకర్తలనూ మీ దగ్గరికి రానివ్వలేదని విన్నాను' అంటూ వ్యంగ్యంగా అన్నారు. గతంలో తాను బీహార్, మహారాష్ట్రలో సభల్లో పాల్గొనేందుకు వెళ్లినప్పుడు అక్కడ తనకు వసతి కల్పనకు నిరాకరించారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో తృణమూల్ నేతలకు హెలికాప్టర్లు అందకుండా వాటి యజమానులపై బీజేపీ ఒత్తిడి తెస్తున్నదని ఆరోపించారు. 'బీజేపీ ఎందుకు భయపడుతున్నది. ఈ బెదిరింపులు, ఆటంకాలతో వారు నన్ను ఆపలేరు. నేను నడుచుకుంటూ వెళ్తాను లేదా సైకిల్‌పై వెళ్తాను. లేదా ఆన్‌లైన్‌లో సామాజిక మాధ్యమాల ఆధారంగా ప్రజలను చేరుకుంటాను' అని స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఫెడరల్ ఫ్రంట్‌కు రూపకర్త మమతా బెనర్జీ అని ప్రశంసించారు. ప్రతిపక్షాల కూటమికి ఆమె మూల స్తంభం అని కొనియాడారు.

రాజీవ్ కుమార్‌పై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలి

బెంగాల్ సర్కారుకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ: సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించి క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకు కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌పై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం మంగళవారం సూచించింది. దీంతో మోదీ సర్కార్, బెంగాల్ సీఎం మమతాబెనర్జీ మధ్య 'యుద్ధం' మరింత ముదిరే అవకాశం కనిపిస్తున్నది. రాజీవ్ కుమార్‌తోపాటు మరికొంత మంది పోలీసు అధికారులు కోల్‌కతాలోని మెట్రో చానల్ వద్ద మమతాబెనర్జీతో కలిసి ధర్నాలో పాల్గొన్నట్టు తమకు సమాచారం అందిందని, ఇలా చేయడం ఆలిండియా సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని రాజీవ్ కుమార్‌పై క్రమశిక్షణా చర్యలు చేపట్టడంతో పాటు ఆ చర్యలేమిటో తమకు తెలియజేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో కేంద్ర హోంశాఖ పేర్కొన్నది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసుల్లో సీబీఐ అధికారులు ఆదివారం రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు విఫలయత్నం చేయడంతో కోల్‌కతాలోని మెట్రో చానల్ వద్ద మమతా బెనర్జీ ధర్నా ప్రారంభించిన విషయం తెలిసిందే. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం తమ రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టేందుకు సీబీఐని ఉపయోగిస్తున్నదని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు.



అవినీతికి కొమ్ముకాస్తున్న మమత

- ఆ అధికారిపై ఉన్న శ్రద్ధ పేదలపై లేదు
- ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నది
- బెంగాల్ సర్కార్‌పై విరుచుకుపడ్డ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



పురూలియాలో బీజేపీ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న యూపీ సీఎం

పురూలియా (పశ్చిమబెంగాల్), ఫిబ్రవరి 5: రెండు రోజుల కిందట పశ్చిమబెంగాల్‌లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ దిగడానికి అనుమతి నిరాకరించిన మమతా బెనర్జీ ప్రభుత్వం.. మంగళవారం కూడా ఇలాగే అనుమతి నిరాకరించింది. దీంతో యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ పశ్చిమబెంగాల్ పక్క రాష్ట్రమైన జార్ఖండ్‌లో దిగింది. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో పురూలియాకు చేరుకొని ఓ సభలో ప్రసంగించారు. ' పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ పేదల కష్టాలను గాలికివదిలేసి అవినీతిపరుడైన అధికారిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణాల కేసులో ఆ అధికారి పాత్ర ఉన్నది. అందుకే ఆయనపై మమత ఎనలేని శ్రద్ధ చూపిస్తున్నారు' అని ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. ఆ పోలీసు అధికారిని ఎందుకు కాపాడుతున్నారో మమతాబెనర్జీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఓ పోలీసు అధికారిని కాపాడటానికి మమత ఎంత తాపత్రయపడుతున్నారో మీరే చూడండి. ఒక రాష్ట్రానికి సీఎం అయిన ఆమె కుంభకోణానికి సంబంధించిన విషయాలు బహిర్గతం కాకుండా ధర్నాకు దిగడం అవమానకరం.. రాజ్యాంగ విరుద్ధం' అని తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకొస్తే వాటిని కూడా మమతాబెనర్జీ అనుమతించడం లేదని ఆరోపించారు. ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. 'బెంగాల్ ప్రజలు దుర్గామాతను పూజించకుండా మమత ప్రభుత్వం అడ్డుకుంటున్నది. మొహర్రం పేరుతో దుర్గా మాత నిమజ్జన సమయాలను మార్చింది. కానీ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇలాంటి సంస్కృతి లేదు' అని ఆదిత్యనాథ్ తెలిపారు.

ఆమె 'సూపర్ డ్రామా మాస్టర్'

కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ 'సూపర్ డ్రామా మాస్టర్' అని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించారు. 'మమతాబెనర్జీకి అన్ని విషయాలు తెలుసు. కేవలం ప్రతిపక్ష పార్టీల మధ్య ఊపు తీసుకురావడానికే ఆమె ధర్నాకు దిగారు. ఆమె సూపర్ డ్రామా మాస్టర్' అని పేర్కొన్నారు. ఓ పోలీసు కమిషనర్‌తో కలిసి ముఖ్యమంత్రి ధర్నాకు కూర్చోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో దురదృష్టకరమని తెలిపారు. దేశ సమాఖ్య వ్యవస్థను ధ్వంసం చేయడానికే ఆమె ఇలాంటి ప్రయత్నాలకు పూనుకున్నారని ఆరోపించారు. 'మమతాబెనర్జీ ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేస్తున్నారు. సీబీఐ అధికారుల దర్యాప్తునకు సహకరించాలని ఈ రోజు (మంగళవారం) సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. సీబీఐ పేరుతో మోదీకి వ్యతిరేకంగా మమతాబెనర్జీ డ్రామాలాడుతున్నారు' అని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ భయంపట్టుకున్న ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తున్నాయని, కానీ ప్రజలంతా మోదీతోనే ఉన్నారని తెలిపారు. 'బంగ్లాదేశ్ నుంచి వచ్చే చొరబాటుదారులకు మమతాబెనర్జీ ఎర్రతివాచీ పరుస్తున్నారు. కానీ సీబీఐ పశ్చిమబెంగాల్‌లో అడుగుపెట్టాలంటే ఆమె అనుమతి కావాలంట? దేశంలో ఇంతకంటే దురదృష్టం మరొకటి ఉండదు' అని కేంద్రమంత్రి చెప్పారు.

మేం నిర్దోషులం

'పే టు స్టే' కుంభకోణంలో కోర్టుకు తెలిపిన 8 మంది భారతీయులు.. బెయిల్‌పై ఒకరు విడుదల

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: పే టు స్టే కుంభకోణంలో అరెస్టయిన ఎనిమిది మంది భారతీయులు తాము నిర్దోషులమని అమెరికా కోర్టుకు తెలిపారు. అమెరికాలో అక్రమంగా ఉండేందుకు వందల మంది విద్యార్థులను నకిలీ విశ్వవిద్యాలయంలో చేర్పించారనే ఆరోపణలపై వీరిని ఇటీవల అమెరికా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మిషిగాన్‌లోని ఫెడరల్ కోర్టు ముందు వీరిని హాజరుపరచగా, తాము నిర్దోషులమంటూ వాదించారు. వీరిలో ఫణిదీప్ కర్నాటీకి 10 వేల డాలర్ల పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మిగిలిన ఏడుగురు–భరత్ కాకిరెడ్డి, సురేశ్ కందాల, ప్రేమ్ రామ్‌పీసా, సంతోష్ సామా, అవినాశ్ తక్కలపల్లి, అశ్వంత్ నూనె, నవీన్ ప్రత్తిపాటి తమ డిటెన్షన్ కొనసాగింపునకు సమ్మతించారు. అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పన్నిన వలలో పడి ఫార్మింగ్‌టన్ అనే నకిలీ విశ్వవిద్యాలయంలో చేరిన 130 మంది విద్యార్థులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వీరందరూ కూడా నిర్దోషులమని పేర్కొన్నారని ఫణిదీప్ కర్నాటీ న్యాయవాది జాన్ డబ్ల్యూ బ్రస్టర్ తెలిపారు. ట్రాప్ చేసి విద్యార్థులను పట్టుకోవడంపై అమెరికా ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఇంజనీర్ అయిన ఫణిదీప్ కర్నాటీ హెచ్1బీ వీసాపై పదేండ్ల కిందట అమెరికాకు వచ్చారు. కర్నాటీతో పాటు మరో ఏడుగురిపై మోపిన అభియోగాలు రుజువైతే ఐదేండ్లపాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. చట్టవిరుద్ధంగా అమెరికాలోనే ఉండేందుకు ఆశ్రయం కల్పించేలా వీరు వందలాది మంది విద్యార్థులను ఫార్మింగ్‌టన్ నకిలీ విశ్వవిద్యాలయంలో చేర్పించారని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు ఆరోపించారు. ఈ ప్రక్రియలో ఇమ్మిగ్రేషన్ అధికారులను మోసగించేలా విద్యార్థులతో తప్పుడు ధ్రువపత్రాలు కూడా సమర్పించారని పేర్కొన్నారు. ఈ నకిలీ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు లేరని, తరగతులు జరుగవని ఈ కుట్రలో భాగస్వాములైన అందరికీ ముందే తెలుసునని వివరించారు. నిందితులు ఉద్దేశపూర్వకంగా, లాభాపేక్షతోనే విదేశీ విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకుని ఆశ్రయం కల్పించారని ఆరోపించారు.

విద్యార్థులను కలిసేందుకు అనుమతి లభించింది

కేంద్ర ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పే టు స్టే కుంభకోణంలో అమెరికా అదుపులో ఉన్న 129 మంది భారతీయ విద్యార్థుల్లో 117 మందిని మన దేశ దౌత్య అధికారులు కలిసేందుకు అనుమతి లభించిందని కేంద్రం వెల్లడించింది. భారతీయ విద్యార్థుల డిటెన్షన్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. అమెరికాలో భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్స్ అధికారులు అమెరికా వ్యాప్తంగా 37 డిటెన్షన్ సెంటర్లను సందర్శించి ఇప్పటివరకు 117 మంది విద్యార్థులను కలిసేందుకు అనుమతి పొందారని విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. మిగిలిన 12 మందిని కలిసేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపింది.

పార్లమెంట్‌లో రగడ

- కేంద్రం జోక్యంపై తృణమూల్ నిరసన
- బీజేపీ సభ్యుడు హుకుందేవ్ వ్యాఖ్యలపై లోక్‌సభలో విపక్షాల మండిపాటు
- తృణమూల్, ఎల్జేపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- రాజ్యసభలో చైర్మన్ సూచనలను వినిపించుకోని విపక్షాలు



లోక్‌సభ నుంచి వాకౌట్ చేస్తున్న తృణమూల్ ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన ప్రభావంతో వరుసగా రెండో రోజు మంగళవారం పార్లమెంట్ ఉభయసభల్లో రభస కొనసాగింది. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టేందుకు బీజేపీ ఎంపీ హుకుందేవ్ నారాయణ్ యాదవ్ సిద్ధం అవుతండగానే తృణమూల్ సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసనకు దిగారు. స్పీకర్ సుమిత్రామహాజన్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వారు వినిపించుకోలేదు. ఈ దశలో హుకుందేవ్ స్పందిస్తూ.. ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా అవినీతి, సంఘ వ్యతిరేక శక్తులు కూటమిగా ఏర్పడుతున్నాయని వ్యాఖ్యానించారు. దీనిపై విపక్ష సభ్యులు లేచి నిలబడి నిరసన తెలిపారు. హుకుందేవ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలిగించాలని స్పీకర్‌ను అభ్యర్థించారు. అపరూప పొద్దర్ (తృణమూల్), వీణాదేవి (ఎల్జేపీ) మధ్య వాడివేడిగా సాగిన వాగ్వాదం పరస్పరం హెచ్చరికలు జారీ చేసుకునే వరకు వెళ్లింది. ఇరు పక్షాలకు చెందిన సీనియర్ సభ్యులు జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2.30 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమైనప్పుడు హుకుందేవ్ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను మహా భారతాన్ని గుర్తుచేస్తూ వచ్చే లోక్‌సభ ఎన్నికలు మంచికి, చెడుకు మధ్య పోరాటమని అభివర్ణించారు. తదుపరి కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గేను మాట్లాడాలని స్పీకర్ కోరినప్పుడు సభ ఆర్డర్‌లో లేకుండా ఎలా మాట్లాడాలని, బుధవారానికి వాయిదా వేయాలన్నారు. బుధవారం సజావుగా సభా నిర్వహణకు హామీ ఇస్తే అందుకు సిద్ధమని స్పీకర్ మహాజన్ పేర్కొన్నారు. ప్రభుత్వ పొరపాట్లపై విపక్షాలు మౌనంగా ఉండలేవని ఖర్గే చెప్పారు. హోంమంత్రి రాజ్‌నాథ్ స్పందిస్తూ ఈ రోజు మాట్లాడేవారు మాట్లాడొచ్చని, బుధవారం మాట్లాడేవారికి టైం కేటాయిస్తామన్నారు. ఆ వెంటనే విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ నిరసనలకు దిగడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనపు వ్యయం కింద రూ.1.98 లక్షల కోట్లను కేటాయించేందుకు అనుమతించాలని కోరుతూ ఆర్థికశాఖ మంత్రి పీయూష్ గోయల్ గ్రాంట్ల కోసం మూడో సప్లిమెంటరీ డిమాండ్లను సభకు సమర్పించారు.

రాజ్యసభలోనూ అదే సీన్

రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగడంతో మంగళవారం వరుసగా రెండో రోజు ఏ కార్యక్రమం చేపట్టకుండానే బుధవారానికి వాయిదా పడింది. కేంద్రం, పశ్చిమ బెంగాల్ మధ్య వివాదంపై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో ప్రస్తావించవచ్చని రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యానాయుడు చేసిన సూచనను తృణమూల్ సభ్యులు వినిపించుకోలేదు.

తప్పు చేస్తున్నామని వారికి ముందే తెలుసు

- అమెరికాలో అక్రమంగా ఉండాలనే నకిలీ వర్సిటీలో చేరారు
- ట్రంప్ సర్కార్ ఆరోపణలు
- భారత్ దౌత్య నోటీసుకు స్పందన



వాషింగ్టన్, ఫిబ్రవరి 5: 'పే టు స్టే' యూనివర్సిటీ వీసా కుంభకోణంలో అదుపులోకి తీసుకున్న 130 మంది విదేశీ విద్యార్థులకు తాము తప్పు చేస్తున్నామన్న విషయం ముందే తెలుసునని అమెరికా ప్రభుత్వం తెలిపింది. నిబంధనలను అతిక్రమంచి అమెరికాలో ఉండేందుకే వారు నకిలీ విశ్వవిద్యాలయంలో చేరానని పేర్కొంది. భారతీయ విద్యార్థుల అరెస్టుపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రభుత్వం గత శనివారం ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయానికి డెమార్ష్ (దౌత్యపరమైన నోటీసు) జారీ చేసిన విషయం తెలిసిందే. వివిధ డిటెన్షన్ సెంటర్లలో ఉన్న తమ విద్యార్థులను కలిసేందుకు దౌత్య అధికారులను అనుమతించాలని, ఆ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని అందులో కోరింది. దీనిపై అమెరికా ప్రభుత్వం తాజాగా స్పందించింది. 'ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ తరగతులు నిర్వహించదని విద్యార్థులకు ముందే తెలుసు. అక్రమంగా అమెరికాలోనే ఉండాలనే ప్రయత్నంలో తాము తప్పు చేస్తున్నామన్న విషయం కూడా వారికి తెలుసు' అని విదేశాంగ అధికార ప్రతినిధి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'పే టు స్టే' రాకెట్ గుట్టురట్టు చేసేందుకు అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ అధికారులు డెట్రాయిట్‌లో ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ పేరిట ఓ నకిలీ యూనివర్సిటీని స్థాపించి అండర్‌కవర్ ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే. వారి వలలో చిక్కుకుని సుమారు 600 మంది విద్యార్థులు ఆ వర్సిటీలో చేరారు. వీరిలో అధిక సంఖ్యలో భారతీయులు ఉన్నారు. వీరిని ఆ నకిలీ యూనివర్సిటీలో చేర్పించిన 8 మంది భారతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. వర్సిటీలో చేరిన విద్యార్థుల్లో 130 మంది అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు దేశం వదిలి వెళ్లిపోయారు. భారత విద్యార్థులను అదుపులోకి తీసుకోవడంతో అప్రమత్తమైన భారత ప్రభుత్వం విద్యార్థులను ఆదుకునేందుకు అక్కడి దౌత్య కార్యాలయ అధికారులను, భారత సంఘాలను రంగంలోకి దింపింది. భారత దౌత్య అధికారులు దేశవ్యాప్తంగా వివిధ డిటెన్షన్ సెంటర్లకు వెళ్లి భారత విద్యార్థులను కలుస్తున్నారు. విద్యార్థుల సహాయార్థం భారత దౌత్య కార్యాలయం హాట్‌లైన్‌ను తెరిచింది. నోడల్ అధికారిని కూడా నియమించింది.

రైతులపై దేశవ్యాప్త సమగ్ర సర్వే: గజేంద్రసింగ్



రైతుల పరిస్థితులను అంచనా వేసేందుకు దేశవ్యాప్తంగా సర్వే చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వారి ఆదాయం, రుణాలు, ఇతర అంశాలపై ఈ సర్వే సాగుతుందని మంగళవారం లోక్‌సభలో సభ్యుల ప్రశ్నలకు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ రాతపూర్వక సమాధానంలో చెప్పారు. ఇంతకుముందు 2012–13లో రైతుల సమస్యలపై ఎన్‌ఎస్‌ఎస్‌ఓ సర్వే జరిపింది. అలాగే సులభతర వ్యవసాయ వాణిజ్య సూచీ ఆధారంగా రాష్ట్రాలకు ర్యాంకులు ఇవ్వాలని కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తున్నది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య పోటీ తత్వాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు.



బెంగాల్‌లో ర్యాలీకి యోగి ఆదిత్యనాథ్‌కు అనుమతి నిరాకరించామనడం అబద్ధం. ముందుగా ఉత్తరప్రదేశ్‌పై శ్రద్ధ వహించమని యోగిని అడుగండి. ప్రజలు హత్య చేయబడుతున్నారు. పోలీసులు కూడా హత్యకు గురయ్యారు. ఆయన అక్కడ పోటీ చేస్తే ఓడిపోయే పరిస్థితి ఉన్నది. యూపీలో స్థానం లేని ఆయన దేశమంతా తిరుగుతున్నారు!

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

మమతాబెనర్జీ రాజ్యాంగ విరుద్ధ, అనైతిక చర్యలు పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిందని సూచిస్తున్నాయి. ప్రజాస్వామిక హక్కులు మృగ్యమయ్యాయి. ఇలాంటి పరిస్థితులు చాలా దురదృష్టకరం.

సిద్ధార్థనాథ్ సింగ్, యూపీ మంత్రి



చరిత్రలో నేడు



1998
వాషింగ్టన్ జాతీయ విమానాశ్రయం పేరు రొనాల్డ్ రీగన్ జాతీయ విమానాశ్రయంగా మార్పు.

2005
లేబర్ పార్టీ తరఫున అత్యధిక కాలం పాలించిన బ్రిటిష్ ప్రధానిగా టోనీ బ్లెయిర్ రికార్డు.





2018
మాల్దీవుల్లో అత్యవసర స్థితి ప్రకటించిన ఆ దేశ అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్.

వీసా నిబంధనలు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారన్న ఆరోపణలపై అరెస్టయిన 129 భారతీయ విద్యార్థుల ఉదంతం యువతకు కనువిప్పు కలిగించేదే. యూనివర్సిటీలో ఎలాంటి విద్యాబోధన జరుగదని, మౌలిక వసతులేవీ లేవని తెలిసి కూడా, కేవలం విద్యార్థుల పేరుతో ఉంటూ ఉద్యోగ కల్పన కోసం తాపత్రయపడిన వారు అందులో చేరి పోలీసులకు చిక్కారు. ఇదంతా అమెరికా ప్రభుత్వ నిఘా విభాగం వల పన్ని విద్యార్థులను పట్టుకున్నది. ఇలా గతంలోనూ అమెరికా చేసింది. ఇకనైనా భారతీయ యువత ఉన్నత విద్యాభ్యాసం కోసం సక్రమమైన పద్ధతిలో ప్రయత్నించాలి.

ది హిందూ

పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో జోక్యం చేసుకుంటూ, ఏకంగా ధర్నాకు దిగటం కారణంగా రాజ్యాంగ సంక్షోభానికి కాకుండా, మూక పాలనకు కారణమైనట్లయింది. శాంతి భద్రతలు, సాధారణ పరిస్థితులు పరిరక్షణకు ప్రయత్నించాల్సిన సీఎం ధర్నాకు దిగటం సమంజసం కాదు. అయితే ఈ మధ్య కాలంలో సీబీఐ కేంద్ర ప్రభుత్వ పెంపుడు చిలుకగా మారిందన్న విమర్శలు బలంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యాంగ పాలనా వ్యవస్థల పనితీరు నిష్పక్షికతకు అద్దం పట్టేట్లుగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

మరో ఘనత

రాష్ట్ర రాజధానికి మరో కీర్తి కిరీటం దక్కింది. ఐటీ, ఐటీ ఆధారిత రంగాలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ మహా నగరం భారత సిలికాన్ వ్యాలీగా ఘనకీర్తిని సాధించింది. దేశ సగటుకు మించిన ఐటీ ఎగుమతులతో దేశంలోనే హైదరాబాద్ అగ్రభాగాన నిలువటం గర్వకారణం. కేంద్ర ఐటీ, శాస్త్రసాంకేతిక శాఖ సారథ్యంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) నిర్వహిస్తున్న రెండురోజుల 'ఇండియా సాఫ్ట్' 19వ ఎడిషన్ హైదరాబాద్‌లో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభమైన సదస్సులో రెండు వందలకు పైగా దేశ విదేశీ కంపెనీలు హాజరవ్వటం సంతోషదాయకం. ఈ సదస్సు సందర్భంగా ఎగ్జిబిషన్లు, చర్చాగోష్ఠుల ద్వారా ఐటీ కంపెనీలు మరింతగా ప్రయోజనం పొందే అవకాశం ఉన్నది. దేశంలో మరెక్కడా లేనివిధంగా స్టార్టప్‌లకు ఊతమిస్తూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాల కారణంగానే హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్నది. ఐటీ రంగ అభివృద్ధికి కీలక స్థావరంగా ఎదుగటం హర్షణీయమని ఇండియా సాఫ్ట్ సదస్సులో పాల్గొన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి కొనియాడటం గమనార్హం. నైపుణ్యం గల మానవ వనరులు, ఉత్తమ విద్యాసంస్థలు, పరిశోధన, అభివృద్ధి సంస్థల సహకారంతో నగర ఐటీ పరిశ్రమ విశేష వృద్ధి సాధిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఐటీరంగం తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లోనే మన ఐటీ రంగ ఎగుమతులు 314 మిలియన్ డాలర్లకు చేరుకుంటాయనే అంచనాలున్నాయి. రాబోయేకాలంలో ఇది మరింత వృద్ధిచెంది 2030 నాటికి అగ్రశ్రేణికి చేరుకుంటుందనటంలో సందేహం లేదు.

> **సమకాలీన ప్రాపంచిక దృక్పథంతో తెలంగాణ రాష్ట్రం ఇవ్వాళ సమగ్ర సామాజికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నది. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగటానికి అవసరమైన మౌలిక వసతులు, వనరుల కల్పనకు పెద్దపీట వేస్తున్నది. పల్లెటూరు మొదలు, పట్టణ ప్రజానీకం జీవన ప్రమాణాలు పెంచటానికి అనేక విధాలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నది.**

ఈ నేపథ్యంలోనే ప్రపంచంలోని ఐదు అగ్రశ్రేణి కంపెనీలు తమ ప్రధాన కార్యాలయాల తర్వాత, అంతటి ముఖ్య కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకోవటం ఐటీ పరిశ్రమ ఉనికికీ, ఉన్నతికీ హైదరాబాద్ ఎంతటి సానుకూల ప్రదేశమో అన్నదానికి నిదర్శనంగా నిలుస్తున్నది.

మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా మారినప్పుడే అవకాశాలను ఒడిసిపట్టుకోవటం సాధ్యమవుతుంది. దీనిలో దేశంలోని యువత, ముఖ్యంగా తెలంగాణ యువత ముందున్నది. దేశవిదేశాల్లో టాప్ కంపెనీల్లో అత్యున్నత విధాన నిర్ణాయక స్థానాల్లో ఉండటం యాదృచ్ఛికమే. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల మొదలు అమెరికాలోని కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ రంగానికి కేంద్ర బిందువైన సిలికాన్ వ్యాలీలో గణనీయమైన సంఖ్యలో తెలుగువారే ఉన్నారంటే అతిశయోక్తి లేదు. అయితే రోజురోజుకూ పెరుగుతున్న శాస్త్ర సాంకేతిరరంగాల అభివృద్ధిని అందిపుచ్చుకొని అవసరాలకు అనుగుణంగా ఆవిష్కరణలకు పునాది వేయాలి. ఉత్పత్తి, పరిశోధనారంగంలో అగ్రభాగాన నిలుస్తున్న మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో అపార అవకాశాలు రాబోయేకాలంలో ఉంటాయి. సాఫ్ట్‌వేర్‌తో పాటు, హార్డ్‌వేర్ రంగ అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు పూనుకొని ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే దిశగా అడుగులు వేయాలి. మానవవనరుల అభివృద్ధి, వికాసం, సామాజిక అవసరాలు, ఉద్యోగ కల్పన అనేవి పరస్పర ఆధారితాలు. మొత్తంగా సేవారంగంపైనే దృష్టి కేంద్రీకరిస్తే సామాజిక అవసరాలు, వస్తూత్పత్తికి ప్రతిబంధకమయ్యే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉన్నది. కాబట్టి వస్తూత్పత్తితోనే ఉద్యోగ కల్పనతో పాటు, సామాజిక అవసరాలు తీర్చే విధానాలకు పెద్దపీట వేయాలి. ఈ విధమైన సమతుల్యాన్ని పాటించాల్సిన ఆవశ్యకత ఉన్నదని దేశవ్యాప్తంగానూ, ప్రపంచవ్యాప్తంగానూ పెరుగుతున్న నిరుద్యోగం చెబుతున్నది. దీనికి సంతులిత, సమగ్రాభివృద్ధి విధానాలు అవలంబించటం అవసరం. ఇలాంటి అభివృద్ధి ప్రణాళికలతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం.

సమకాలీన ప్రాపంచిక దృక్పథంతో తెలంగాణ రాష్ట్రం ఇవ్వాళ సమగ్ర సామాజికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నది. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగటానికి అవసరమైన మౌలిక వసతులు, వనరుల కల్పనకు పెద్దపీట వేస్తున్నది. పల్లెటూరు మొదలు, పట్టణ ప్రజానీకం జీవన ప్రమాణాలు పెంచటానికి అనేక విధాలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నది. భారీ సాగు నీటి రంగ ప్రాజెక్టులు మొదలు టీఎస్ఐపాస్ ద్వారా స్టార్టప్‌లకు ఊతమిస్తూ యువతను ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా తీర్చిదిద్దటంతో పాటు ఉద్యోగ కల్పన కోసం కృషిచేస్తున్నది. ఇదే సందర్భంలో గత మూస పద్ధతులకు భిన్నంగా అన్నిరంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు అమలు జరుగాలి. శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధిని ప్రజల జీవన విధానానికి అన్వయం చేయాలి. ముఖ్యంగా దేశంలో రాష్ట్రంలో వ్యవసాయరంగంతో సాంకేతికాభివృద్ధిని అనుసంధానం చేయాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తూ శాస్త్రీయ విధానాలను అవలంబించాలి. అప్పుడే సామాజిక స్వరూపం సమూలంగా మారుతుంది. ఈ ఎరుకతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఇప్పటికే సత్ఫలితాలిస్తున్నది. ఈ నాలుగేండ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ దర్శనంతో చేపట్టిన పథకాలు అద్భుత ఫలితాలిస్తున్నవి. ఈ నేపథ్యంలోనే నేటి 'ఇండియా సాఫ్ట్'లో హైదరాబాద్ నగరానికి దక్కిన గౌరవంగా భావించాలి. ఈ గుర్తింపు ప్రభుత్వ పనితీరుకు పెద్ద ప్రోత్సాహమైతే, యువత ఆదర్శాలకు మార్గదర్శనం.

జనగళం

ప్రపంచకప్ గెలువాలె

ప్రతిష్ఠాత్మకమైన క్రికెట్ ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవాలని నాలుగేండ్లుగా ప్రతీదేశం కలలుగంటున్నది. ఈ నాలుగేండ్ల నిరీక్షణకు కొన్ని నెలల్లో తెరపడనున్నది. ఇప్పటికే అన్నిదేశాలూ కసరత్తులు ప్రారంభించినా భారత జట్టు ఫేవరేట్‌గా ప్రపంచకప్‌లో పాల్గొననున్నది. సొంతగడ్డపైనే కాకుండా విదేశాల్లో కూడా రాణించటం భారతజట్టుకు కలిసివచ్చే అంశం. ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి పటిష్ఠమైన జట్లను మట్టికరిపించడం సగటు భారత అభిమాని ఆశలను రెట్టింపుచేసింది. బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో మన ఆటగాళ్లు సమతూకంగా కనిపిస్తున్నారు. ప్రపంచకప్‌లోనూ ఇదే ఆటతీరు కనబర్చి దేశానికి మరో ప్రపంచకప్‌ను అందించాలి. ఆ దిశగా మన ఆటగాళ్లు శక్తిమేర కృషిచేస్తారని ఆశిస్తూ...

- బేగరి ప్రవీణ్‌కుమార్, అంతరాం, చేవెళ్ల, రంగారెడ్డి

ప్రజల బాధ్యత

పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నది. అటవీ రక్షణ, స్మగ్లింగ్ నిరోధక చర్యలు కూడా బాగున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలకు ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. కొత్తగా తెచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పచ్చదనాన్ని గ్రామాభివృద్ధి తప్పనిసరి చేయడం అభినందనీయం. గ్రామాల్లో హరితహారంలో భాగంగా కొత్తగా మొక్కలు నాటడంతో పాటు, చెట్లను సంరక్షణ చర్యలు బాగున్నాయి. దీనికితోడు చెరువుల పునరుద్ధరణ వల్ల నీటి నిల్వలు పెరుగడమే కాకుండా, చెరువుల చుట్టూ కూడా అక్కడక్కడ మొక్కలు నాటారు. అందుకే గతంలో కంటే కొంచెం మార్పువచ్చింది.అయితే పర్యావరణ పరిరక్షణపై పట్టణ ప్రాంతాల్లో మరింత శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చదనం పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అలాగే స్థానిక ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో చెట్లను సంరక్షించడం తమ బాధ్యతగా భావించాలి. అప్పుడే పచ్చదనం పెరుగుతుంది. భవిష్యత్తు తరాలకు కూడా మంచి వాతావరణాన్ని అందించనవాళ్లమవుతాం. ఈ దిశగా ప్రభుత్వం, ప్రజలు ముందుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- పి.గంగయ్య, చొప్పదండి, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

జాతీయం



డాక్టర్ బైరి నిరంజన్

తెలంగాణ పథకాలే ప్రేరణ

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం విజయపథంగా దూసుకుపోతున్నది. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రారంభిస్తున్న ప్రతి పథకం దేశానికే దిక్సూచిలా మారుతున్నది. దీనికిఉదాహరణగా 'రైతుబంధు' పథకాన్నే తీసుకోవచ్చు. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని తాజా బడ్జెట్‌లో 'కిసాన్ సమ్మాన్ నిధి' పేర కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది.

అనేక ఆసక్తికర సంఘటనల నడుమ కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తాత్కాలిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ఒక విచిత్ర. తాత్కాలిక బడ్జెట్ అని చెప్పి దీర్ఘకాలిక పద్దులను రూపొందించి ప్రకటించడం, కొన్ని సమస్యలకు కొంత పరిష్కార మార్గంగా ఈ బడ్జెట్‌ను రూపొందించడం మరొక విచిత్రం. 45 ఏండ్లలో ఈసారే నమోదైన గరిష్ఠ నిరుద్యోగ సమస్యను గాలికి వదిలేశారు. 12 కోట్ల రైతులు, 10 కోట్ల అసంఘటిత కార్మికులు, 3 కోట్ల ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని మొత్తంగా 25 కోట్ల మందిని తమ ఓటర్లుగా మలుచుకోవడానికి మోదీ టీం చేస్తున్న ప్రయత్నాలకు కొనసాగింపే ఈ బడ్జెట్. కేంద్ర ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను, ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాల మనుగడను విశ్లేషించుకున్నది. ముఖ్యంగా తెలంగాణ సీఎం కేసీఆర్ హృదయ స్పందనగా చెప్పుకునే 'రైతుబంధు' పథకాన్ని ప్రధాని మోదీ 'కిసాన్ సమ్మాన్' నిధి పేరుతో 12 కోట్ల రైతు కుటుంబాలకు ఏటా రూ.6 వేలు 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు వారి ఖాతాలో జమ చేస్తామన్నాడు. ఇది కొంత ఉపశమనం కలిగే అంశం.

2015-16లో జరిగిన కేంద్ర వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం.. దేశవ్యాప్తంగా సాగు భూమి 39 కోట్ల 42 లక్షల పైచిలుకు ఎకరాలు ఉన్నది. అయితే స్త్రీ యజమానుల దగ్గర 13.87 శాతం ఉండగా, పురుష యజమానుల దగ్గర 86.13 శాతం ఉన్నది. మొత్తం భూమిలో 5 ఎకరాల నుంచి 25 ఎకరాల మధ్యన భూమి ఉన్నవారు 13.22 శాతం కాగా వీరి చేతుల్లో 43.60 శాతం భూమి ఉన్నది. అంతేకాకుండా 25 ఎకరాల పైన భూమి ఉన్నవారు 0.57 శాతం కాగా వీరి చేతుల్లో మొత్తం భూమిలో 9.06 శాతమ భూమి ఉండటం గమనార్హం. వీరందరిని రైతు బంధులోకి తీసుకరాకపోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. అందులో నుంచి మొత్తం భూమిలో 47.34 శాతం భూమి ఉన్నవారు 14.57 శాతం కోట్ల మంది దగ్గర 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారున్నారు. వీరందరికీ రైతు పథకంలోకి తీసుకరావడం ఆ వర్గాల ప్రజలకు ఉపయుక్తం కాబోతున్నది. ముఖ్యంగా 14 పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ రైతులకు ఈ బడ్జెట్ ద్వారా దాదాపు రూ.64 వేల కోట్లు వారి ఖాతాలో జమ కాబోతున్నాయి. అందులో పెద్ద మొత్తంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి 2 కోట్ల 21 లక్షల మందికి రైతుబంధు ద్వారా లబ్ధి కలుగడం ఆ పార్టీకి కలిసివచ్చే అంశం. అయితే ఈ పథకాన్ని రైతులందరికీ ఎకరానికి రూ.6 వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తే 2 లక్షల 36 వేల కోట్ల రూపాయ లు ఖర్చుచేయాల్సి వస్తుంది. కానీ, ఈ పథకం ద్వారా బడ్జెట్‌లో మొత్తం 75 వేల కోట్లు ఖర్చు పెడుతామని చెప్పి రూ.20 వేల కోట్ల మాత్రమే కేటాయించారు. ఏదేమైనా గతంలో ఏ కేంద్రంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్దఎత్తున రైతులకు సహాయ సహకారాలు అందించలేకపోయారు. ఇప్పుడు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుబంధు' పథకమే కారణం. ఇది తెలంగాణ ప్రభుత్వానికి గర్వకారణం.

అయితే దేశవ్యాప్తంగా దీన్ని అమలుచేయడం చాలా పెద్ద సమస్యగా మారనున్నది. తెలంగాణ ప్రభుత్వం 'రైతుబంధు' అమలుచేయడానికి ముందు రాష్ట్రాన్ని మొత్తం ఒక యూనిట్‌గా తీసుకొని పలురకాల సర్వేలు నిర్వహించింది. అధికారుల చేత భూమిపై విచారణ చేయించి, గ్రామ సభలు నిర్వహించి అసలు రైతులను గుర్తించింది. ఆ తర్వాతనే 'రైతుబంధు' కింద రైతుల ఖాతాల్లో నగదు జమచేసింది. కానీ దేశంలో చాలా రాష్ట్రాల్లో భూములకు సంబంధించిన లెక్కలు సరిగా లేవు. కొంత భూమి అయితే రైతుల పేరుమీద కాకుండా వేరే వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఉన్నది. సరైన పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. కాబట్టి తెలంగాణ, హర్యానా, పంజాబ్ సహా కొన్ని రాష్ట్రాల్లో తప్ప మిగిలిన రాష్ట్రాల్లో దీన్ని అమలుచేయడం కత్తిమీది సాము లాంటిదే. ఇచ్చిన రూ. 6 వేలు కూడా మూడు విడుతలుగా చెల్లిస్తామనడం ఈ పథకం విజయానికి అడ్డంకిగా మారుతుంది.

గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ యువతకు ఎంతో ఉపయోగ పడుతున్నది. అలాంటి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఈ బడ్జెట్‌లో గతేడాది కంటే పది శాతం పెంచి రూ.60 వేల కోట్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో యువతకు ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశాలున్నాయి. ఈ రెండు సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగా గ్రామ ప్రజలపై ఈ బడ్జెట్ రూపకంగా లక్షా 25 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టడం వల్ల వారి జీవన ప్రమాణాలు పెరుగడానికి, వికసించడానికి అవకాశం ఏర్పడుతుంది. దీంతోపాటు 2000 మార్చి బడ్జెట్‌లో వాజపేయి మానస ప్రాజెక్టుగా వచ్చిన 'ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం' కింద రూ.19 వేల కోట్లు ఖర్చు పెట్టబోతున్నది. ఇది గతేడాది కంటే 4 వేలు ఎక్కువ. ఈ ప్రాజెక్టు రూపకల్పన చేసినప్పుడు సాధారణ ప్రాంతంలో 500 పైగా జనాభా ఉన్న, కొండల ప్రాంతంలో 250 పైగా జనాభా ఉన్న నివాస యోగ్యత ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని 1 లక్షా 78 వేల ఆవాస గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని, 2019 మార్చిలోగా పూర్తిచేయాలని సమయం నిర్దేశించుకున్నది. ఇందులో 47 వేల ఆవాస కేంద్రాల్లో పనులు జరుగుతున్నాయి. 1700 ఆవాస కేంద్రాల్లో టెండర్లు మాత్రమే అయినాయి. దీనివల్ల అస్సాం, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్‌లకు ఉపయుక్తంగా ఉంటుంది.


> **గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ యువతకు ఎంతో ఉపయోగ పడుతున్నది. అలాంటి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఈ బడ్జెట్‌లో గతేడాది కంటే పది శాతం పెంచి రూ.60 వేల కోట్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో యువతకు ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశాలున్నాయి. ఈ రెండు సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగా గ్రామ ప్రజలపై ఈ బడ్జెట్ రూపకంగా లక్షా 25 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టడం వల్ల వారి జీవన ప్రమాణాలు పెరుగడానికి, వికసించడానికి అవకాశం ఏర్పడుతుంది.**

దేశంలోని లక్ష గ్రామాలకు డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అలాగే 2019 మార్చిలోపు 100 శాతం విద్యుదీకరణ చేయాలని నిర్ణయించింది. ఇదొక విధంగా గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులు పెంచడానికి ఉపయోగపడుతుంది. కానీ 8 కోట్ల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలని నిర్ణయించడమనేది ఎన్నికల జిమ్మిక్కు. దేశంలో ప్రతీ 30 మందిలో ఒక్కరు కనీస ఆదాయపన్ను కడుతున్నారు. అందుకే దేశంలో కొత్తగా మొదటిసారి పెద్ద నోట్ల రద్దు తర్వాత కోటి మంది ఆదాయవర్గాల వారు తమ ఆదాయ వ్యయాలు చూపించడం వల్ల ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చారు. అలాగే ఆదాయం పన్ను కట్టేవారు 80 శాతం మంది పెరిగారు. గత నాలుగేండ్లలో వీరి సంఖ్య 3.79 కోట్ల నుంచి 6.89 కోట్లకు చేరింది. పన్ను వసూళ్లు కూడా 6.38 లక్షల కోట్ల నుంచి 12 లక్షల కోట్లకు వెళ్లాయి. ఇందులో 2 కోట్ల 48 లక్షల పైచిలుకు మంది 5 లక్షల లోపు ఆదాయం కలిగినవారు కాగా మరో 50 లక్షల మంది 6.50 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు. ఇప్పుడు వీరందరికి పన్ను రిబేట్ ఇవ్వడం వల్ల పన్ను మినహాయింపు కలుగుతుంది. మొత్తానికి దీర్ఘకాలికమైన ఈ సమస్యకు స్వల్పకాలిక బడ్జెట్ ద్వారా 3 కోట్ల మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. దీనివల్ల ఆ మేరకు పొదుపైన వారి సంపదను వస్తూత్పత్తి సేవల రంగం మీద ఖర్చుపెట్టే అవకాశం ఉన్నది. దీనివల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఉత్పత్తి సేవారంగాలకు కొంత మేర లబ్ధి చేకూరే అవకాశం ఉన్నది. ఇది అనేక వ్యాపారాల ద్వారా దేశ సంపదను దేశానికి సృష్టించవచ్చు.

బడ్జెట్‌లో మరో ప్రధానమైన సంక్షేమ కార్యక్రమం (ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్) పేరుతో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి రూ.3 వేల పింఛన్ ఇచ్చే పథకాన్ని రూపొందించడం ఈ రంగంలో పనిచేస్తున్న వారి బతుకుకు భరోసా ఇచ్చినట్లు అవుతుంది. అలాగే కార్మిక ప్రమాద బీమా కూడా లక్షా యాభై వేల నుంచి ఆరు లక్షలకు పెంచడం శుభపరిణామం. దీనివల్ల కార్మికులపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబీకుల కన్నీళ్లను తుడిచినట్టవుతుంది. ఈ సంక్షేమ కార్యక్రమం కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుబీమా' అలాగే 'ఆసరా' పథకాల బ్లూ ప్రింటే కావడం గమనార్హం.

'ప్రత్యేక హోదా' బాబు ఎన్నికల అస్త్రం

విశ్లేషణ



కన్నోజు మనోహరాచారి

గత కొన్ని నెలలుగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి సమావేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని, మోదీని తిడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంపీలను రెచ్చగొడుతూ ఈ విషయంలో ఇంకా మీరు ఢిల్లీలో చేయాల్సింది చాలా ఉందని చెబుతున్నారు. తానే ఒకరోజు నిరాహారదీక్షకు కూచుంటానని, వయసులో, రాజకీయాల్లో మోదీ నాకంటే జూనియర్ అని, అతడిని సర్ అని పిలిచినా ఆయన కనీస గౌరవ మర్యాద కూడా ఇవ్వడం లేదంటున్నారు. ప్రత్యేక హోదా విషయమై ఎన్నిసార్లు అడిగినా సమాధానం ఇవ్వడం లేదని అసెంబ్లీలో గట్టిగా వాదిస్తున్నారు. నల్ల బట్టలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు కూడా. సమయం, సందర్భం వేరే అయినప్పటికీ చంద్రబాబు పాల్గొంటున్న అన్ని సమావేశాల్లోనూ బీజేపీ ప్రభుత్వాన్ని, మోదీని టార్గెట్ చేస్తున్నారు. ప్రత్యేక హోదా లేకపోతే మనమంతా ముమ్ముందు ఏమైపోతామో అంటూ ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. చివరికి జిల్లా కలెక్టర్ల సమావేశంలో కూడా కేంద్రం నుంచి సహకారం లేదని, మోదీ వల్లనే అన్యాయమైపోతున్నదంటున్నారు. ఆయన కోపం అంతా బీజేపీ మీద, మోదీ మీద అని ఏపీ ప్రజలకూ తెలిసిపోయింది. ఏదో తెలియని ఆందోళన, అసహనం, చిరాకు చంద్రబాబుకు ఈ మధ్యలో ఎక్కువైంది. దశాబ్దకాలంగా చంద్రబాబును, ఆయన రాజకీయాలను చూసినవారు ప్రస్తుతం చంద్రబాబులో కొత్త కోణాన్ని చూస్తున్నారు. ఆయనలో ఓపిక పోయిందనే నిజాన్ని గ్రహిస్తున్నారు. ఆవేశంతో పెద్దగా అరుస్తూ మాట్లాడుతున్నారనే సత్యాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు.

అసలు ప్రత్యేక హోదా అంటే ఏమిటీ? ఎందుకోసం ఈ హోదా ఇస్తారు. ఎవరికీ ఈ హోదా ఇస్తారు, ఎందుకు ఈ హోదా ఏపీకి ఇవ్వడంలేదో రాజకీయాల్లో పండిన చంద్రబాబుకు తెలియదా. తెలుసు కాబట్టే ప్రత్యేక హోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీ బాగుంటుందని ప్రజలకు కొన్నాళ్ల కింద ఆయనే చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఏపీకి ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, పెట్రోలియం యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఐఐఐటీ, ట్రైబల్ యూనివర్సిటీ, ఎయిమ్స్ మంజూరయ్యాయి. ఒక్క ఐఐటీ ఏర్పాటు కోసం 1750 కోట్లు అవసరం పడుతాయి. ఐఐఎం కోసం కనీసం వెయ్యి కోట్లు అవసరం పడుతాయి. ఇంకా అమృత, ఎస్సారెమ్, విట్ లాంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు కూడా ఏపీలో చోటుచేసుకుంటున్నాయి. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, దుగరాజపట్నం ఓడరేవు ఏర్పాటు, విజయవాడ, వైజాగ్, తిరుపతి విమానాశ్రయాల విస్తరణ, విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రోరైల్ ఏర్పాటు. స్మార్ట్ సిటీ కింద వైజాగ్‌కు ప్రత్యేక నిధులు ఇవన్నీ ప్రత్యేక ప్యాకేజీ కింద ఏపీకి కేంద్రం ఇచ్చిన వరాలు. సుమారు 20 వేల కోట్లతో నిర్మించే పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించింది. 20 వేల కోట్లతో నిర్మించబోయే కొత్త రాజధాని నిర్మాణం కోసం కేంద్రం మద్దతు తెలిపింది. అందుకే, ప్రత్యేక హోదా బ్రహ్మ పదార్థం కాదన్నారు బాబు. మరిప్పుడు మళ్లీ ఏపీకి ప్రత్యేక హోదా ఎందుకడుగుతున్నారు? ఎన్నికలప్పుడు ప్రజల్లో ఏదో ఒక స్లోగన్ గట్టిగా వెళితేగానీ, ప్రజలు దాన్ని గుడ్డిగా అనుసరిస్తారు. ఆ స్లోగన్‌తోనే మళ్లోసారి ఎన్నికల్లో గట్టెక్కవచ్చు. చంద్రబాబు ప్రస్తుత ఎన్నికల అస్త్రం కూడా ప్రత్యేక హోదా మాత్రమే.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలనే ఆలోచన వచ్చింది. భౌగోళికంగా నాడు అస్సాం, నాగాలాండ్ రాష్ట్రాలు కొండలు, లోయలతో విస్తరించి టిబెట్, బంగ్లాదేశ్, మయన్మార్, భూటాన్, నేపాల్, చైనా దేశాల సరిహద్దులతో ఉండటం వల్ల ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలంటే ఇబ్బందులు ఏర్పడేవి. జమ్మూకశ్మీర్ పరిస్థితి కూడా అంతే. పాకిస్థాన్ సరిహద్దున ఉన్న ఈ రాష్ట్రం రాజకీయ కారణాలతో నాటినుంచే అతలాకుతలంగా ఉండేది. అన్నిరాష్ట్రాలు కూడా కొండ ప్రాంతాలు కావడం వల్ల విసిరేసినట్లుగా గ్రామాలు ఉండేవి. తక్కువ జనాభా, విద్య, వైద్య సౌకర్యాల లేమి, అసంపూర్తి రోడ్డు, రవాణా సౌకర్యాలు, ప్రజల్లో పేదరికం, తదితర కారణాలతో గాడ్గిల్ ఫార్ములాకు అనుగుణంగా 1969లో నాటి 5వ ఆర్థికసంఘం ఛైర్మెన్ మహావీర్ త్యాగి అధ్యక్షతన జమ్మూకశ్మీర్, అస్సాం, నాగాలాండ్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారు. పెద్ద ఆదాయ వనరులు, పరిశ్రమల్లేని ఈ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కింద ఎక్సైజ్ డ్యూటీ, కస్టమ్స్ డ్యూటీ, కార్పొరేట్ టాక్స్, ఇన్‌కమ్ టాక్స్ తదితరమైనవి వర్తించవు. కేంద్ర పథకాల్లో 90 శాతం ఖర్చు కేంద్రమే భరిస్తే, మిగితా 10 శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరించడానికి కూడా కేంద్రమే వడ్డీలేని రుణం ఇస్తుంది. 1971లో మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలు, 1975లో సిక్కిం, 1987లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ ఈశాన్య రాష్ట్రాలుగా ప్రసిద్ధి పొందినప్పటికీ పెద్దగా ఆదాయ వనరుల్లేని రాష్ట్రాలు. ప్రజలు తమ కష్టార్జితం మీద బతుకుతారు. ఈ రాష్ట్రాలన్నీ కూడా అంతర్జాతీయ దేశాల సరిహద్దులతో అంటకాగి ఉన్నాయి. అందుకే ఈ రాష్ట్రాలకు కూడా ప్రత్యేక హోదా ఇచ్చారు. ఈ రాష్ట్రాలకు, ఆంధ్రప్రదేశ్‌కు పోలిక ఎక్కడిది? ప్రత్యేక హోదా ఎందుకు అడుగుతున్నారో ఓసారి విజ్ఞులు ఆలోచించాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా ప్రసిద్ధి పొందింది. 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న ఏపీకి కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం ఓడరేవు ప్రాంతాలున్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు పచ్చనిపంట పొలాలతో ప్రఖ్యాతి పొందాయి. పలు విద్యాలయాలు, పరిశ్రమలు, తూర్పుతీర ప్రాంతంగా ప్రసిద్ధికెక్కిన విశాఖపట్నం వాణిజ్యరంగంలో ప్రసిద్ధికెక్కింది. విజయవాడ, కడప, కర్నూల్ పట్టణాలు వ్యాపార, వాణిజ్యరంగాల్లో పేరుప్రతిష్ఠలు పొందాయి. పొరుగుదేశాల సరిహద్దులు, పెద్దగా ఆదాయ వనరుల్లేని రాష్ట్రాలకిచ్చే ప్రత్యేక హోదాను ఏపీ ప్రజలు కోరడం భావ్యమేనా? ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే, ఇంతకన్నా తక్కువ అభివృద్ధి ఉన్న బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు డిమాండ్ చేయవా? అప్పుడు ప్రత్యేక హోదా విలువ ఏమిటి? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య పోటీతత్వం ఏర్పడింది.

చివరిసారిగా 2010లో ఉత్తరాఖండ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చిన కేంద్రం ఆ తర్వాత ఎవరికీ ఇవ్వడం కుదరదని 14వ ఆర్థిక సంఘం నాటి ఛైర్మెన్‌గా ఉన్న వై.వి.రెడ్డి తీర్మానించారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, ప్రత్యేక హోదా ప్రస్తుతం ఏ రాష్ట్రాలకు ఇవ్వడంలేదని పార్లమెంట్‌లో స్వయంగా ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి, హోంశాఖల మంత్రులు ఇప్పటికే చాలాసార్లు తేల్చిచెప్పారు. అయినా చంద్రబాబుతో సహా మిగితా పార్టీలు కూడా ఇదే నినాదాన్ని అందుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏదో మునిగిపోతున్న నావ లాగా రక్షించండని గావుకేకలు పెడుతున్నారు. అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను, ఇటు ఇతర రాష్ట్రాల ప్రజలను కూడా ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్రజలతో ఒక రాజకీయ క్రీడను ఆడుతున్న వీరి చేష్టలకు అధికారులు, మేధావులు జాలిపడుతున్నారు.

> **1971లో మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలు, 1975లో సిక్కిం, 1987లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ ఈశాన్య రాష్ట్రాలుగా ప్రసిద్ధి పొందినప్పటికీ పెద్దగా ఆదాయ వనరుల్లేని రాష్ట్రాలు. ప్రజలు తమ కష్టార్జితం మీద బతుకుతారు. ఈ రాష్ట్రాలన్నీ కూడా అంతర్జాతీయ దేశాల సరిహద్దులతో అంటకాగి ఉన్నాయి. అందుకే ఈ రాష్ట్రాలకు కూడా ప్రత్యేక హోదా ఇచ్చారు. ఈ రాష్ట్రాలకు, ఆంధ్రప్రదేశ్‌కు పోలిక ఎక్కడిది?**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



పోటెత్తిన పుల్లూరు బండ

సిద్దిపేట జిల్లా పుల్లూరు బండ జాతర రెండోరోజైన మంగళ వారం భక్తులు పోటెత్తారు. పుల్లూరు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ కృష్ణభాస్కర్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సుతోపాటు పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. - సిద్దిపేటకలెక్టరేట్, నమస్తే తెలంగాణ

నాగోబాను దర్శించుకున్న భక్తజనం

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా కెస్లాపూర్ నాగో బా ఆలయానికి భక్తజనం పోటెత్తింది. మెస్రం వంశీయులు సోమవారం రాత్రి నిర్వహించిన మహా పూజలతో ప్రారంభమైన నాగోబా జాతర మంగళవారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మహా పూజల అనంతరం ఆచారం ప్రకారం కొత్తకోడళ్లకు నాగోబా సన్నిధిలో(బేటింగ్) పరిచయవేదిక నిర్వహించారు. అనంతరం వారికి నాగోబాను దర్శించుకునే అవకాశాన్ని కల్పించారు. ఆలయ సమీపంలోని గోవాడ్‌లో మెస్రం వంశీయుల మహిళల ఆధ్వర్యంలో నైవేద్యాలు తయారు చేసి దీపాలు వెలిగించి సంప్రదాయ పూజలు చేశారు. నాగోబాను మంగళవారం ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షే మ శాఖ కమిషనర్ క్రిస్టినా జడ్ చోంగ్తూతోపాటు నిర్మల్ కలెక్టర్ ప్రశాంతి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



నాగోబాకు పూజలు చేస్తున్న క్రిస్టినా జడ్ చోంగ్తూ, నిర్మల్ కలెక్టర్ ప్రశాంతి



జాతరలో భాగంగా కొత్త కోడళ్లతో బేటింగ్

ఈ సందర్భంగా క్రిస్టినా జడ్ చోంగ్తూ మాట్లాడుతూ.. తెలంగాణలో కెస్లాపూర్ నాగోబా జాతర రెండో అతిపెద్ద జాతరగా గుర్తించారన్నారు. నాగోబా జాతరను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొని గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. లండన్‌కు చెందిన మైకేల్ యోర్క్ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఈ సందర్భంగా క్రిస్టినా ప్రారంభించారు.

శరవేగంగా గోలివాడ పంప్‌హౌస్ పనులు

కాళేశ్వరం సీఈ వెంకటేశ్వర్లు వెల్లడి

అంతర్గాం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని గోలివాడ పంప్‌హౌస్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కాళేశ్వరం సీఈ నల్లా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెద్దపల్లి జిల్లా గోలివాడలోని సుందిళ్ల పంప్‌హౌస్‌ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోలివాడ పంప్‌హౌస్‌లో మరో 20వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వరకు నీరు చేరేలోగా గోలివాడలో నిర్మిస్తున్న మొత్తం 14 మోటర్లకు గాను మార్చి చివరి నాటికి 9 మోటర్లు రన్‌చేసి రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తామన్నారు. ఏప్రిల్ చివరి నాటికి మరో టీఎంసీ నీటిని ఎత్తిపోస్తామని తెలిపారు.



వైభవంగా ఊర్కొండపేట అంజన్న రథోత్సవం

నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళ వారం తెల్లవారుజామున 5గంటలకు జరిగిన రథోత్సవానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. - ఊర్కొండ

గ్రామాభివృద్ధే కేసీఆర్ లక్ష్యం

- పీఆర్ చట్టంపై అవగాహన అవసరం
- టీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం
- కొత్త సర్పంచ్‌ల సన్మాన సభల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పష్టీకరణ

దేవరకొండ,నమస్తేతెలంగాణ/భూత్పూర్: గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా టీఆర్‌ఎస్ పాలన కొనసాగుతున్నదని ఎంపీలు, ఎమ్మెల్యేలు కొనియాడారు. టీఆర్‌ఎస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్‌లను మంగళవారం పలుచోట్ల సన్మానించారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో టీఆర్‌ఎస్ మద్దతు గెలుపొందిన 145మంది సర్పంచ్‌లను ఎంపీ గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సన్మానించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరకద్ర ఇంచార్జి గట్టు రాంచంద్రరావు కొత్త సర్పంచ్‌లను సన్మానించారు. వనపర్తి జిల్లా వీపనగండ్లలో ఏర్పాటు చేసిన సభలో 16 మంది సర్పంచ్‌లను టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథంతో కలిసి మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా సన్మానించారు. ఆయా సభల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ బలపరచిన సర్పంచ్ అభ్యర్థులు అధిక స్థానాల్లో విజయం సాధించడంతో ఆయా నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్‌కు నూతనోత్తేజం వచ్చిందన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై నూతన సర్పంచ్‌లు అవగాహన పెంచుకోవాలని సూచించారు. రైతుబంధు పథకం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారంటే అది సీఎం కేసీఆర్ ఘనతేనని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలమన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో సీఎం కేసీఆర్ కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి భారీ ప్రాజెక్టులు చేపట్టారని తెలిపారు.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌ల సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంపీ జితేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఆల, దేవరకద్ర ఇంచార్జి గట్టు రాంచంద్రరావు



నల్లగొండ జిల్లా దేవరకొండలో సర్పంచ్‌ల సన్మాన సభలో ప్రసంగిస్తున్న ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్

అటవీ అభివృద్ధిలో తెలంగాణ భేష్

యూపీ అధికారుల బృందం ప్రశంస

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో అడవుల అభివృద్ధికి చేపట్టిన పనులు చాలా బాగున్నాయని ఉత్తర్ ప్రదేశ్ అటవీశాఖ అధికారుల బృందం కొనియాడింది. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ, సంగాపూర్ అటవీ ప్రాంతాలను, అర్బన్‌పార్కును, గిరిపల్లిలో యువకులు పెంచిన చెట్లను, ఏర్పాటు చేసిన నర్సరీని ఉత్తర్‌ప్రదేశ్ ఏపీసీసీఎఫ్ హేమంత్‌కుమార్ తదితరులు పరిశీలించారు. తెలంగాణ ఫారెస్ట్ అధికారులు అశోక్‌కుమార్‌సిన్హా, ఇతర అధికారులు అడవుల అభివృద్ధికి చేపడుతున్న పనులను వారికి వివరించారు.



ఖమ్మంలో టీఆర్‌ఎస్‌లో చేరిన చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన వారితో ఎంపీ పొంగులేటి



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లో పలువురిని టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి

టీఆర్‌ఎస్‌లో చేరికల జోరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మంగళవారం భారీ సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం నాగయ్యగుంపునకు చెందిన వంద కుటుంబాల వారు ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సమక్షంలో, చింతకాని మండలం కోమట్లగూడేనికి చెందిన 350 కుటుంబాల వారు ఎంపీ పొంగులేటి, మధిర టీఆర్‌ఎస్ ఇంచార్జి లింగాల కమల్‌రాజ్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురానికి చెందిన పలువురు బీఎస్పీ నాయకులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే టి రాజయ్య సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్ మండలం వర్కూర్‌కు పలువురు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గంగాధర, లక్ష్మీదేవిపల్లి, నారాయణపూర్, హిమ్మత్‌నగర్, ముప్పిడిపల్లి, సర్వారెడ్డిపల్లి, ఇస్లాంపూర్, వెంకటాయపల్లి, ఉప్పరమల్యాల, వెంకంపల్లి, లింగంపల్లి, చెర్లపల్లి(ఎన్) గ్రామాల సర్పంచ్‌లు 12 మందితోపాటు నారాయణపూర్ ఎంపీటీసీ, ఆయా గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వైఎస్సార్సీపీలకు చెందిన సుమారు రెండువేలమంది చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కుల సంఘాల నాయకులు, మహిళలు అల్గునూర్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

సింగరేణి మెడికల్‌బోర్డులో అక్రమాలపై ఏసీబీ విచారణ

- వెలుగుచూస్తున్న అవినీతి
- పరారీలో ప్రధాన నిందితుడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సింగరేణి బొగ్గు ఉత్పాదన పరిశ్రమలో మెడికల్ అన్‌ఫిట్ ద్వారా డిపెండెంట్ ఉద్యోగాలను పొందే క్రమంలో కొందరు అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ విచారణలో వెల్లడవుతున్నాయి. డిపెండెంట్ సౌకర్యాన్ని కొందరు దళారులు దుర్వినియోగం చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు రావడంతో, ఏసీబీ అధికారులు విచారణ చేపడుతున్నారు. గతంలోనే విచారణ జరిగినప్పటికీ పూర్తి స్థాయిలో కొనసాగకపోవడంతో ఐదురోజులుగా ఏసీబీ అధికారులు కొత్తగూడెంలోనే మకాంవేసి విచారణ సాగిస్తున్నారు. సింగరేణి బొగ్గుగనులు విస్తరించి ఉన్న అన్ని ఏరియాల్లో ఈ విచారణ కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. నిబంధనల ప్రకారం అర్హత లేకపోయినా కొందరు దళారులు అవినీతి, అక్రమాలకు పాల్పడి మెడికల్ బోర్డులో కీలకమైన వ్యక్తులను ప్రలోభాలకు గురిచేయడం ద్వారా అనర్హులకు అన్‌ఫిట్ అయ్యే అవకాశాలు కల్పించడంతోపాటు లక్షలాది రూపాయలు ముడుపులుగా స్వీకరించి ఉద్యోగాలు ఇప్పించినట్టు విచారణలో వెలుగుచూస్తున్నాయి. గతంలో కార్పొరేట్‌లో చక్రం తిప్పిన ఓ క్లర్కు మెడికల్ అన్‌ఫిట్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా కోట్లాది రూపాయల లావాదేవీలు నిర్వహించినట్టు బహిర్గతమవుతున్నట్టు సమాచారం. ఆ కార్మిక నాయకుడు ఇక్కడి నుంచి పారిపోయినట్టు తెలుస్తున్నది. మెడికల్ అన్‌ఫిట్ అయి ఉద్యోగాలు చేస్తున్న అనర్హుల జాబితాను కూడా ఏసీబీ సేకరించి వారి నుంచి కూడా సమాచారాన్ని సేకరిస్తున్నది.



టీజీవోస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న టీజీవో వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత

రాష్ట్ర సాధనలో ఉద్యోగులది కీలకపాత్ర

టీజీవోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

భువనగిరి రూరల్: ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ తండ్రి స్థానంలో ఉండి పరిష్కరిస్తారని టీజీవోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగసంఘాల నాయకులు, ఉద్యోగులు ఎంతో పోరాటం చేశారన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయగిరి సమీపంలోని హోటల్ వివేరాలో టీజీవో జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరీని కలెక్టర్ అనితారామచంద్రన్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కలెక్టర్ అనితారామచంద్రన్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రభుత్వం చేపట్టే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా లక్ష ఇండ్లు సిద్ధం

హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి

తూప్రాన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్రహౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 2,80,616 డబుల్‌బెడ్రూం ఇండ్లు మంజూ రు కాగా.. 1,99,991 ఇండ్ల నిర్మాణాలకు టెండర్లను పిలిచామన్నారు. వీటిలో ఇప్పటికే 18,351 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మార్చి నెలాకరులోగా మరో 77,355 ఇండ్లను నిర్మించి అర్హులకు అందజేస్తామన్నారు. మంగళవారం ఆయన తూప్రాన్, మనోహరాబాద్‌లో ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్ల నిర్మాణాలకు రూ. 547.78 కోట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

కోయిలకొండలో పోలీస్ పికెట్

మహబూబ్‌నగర్ నమస్తే తెలంగాణ ప్రతినిధి: మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలో మంగళవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. తమ మండలాన్ని నారాయణ పేట జిల్లాలో కలుపొద్దని డిమాండ్ చేస్తూ గత కొన్నిరోజులుగా విపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేయడం, పోలీసులు రంగప్రవేశం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. జేఏసీ నేతలు మంగళవారం కోయిల్‌కొండ మండల బంద్‌కు పిలుపునివ్వగా ఎస్పీ రెమారాజేశ్వరి ఆదేశాలతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.



వర్దెల్లి బుచ్చిరాములు భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బుచ్చిరాములు తనయుడు, సాక్షి ఎడిటర్ మురళి

పోరాట యోధుడికి.. అంతిమ వీడ్కోలు

- సూర్యాపేటలో వర్దెల్లి బుచ్చిరాములు అంత్యక్రియలు
- నివాళులర్పించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల

సూర్యాపేట టౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వర్దెల్లి బుచ్చిరాములు(80) అంత్యక్రియలు మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అంతకుముందు స్థానిక సీపీఎం కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, నోముల నర్సింహయ్య, చిరుమర్తి లింగయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ కోదండరాం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు బుచ్చిరాములు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎం సీనియర్ నాయకుడు, సాక్షి దినపత్రిక ఎడిటర్ మురళి తండ్రి వర్దెల్లి బుచ్చిరాములు మరణం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తీరనిలోటన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా అంతిమయాత్ర కొనసాగింది. ఆ తరువాత హిందూ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కలప స్మగ్లర్లపై కొనసాగుతున్న దాడులు

- పట్టుబడుతున్న రూ.లక్షల విలువ చేసే కలప

అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ/ఏటూరునాగారం(భూపాలపల్లి): కలప స్మగ్లర్లపై అటవీ, పోలీసు అధికారులు దాడులను ముమ్మరం చేశారు. నిత్యం పలుచోట్ల లక్షల రూపాయల విలువ చేసే కలపదుంగలు పట్టుబడుతున్నాయి. మంగళవారం నిర్వహించిన దాడుల్లో భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్రమ కలపను స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గాండ్లగూడెంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.12 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా అటవీ అధికారి రాంబాబు తెలిపారు. భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో పోలీసులు, అటవీ అధికారులు దాడులు నిర్వహించి రూ.1.20 లక్షల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చలి తీవ్రత క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పగటి, రాత్రిపూట ఉష్ణోగ్రతలు పుంజుకుంటున్నాయి.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

ఉపకరణాల పంపిణీలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేటలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధుల ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు సీఎం కేసీఆర్ ఫించన్‌ను రూ. 3016కు పెంచి రికార్డు సృష్టించారన్నారు. ఆర్‌ఈసీ వంటి స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీలో తమవంతు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు సుమారు రూ. 40 లక్షల విలువగల బ్యాటరీ వాహనాలు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, చేతికర్రలు, స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, కలెక్టర్ అమయ్ కుమార్, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ పాస్‌పుస్తకాలు

అధికారులతో సమీక్షలో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్: అర్హులైన ప్రతి రైతుకూ పాసు బుక్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాలకుర్తి కొడకండ్ల మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూ రికార్డుల ప్రక్షాళన సమస్యలు, రైతులకు పాస్‌పుస్తకాల జారీ వ్యవహారంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి గ్రామాల వారీగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుదీర్ఘ సమీక్షను నిర్వహించారు. గ్రామాల వారీగా బాధిత రైతులు, రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్లు, టీఆర్‌ఎస్ నాయకులు ఈ సమీక్షలో పాల్గొని గ్రామాల వీఆర్వోలు చేస్తున్న ఆగడాలపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రబెల్లి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 20 రోజుల్లో భూరికార్డుల ప్రక్షాళనను పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. వీధుల్లో వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులను ఇబ్బందిపెడితే సహించేది లేదన్నారు. పలు గ్రామాల వీఆర్వోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

హెచ్‌ఎం శంకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

ఖమ్మం ఎడ్యుకేషన్: ఖమ్మం జిల్లా కూసుమంచి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శంకర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్జేడీ రాజీవ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శంకర్‌రెడ్డి విద్యార్థినులపై లైంగికవేధింపులకు పాల్పడటంతో అతడిపై పోలీసులు కేసు నమోదుచేశారు. విచారణ జరిపిన విద్యాశాఖ, శిశుసంక్షేమశాఖలు కలెక్టర్‌కు నివేదికలు అందించాయి. నివేదికల ఆధారంగా శంకర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు.

కాశీకి వెళ్తున్నానని.. దుబాయ్‌కి

- వేములవాడ పూజారుల నిర్వాకం
- నోటీసులు జారీచేసిన అధికారులు

వేములవాడ, నమస్తేతెలంగాణ: రాజన్న సిరిసిల్ల వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్న ఇంచార్జి స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, చండీ పారాయణదారులు రాములు ఉన్నతాధికారులను బురిడి కొట్టించి దుబాయ్‌కి వెళ్లారు. తండ్రి అస్థికలను గంగానదిలో కలిపేందుకు కాశీకి వెళ్తున్నానని చెప్పి ఆలయ ఇంచార్జి స్థానాచార్యులు భీమాశంకర్, వ్యక్తిగత సెలవు తీసుకున్న రాములు దుబాయ్‌లోని ఎన్నారై గృహప్రవేశానికి వెళ్లారు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా పూజారులు విదేశీయానానికి వెళ్లడంతో తీవ్రంగా పరిగణించిన అధికారులు వారికి మెమోలు జారీచేశారు. వీరి వ్యవహారంపై దేవాదాయశాఖ కమిషనర్ ఆరా తీసినట్టు సమాచారం. సదరు పూజారులకు ఆలయ ఈవో దూస రాజేశ్వర్ మంగళవారం మెమోలను జారీచేశారు.

జాతీయ ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు పోచంపల్లి విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: ఆసు యంత్రం సృష్టికర్త పద్మశ్రీ పురస్కారగ్రహీత చింతకింది మల్లేశం రూపొందించిన ఎలక్ట్రికల్‌తో నడిచే ఆసు యంత్రాన్ని సోలార్‌తో ఉపయోగించేలా చేసిన ప్రయోగానికిగాను యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారు. కాగా విద్యార్థులు సంతోష్, ఓంహరితోపాటు గైడ్ టీచర్ వీరబ్రహ్మచారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హెచ్ శిరీష అభినందించారు.

ప్రేమ వేధింపులకు యువతి బలి

తిరుమలాయపాలెం: యువకుడి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తిమ్మక్కపేట లో చోటుచేసుకున్నది. పోలీసుల కథ నం ప్రకారం.. తనను ప్రేమించాలం టూ తిమ్మక్కపేటకు చెందిన నవీన్ ఐదేండ్లుగా అదే గ్రామానికి చెందిన నవ్య(19)ను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం యువతి ఇంటికెల్లి బెదిరించాడు. మనస్తాపానికి గురైన నవ్య ఇంట్లో ఎవరూ లేని ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఖమ్మం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇంజనీర్–ఇన్–చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN: **NIT No. 1606/NLG/DCE(R)/EE-6/DEE-6/AEE-2/2018-19, తేది: 04.02.2019** ప్రకారం నల్గొండ సర్కిల్ (భువనగిరి యాదాద్రి జిల్లా)లో YTDAలో ఒక పని (4వ పిలుపు) కొరకు ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ–మార్కెట్ ప్లేస్ అనగా **tender.telangana.gov.in** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్లు స్వీకరణకు చివరి తేది: 14.02.2019న మ. 3.30 గం||వరకు. తదుపరి వివరాలకు కొరకు **tender.telangana.gov.in** దర్శించండి.

సం/– ఇంజనీర్–ఇన్–చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN

DIPR RO. No. 2751-DP/CL/Advt/1/2018-19, Dt: 05/02/2019

తెలంగాణ ప్రభుత్వం
సాగు నీటి పారుదల వలయము, నిర్మల్, నిర్మల్ జిల్లా
టెండరు ప్రకటన

టెండర్ నోటీసు నంబర్లు 08/2018-19, Dated 22-09-2018 (రెండవ పిలుపు), 10/2018-19, 11/2018-19, 12/2018-19, 13/2018-19, 14/2018-19 & 15/2018-19, Dt: 01-02-2019 పనులకు గాను రూ. 388.677 లక్షలకు లభ్యమగు తేది : 02-02-2019 నుండి 11-02-2019/12-02-2019 వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ **https://tender.telangana.gov.in** లో చూడగలరు. పర్యవేక్షక అభియంత, సాగు నీటి పారుదల వలయము, నిర్మల్.

తెలంగాణ ప్రభుత్వం
మిషన్ భగీరథ శాఖ
పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయం, MB సర్కిలు, నల్గొండ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 1 to 4/2017-18 (7th, 3rd & 1st Call) **తేది:Dt. 02-02-2019**

నల్గొండ మరియు సూర్యాపేట జిల్లాలలో MB సర్కిల్‌లో గ్రామీణ పునరావాస పనుల వద్ద త్రాగు నీరు ఏర్పాటు పని చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడినవి. మొత్తం ECV: రూ. 205.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ తేది: 06-02-2019 మ. 3.00గం.లకు. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 14-02-2019 మ. 3.30గం.లకు. ఫోన్ నం. 7995660147. తదుపరి వివరాలకు: ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసు అనగా **www.eprocurement.gov.in** వద్ద చూడగలరు.

సం/– పర్యవేక్షక ఇంజనీరు, MB సర్కిలు, నల్గొండ

DIPR RO No.2748-DP/CL/Advt/1/2018-19, Dt: 05/2/2019

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనాల శాఖ, (నేషనల్ హైవేస్ వింగ్)

టెండర్లు కోరుతూ ప్రకటన

NIT No. SE (R&B) NH/HYD/25, 26/2018-19 **తేది: 04-02-2019**

దిగువ పనుల కొరకు కన్సల్టెంట్లు/కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్‌లో బిడ్లు కోరబడుచున్నవి. 1) 2018-19 సంవత్సరానికి NH 765లోని హైదరాబాద్–శ్రీశైలం రోడ్ సెక్షన్‌లో కి.మీ. 5/6 నుండి 9/9 వరకు PR. 2) 2018-19 సంవత్సరానికి NH161Bలో నిజాంపేట్–బీదర్ రోడ్‌పై కి.మీ. 0/0 నుండి 11/4 మరియు 42/7 నుండి 45/7 వరకు PR. ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో NITను 06-02-2019 నుండి చూడవచ్చును.

సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) NH సర్కిల్, హైదరాబాద్

DIPR R.O.No.820-PP/CL/Advt/1/2018-19, Dt:05-02-2019

THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
R.O: Kothagudem Collieries - 507101

e-Procurement TENDER NOTICE

Tenders have been published for the following works through e-procurement platform.
For details, please visit **https://tender.telangana.gov.in** - or- **http://www.sccImines.com**

NIT No., Date – Name of the work – ECV- Last date & time for Submission of bids

CRP/CVL/KGM/TN-81/2018-19, Dt. 01.02.2019 – Construction of Primary School cum Anganwadi building at Ayyagaripeta R&R Site, Sathupalli, Khammam Dist., Telangana State. **Rs. 70,61,757/- up to 04:30 PM on 16-02-2019**

CW/RD/e-60/2018-19, Dt. 29.01.2019 – M & R and other miscellaneous works to GKOCP and Area stores at Kothagudem area for the year 2019-20. **Rs. 35,19,167/- up to 04:30 PM on 13-02-2019**

CRP/CVL/MMR/TN-82/2018-19, Dt. 02-02-2019 - Construction of Scooter shed and Car shed, Pit head bath rooms and toilet block at Kasipet-2 Incline, Mandamarri Area, Mancherial Dist., T.S. **Rs. 58,84,008/- upto 4:30PM on 16-02-2019.**

PR/2018-19/CVL/GDC/110 GM KGM - GM (CIVIL)

TELANGANA STATE MINERAL DEVELOPMENT CORPORATION LTD.,
(A Telangana State Government Undertaking)
Regd. Corporate Office: # 6-2-915, HMWSSB Premises, Rear Block, 3rd Floor, Khairathabad, Hyderabad-5000004. e-mail ID: tsmdcltd@gmail.com
Telephone: 040-23323150, Tele Fax:040-23373155

The Telangana Mineral Development Corporation Limited (TSMDC) invites e Tenders from reputed/ licensed Service Provider Agencies for empanelment with TSMDC Ltd., for Agencies for providing various kinds of functionaries and functions on out source to work at various places.
Interested agencies shall submit their bids as per the following Schedule:

(a)	Date of Issue	06-02-2019
(b)	Per-bid meeting	13-02-2019
(c)	Last Date and time for submission of Tender Document	22-02-2019 at 15:00 Hrs.
(d)	Opening of Bids	22-02-2019 at 16:00 Hrs.
(e)	Bid Document Fee	Rs. 10,000/- (Rs. Ten thousand only), DD should be in favor of TSMDC Ltd.,
(f)	EMD	Rs. 2,00,000/- (in the form of DD only)
(g)	Contact Person details	Sri P. Panduranga Rao, General Manager (HRD) 040-23323 150, 9573378669 **mdcltd@telangana.gov.in** **tsmdcltd @gmail.com**
(h)	Mode of Submission	Bids will be accepted through online Telangana state e-procurement portal that is **https://tender.telangana.gov.in** and three hard copies should submitted at TSMDC Office on or before bid closing time.

Date : 05.02.2019 **Sd/- (Dr. G. MALSUR), Vice Chairman & Managing Director**

భారత ప్రభుత్వము,
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

ప్రకటన
న్యూ ఢిల్లీ, 24 జనవరి, 2019

S.O.423(E)–జాతీయ రహదారుల చట్టం 1956 (48 ఆఫ్ 1956) లోని సెక్షన్ 3Aలోని సబ్–సెక్షన్ (1) (ఇకమీదట చట్టంగా పరిగణించబడును) ద్వారా సంక్రమించిన అధికారాల్ని ఉపయోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా నందు కి.మి. 38.2 నుండి కి.మి 59.046 వరకు గల (జిల్లా కలెక్టర్ ఖమ్మం కార్యాలయం) భూమి విస్తరణలో జాతీయ రహదారి నెం.365BB నిర్మాణము (వెడల్పు చేయుట/పేవ్డ్ షోల్డర్‌తో రెండు లేన్ /ఫోర్ లేనింగ్ మొదలగునవి) నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు దిగువ షెడ్యూలులో నిర్దేశించిన సంక్షిప్త వివరణ గల భూమి ప్రజోపయోగార్థము కావలసియున్నదని సంతృప్తి చెందిన తరువాత సదరు భూమిని సేకరించాలనే ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిపై ఆసక్తి గల ఎవరేని వ్యక్తి సదరు చట్టపు సెక్షన్ 3C యొక్క ఉప–సెక్షన్ (1) క్రింద సదరు భూమిని ముందు తెలిపిన కార్యానికి ఉపయోగించుటను ఆక్షేపించువారు అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరవై – ఒక్క రోజులలోపుగా తెలుపవచ్చు.

అట్టి ప్రతి అభ్యంతరాన్ని సమర్థ ప్రాధికారి అనగా జాయింట్ కలెక్టర్ వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలు తెలియజేయవలెను మరియు సమర్థ ప్రాధికారి అభ్యంతరము తెలిపే వ్యక్తికి స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఉద్దేశాలన్నీ విచారించిన తరువాత మరియు సమర్థ ప్రాధికారి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తరువాత అభ్యంతరాలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీచేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3Cలోని సబ్–సెక్షన్ (2) క్రింద సమర్థ ప్రాధికారిచే ఇవ్వబడే ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ ప్రకటన పరిధి క్రింద సేకరించబడు భూమి ప్లాను మరియు ఇతర వివరాలు పైన తెలిపిన సమర్థ ప్రాధికారి యొక్క కార్యాలయంలో లభిస్తాయి మరియు ఆసక్తిగల వ్యక్తులు తనఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా నందు కి.మి. 38.2 నుండి కి.మి. 59.046 (జిల్లా కలెక్టర్ ఖమ్మం కార్యాలయం) వరకు భూమి విస్తరణలో జాతీయ రహదారి – 365BB క్రింద కట్టడములతో లేదా కట్టడములు లేకుండా సేకరించవలసిన భూమి యొక్క సంక్షిప్త వివరణ.

రాష్ట్రం: తెలంగాణ జిల్లా: ఖమ్మం

క్ర. సం	సర్వే/ ప్లాట్ నంబర్	భూమి రకం	భూమి స్వభావం	ఏరియా (స్థానిక యూనిట్ నందు)	ఏరియా (హెక్టార్లలో)
తాలూకా: ఖమ్మం (రూరల్)					
గ్రామం: తాళ్ళంపాడు					
1	400	ప్రైవేట్	మెట్ట	**1,016.0000000** (చదరపు మీటరు)	**0.1016000**
తాలూకా: కూసుమంచి					
గ్రామం: జీళ్లచెరువు					
1	378	ప్రైవేట్	మెట్ట	1,878.0000000 (చదరపు మీటరు)	0.1878000
2	380	ప్రైవేట్	మెట్ట	3,900.0000000 (చదరపు మీటరు)	0.3900000
3	381	ప్రైవేట్	మెట్ట	830.0000000 (చదరపు మీటరు)	0.0830000
4	392	ప్రైవేట్	మెట్ట	362.0000000 (చదరపు మీటరు)	0.0362000
5	423	ప్రైవేట్	మెట్ట	12,260.0000000 (చదరపు మీటరు)	1.2260000
6	427	ప్రైవేట్	మెట్ట	1,145.0000000 (చదరపు మీటరు)	0.1145000
7	430	ప్రభుత్వ	మెట్ట	5,542.0000000 (చదరపు మీటరు)	0.5542000
8	437	ప్రైవేట్	మెట్ట	280.0000000 (చదరపు మీటరు)	0.0280000
9	443	ప్రైవేట్	మెట్ట	5,325.0000000 (చదరపు మీటరు)	0.5325000
10	444	ప్రైవేట్	మెట్ట	30.0000000 (చదరపు మీటరు)	0.0030000
11	447	ప్రైవేట్	మెట్ట	22.0000000 (చదరపు మీటరు)	0.0022000
గ్రామం: కూసుమంచి					
1	366	ప్రైవేట్	మెట్ట	82.5840000 (చదరపు మీటరు)	0.0082584
2	375	ప్రైవేట్	మెట్ట	1,101.9280000 (చదరపు మీటరు)	0.1101928
3	381	ప్రైవేట్	మెట్ట	1,417.1830000 (చదరపు మీటరు)	0.1417183
4	382	ప్రైవేట్	మెట్ట	3,725.2150000 (చదరపు మీటరు)	0.3725215
			మొత్తం	38,916.9100	3.8917

(F.No.NHAI/PIU-KMM/DPR/LA/2017/3A)
రాజేష్ గుప్తా, డిప్యూటి సెక్రటరి

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (ఎల్ఏ) శాఖ
ఫారం – సి
ప్రకటన
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద రూల్ 10ఎ మినహాయింపు గలదు)
(నిబంధన 6/12 చూడండి)

ఫైల్ నెం. ఈ2/1716/2018 తేది: 07-01-2019

[illegible]

[illegible]

క్ర. సం.	సర్వే నెం.	[illegible]	భూమి రకం	పట్టాదారు పేరు	తండ్రి/భర్త పేరు	విస్తీర్ణం ఎ.గుం.	పట్టాదారు పేరు	తండ్రి/భర్త పేరు	విస్తీర్ణం	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18
1	12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	0.05	1	11	13	14	లేదు	లేదు	లేదు	లేదు
2	12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0.06	[illegible]	[illegible]	0.06	60	57	56	54	లేదు	లేదు	లేదు	లేదు
3	12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	0.05	33	176	29	64/5	లేదు	లేదు	లేదు	లేదు
4	12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	0.05	33	176	29	64/5	లేదు	లేదు	లేదు	లేదు
						0.21			0.21								
[illegible]																	

(మిగతా 9వ పేజీలో)

[illegible]

- 500 గజాల వరకు ఆర్కిటెక్ట్‌తో పని లేకుండా దరఖాస్తు
- నెలలో ఒకరోజు అవగాహన కార్యక్రమాలు

అటవీశాఖకు కుదుపు

మొదటిపేజీ తరువాయి...

నియమించారు. కొందరికి కీలక పోస్టింగ్‌లిచ్చారు.

ఇప్పటికే పలువురిపై సస్పెన్షన్ వేటు

వివిధ కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, స్మగ్లర్లకు సహకరించడం వంటి ఆరోపణలతో ఇప్పటికే 11 మంది అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు. పెద్దపులి, చిరుతపులి మరణాల కేసులో నిర్లక్ష్యం వహించారన్న కారణంగా మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ జే వెంకటేశ్వర్‌రావును బదిలీ చేశారు. ఇచ్చోడలో నీల్గాయి వేటలో నిందితులకు సహకరించి, పెద్దపులి చర్మం ఒలిచిన కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని బీట్, సెక్షన్, రేంజ్ ఆఫీసర్లను అరెస్ట్ చేయడం సంచలనం సృష్టించింది. మరోవైపు నిజామాబాద్‌లో కలప రాకెట్‌ను ఛేదించారు. కలప అక్రమ రవాణా కోసం నిందితులకు సహకరిస్తున్నారన్న కారణంగా నిజామాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ బీ రామ్మోహన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటువేయగా, మరో నలుగురిని అరెస్ట్‌చేశారు.

బదిలీఅయిన ఐఎఫ్‌ఎస్, ఎఫ్‌డీవోస్థాయి అధికారుల జాబితా

బదిలీ అయిన అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన ప్రాంతం
ఏకే సిన్హా (ఐఎఫ్‌ఎస్)	చీఫ్ కన్జర్వేటర్, మెదక్	అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్
సీ శరవణన్ (ఐఎఫ్‌ఎస్)	కన్జర్వేటర్, కవ్వాల్ టైగర్ రిజర్వ్	మెదక్ కన్జర్వేటర్
వినోద్‌కుమార్ (ఐఎఫ్‌ఎస్)	కన్జర్వేటర్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్	కవ్వాల్ టైగర్ రిజర్వ్, ఫీల్డ్ డైరెక్టర్
శివానీ డోగ్రా (ఐఎఫ్‌ఎస్)	డీసీఎఫ్, హైదరాబాద్	మంచిర్యాల, డీఎఫ్‌వో
వీఎస్‌ఎన్వీ ప్రసాద్ (ఐఎఫ్‌ఎస్)	డీఎఫ్‌వో, నిజామాబాద్	నిర్మల్, డీఎఫ్‌వో
సునీల్ హీరామత్ (ఐఎఫ్‌ఎస్)	ఖమ్మం, డీఎఫ్‌వో	నిజామాబాద్, డీఎఫ్‌వో
జీ రామలింగం (ఐఎఫ్‌ఎస్)	మంచిర్యాల, డీఎఫ్‌వో	వరంగల్ అర్బన్, జనగామ డీఎఫ్‌వో
ఎస్వీ ప్రదీప్‌కుమార్ (ఐఎఫ్‌ఎస్)	ఏటూరునాగారం, డీఎఫ్‌వో	జయశంకర్ భూపాలపల్లి, డీఎఫ్‌వో
బీ ప్రవీణ	డీసీఎఫ్ (వెయిటింగ్ ఫర్ పోస్టింగ్)	ఖమ్మం, డీఎఫ్‌వో
ఎం నాగభూషణం	కిన్నెరసాని, ఎఫ్‌డీవో	మంచిర్యాల, ఎఫ్‌డీవో
ఎస్ సుజాత	వరంగల్, ఫారెస్ట్ జెనసిస్ట్	పాల్వంచ, ఎఫ్‌డీవో
కే దామోదర్‌రెడ్డి	నిర్మల్, డీఎఫ్‌వో	కిన్నెరసాని, ఎఫ్‌డీవో
జే వెంకటేశ్వర్‌రావు	వెయిటింగ్ ఫర్ పోస్టింగ్	వరంగల్, ఫారెస్ట్ జెనసిస్ట్
టీ తిరుమల్‌రావు	బెల్లంపల్లి, ఎఫ్‌డీవో	ఖానాపూర్, ఎఫ్‌డీవో
ఎస్ వెంకటేశ్వర్లు	అమ్రాబాద్, ఎఫ్‌డీవో	నిజామాబాద్, ఎఫ్‌డీవో
కే సుధాకర్	హైదరాబాద్, విజిలెన్స్	అమ్రాబాద్, ఎఫ్‌డీవో
పీ సాగర్	డిప్యూటీ డైరెక్టర్, టీఎస్‌ఎఫ్‌ఏ	బాన్సువాడ, ఎఫ్‌డీవో
పీ అనిల్‌కుమార్	డిప్యూటీ డైరెక్టర్, టీఎస్‌ఎఫ్‌ఏ	ఇల్లెందు, ఎఫ్‌డీవో
రాజారమణారెడ్డి	హైదరాబాద్, ఏసీఎఫ్	కాగజ్‌నగర్, ఎఫ్‌డీవో

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

- స్క్రీన్ ప్రింటర్‌తో 500, 2000 నోట్ల ముద్రణ
- పశువుల మార్కెట్ అడ్డాలో రాత్రివేళ చలామణి
- 10 మందిని అరెస్టుచేసిన రాచకొండ పోలీసులు
- 31.20 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ మహేశ్‌భగవత్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పశువుల మార్కెట్‌లో నకిలీ నోట్లను చలామణి చేస్తున్న ముఠాను రాచకొండ ఎస్వోటీ పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. నిందితుల నుంచి రూ.31.20 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీకి చెందిన ఎప్పన్నపల్లి రాజేశ్ నకిలీ సర్టిఫికెట్ల తయారీ అనుభవంతో నకిలీనోట్ల ముద్రణకు స్కెచ్‌వేశాడు. కలర్ ప్రింటర్, స్కానర్, స్క్రీన్ ప్రింటింగ్ మెషిన్, మందం ఉన్న పేపర్‌ను కొనుగోలుచేసి రెండునెలల క్రితం వాటిద్వారా రూ.2000, 500 నోట్లను ముద్రించాడు. వాటర్‌మార్క్స్‌తో ఉండే గాంధీజీ బొమ్మ, 2000 అంకెల ప్రింట్లను తీసి వాటిని బయటినుంచి అతికించి అసలునోటు తలపించాడు. వీటిని నేరుగా కాకుండా అసలునోట్ల బండిళ్లలో పెట్టి చలామణి అయ్యేలా ప్లాన్ వేశాడు. పాత మలక్‌పేటకు చెందిన మహ్మద్‌బాబా, చంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ షకీల్ అనే మాంసం దుకాణదారులను ఆశ్రయించాడు. వారు రాజేశ్‌కు రూ.90 వేలు చెల్లించి రూ.3 లక్షల నకిలీనోట్లను తీసుకుని చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, నల్లగొండ జిల్లాలోని పశువుల విక్రయాల మార్కెట్‌లో రాత్రివేళ అసలు నోట్లతో కలిపి చలామణి చేశారు. మరోసారి రూ.5.20 లక్షలు చెల్లించి రాజేశ్ వద్ద 19.50 లక్షల నకిలీ కరెన్సీని తీసుకున్నారు. ఈ సమాచారం పోలీసులకు చేరింది. స్పెషల్ ఆపరేషన్ టీం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తన బృందంతో సోదాలు జరిపి దాదాపు రూ.31.20 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి రాజేశ్‌తోపాటు రోషన్ మహబూబ్ షేక్, బొతాపాటి సుఖేశ్, ఇన్నవల్లి దుర్గాప్రసాద్, మహ్మద్‌బాబా, మహ్మద్ షకీల్, పాలదుసు ధరణి, కొప్పుల శ్రీనివాస్, ఇన్నవల్లి శ్రీనివాస్ చంద్రశేఖర్, మహ్మద్ ఇస్మాయిల్‌ను అరెస్టు చేశారు. మరో ఇద్దరు సురేశ్‌నాయుడు, రాజశేఖర్ పరారీలో ఉన్నారు. ఈ ముఠా మార్కెట్‌లో రూ.4 లక్షల నకిలీ నోట్లతో లావాదేవిలు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. పెద్దనోట్లు ఎవరైనా తీసుకొస్తే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సీపీ మహేశ్ భగవత్ సూచించారు.

రైస్ పుల్లింగ్‌లో మోసపోయి.. నకిలీనోట్లతో దొరికిపోయాడు

ఈ ముఠాలో పట్టుబడ్డ పాలదుసు ధరణి దంత డాక్టర్. విజయవాడకు చెందిన ధరణి వలస వచ్చి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తక్కువకాలంలో ఎక్కువగా నగదు సంపాదించాలనే ఆశతో ధరణి రైస్‌పుల్లింగ్ మాయలో పడి లక్షల రూపాయలు పోగొట్టుకొని ఆర్థికంగా చితికిపోయాడు. అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలని రాజేశ్‌తో కలిశాడు. నకిలీ నోట్ల దందాలోకి దిగి పోలీసులకు చిక్కాడు. ఈ కేసులో మహ్మద్ ఇస్మాయిల్ ఆటోడ్రైవర్. అతడు ఈ ముఠాకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టి సిమ్‌కార్డును ఇవ్వడంతో నిందితుడిగా నమోదయ్యాడు.

అధికారులు స్వయంగా వచ్చి వివరించాలి

- కవ్వాల్ రిజర్వులో పులుల భద్రతపై హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వులో పులులు వరుస మరణాలు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు స్వయంగా వచ్చి తమకు వివరాలు అందించాలని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ అధికారితోపాటు కవ్వాల్ పులుల అభయారణ్యం క్షేత్రస్థాయి డైరెక్టర్ కోర్టుకు హాజరుకావాలని పేర్కొంది. పులుల భద్రతకు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ నిబంధనలు ఎంతమేరకు అమలవుతున్నాయని ప్రశ్నించింది. పులుల వేట కోసం వేటగాళ్లు ఎలక్ట్రిక్ వైర్లను ఉపయోగిస్తున్నారని పేర్కొంది. పులులను వాటంతట అవి బతికేలా ఒంటరిగా వదిలేస్తే వాటి సంఖ్య పెరుగుతుందని.. వేట, అటవీ ఆక్రమణలతో వాటి జనాభా తగ్గిపోతున్నదని అభిప్రాయపడింది. అంతకుముందు పిటిషనర్లు వాదనలు వినిపిస్తూ.. కవ్వాల్ రిజర్వులోని బఫర్ జోన్‌ను నాలుగు భాగాలుగా, కోర్ జోన్‌ను నాలుగు భాగాలుగా విభజించారని.. దీంతో అధికారుల మధ్య సమన్వయం కొరవడిందని తెలిపారు. ఈ కేసు విచారణను ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది

కేసీఆర్ హెల్త్‌కార్డులుగా పేరు మార్చాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న హెల్త్‌కార్డులను కేసీఆర్ అడ్వొకేట్స్ హెల్త్‌కార్డులుగా పేరు మార్చాలని రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ న్యాయశాఖ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కొంతం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఆ నిధులతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును ఏర్పాటు చేసి న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందిస్తున్నారని తెలిపారు. ఈ హెల్త్‌కార్డులు న్యాయవాదుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేసిన సీఎం కేసీఆర్ పేరిట 'కేసీఆర్ అడ్వొకేట్స్ హెల్త్ కార్డులు' అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతపద్మనాభస్వామి నగలు

కేరళ ప్రభుత్వానికి చెందవు

- చిలుకూరు బాలాజీ ప్రధానార్చకుడు సౌందర్‌రాజన్ తరపున సుప్రీంకోర్టులో వాదనలు

ముఖ్యా మొహం తెలియని వారు కూటమి కడుతు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేరళలోని అనంతపద్మనాభస్వామి నగలు కేరళ ప్రభుత్వానికి చెందవని, అవి అనంత పద్మనాభస్వామి ఆలయ అధీనంలోనే ఉండాలని చిలుకూరు బాలాజీ ప్రధానార్చకుడు సౌందర్‌రాజన్ తరపు న్యాయవాదులు మంగళవారం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. అనంత పద్మనాభస్వామి నగలు, బంగారాన్ని కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిపై ట్రావెన్‌కోర్ రాజవంశీకుడు మార్తాండవర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో సౌందర్‌రాజన్ పిటిషనర్‌గా ఇంప్లీడ్ అయ్యారు. ఈ కేసులో ఇంప్లీడ్ కావడానికి ఆయనకు గల అర్హతల (లోకస్ స్టాండీ)పైనా మంగళవారం వాదనలు జరిగాయి. సౌందర్‌రాజన్ తరపు న్యాయవాది సాయిదీపక్ వాదనలు వినిపిస్తూ.. తాము కూడా అనంత పద్మనాభస్వామిని ఆరాధించే శ్రీవైష్ణవులమని పేర్కొన్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయానికి ఆళ్వార్‌గా ఉన్న కులశేఖర ఆళ్వార్‌కు చెందిన వంశస్థులు తమకు గురువులని ధర్మాసనానికి విన్నవించారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల పరిరక్షణకు తాము ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. ఈ అంశాల ఆధారంగా ఈ కేసులో వాదనలు వినిపించే అధికారం తమకు ఉన్నదని సుప్రీంకోర్టుకు నివేదించారు. కోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది.

వక్ఫ్‌బోర్డు ఆదాయం రూ.17.58 కోట్లు

- చైర్మన్ మహ్మద్ సలీం వెల్లడి



వక్ఫ్‌బోర్డు పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మహ్మద్ సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డు ఆదాయం ఈ ఏడాదిలో 17.58 కోట్లు వచ్చిందని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం తెలిపారు. అందులో రూ.15.64 కోట్లు ఖర్చు కాగా, రూ.1.94 కోట్లు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం సలీం అధ్యక్షతన వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈసారి బోర్డు ఆదాయాన్ని మరో రూ.10 కోట్లు పెంచేలా చర్యలు తీసుకుంటామని సలీం చెప్పారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులకు సంబంధించిన పట్టాలను వక్ఫ్ సంస్థల పేరుతో ఇవ్వాలని, ఆ మేరకు రెవెన్యూశాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించారు. వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులు భర్తీచేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.

						3.22			3.22							
495	159/17	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	0.20	159/13	159/8	159	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
496	159/17	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	0.22	[illegible]	[illegible]	0.22	159/13	159/8	159	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
497	159/17	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	1.00	159/13	159/8	159	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
498	159/17	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	1.00	159/13	159/8	159	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
499	159/17	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	0.13	159/13	159/8	159	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
500	159/17	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	0.15	[illegible]	[illegible]	0.15	159/13	159/8	159	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
						3.30			3.30							
501	159/18	[illegible]	సర్కార్	[illegible]	[illegible]	1.10	[illegible]	[illegible]	1.10	159/4	163	152	[illegible]	లేవు	లేవు	లేవు లేవు
						1.10			1.10							
మొత్తం విస్తీర్ణం						567.08			567.08							

[illegible]

సం/-
[illegible]

సం/-
జాయింట్ కలెక్టర్
నాగర్‌కర్నూల్

సం/-
కలెక్టర్
నాగర్‌కర్నూల్

Ro.No.918/LA/PP/Agency/2018-19

50% వీవీప్యాట్ల

లెక్కింపు అసాధ్యం

- ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశం లేదు
- మాజీ సీఈసీ టీఎస్ కృష్ణమూర్తి అభిప్రాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలతోపాటు 50 శాతం వీవీప్యాట్లను లెక్కించడం సాధ్యంకాదని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మాజీ ప్రధానాధికారి టీఎస్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. పలు రాజకీయ పార్టీల నేతలు సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి 50 శాతం వీవీప్యాట్లను లెక్కించాలని కోరిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలుచేస్తున్న డిమాండ్ సహేతుకం కాదని, టెక్నాలజీపరంగా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశంలేదని టీఎస్ కృష్ణమూర్తి మంగళవారం పీటీఐతో అన్నారు. ఎలక్షన్ కమిషన్ 50 శాతం కాకుండా కనీసం 25 శాతం వీవీప్యాట్లను లెక్కిస్తే బాగుంటుందని, సమయం కొంచెం ఎక్కువవుతున్నా రాజకీయ పార్టీలకు సంతృప్తి కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఓటేసిన ప్రతిఒక్కరు వీవీప్యాట్లను చూసుకునేందుకు అవకాశం కల్పించి ఈ ప్రక్రియను మరింత పారదర్శకం చేశారని, గతంలో ఇలాంటి అవకాశం లేకపోవడం వల్ల కొంత అనుమానాలు వ్యక్తంచేసే అవకాశాలుండేవని పేర్కొన్నారు. ఈవీఎంలతోపాటు వీవీప్యాట్లను ర్యాండమైజ్‌గా ఒక్కో నియోజకవర్గంలో ఒక దానిని లెక్కిస్తున్నారని, దీని ఆధారంగా మిగతా వాటిని గమనంలోకి తీసుకోవాల్సి ఉన్నదని పేర్కొన్నారు. పాత పద్ధతిలో ఎన్నికల ఫలితాలు వెల్లడించడానికి రోజుల సమయం పడుతుందని, ఆర్థికంగా మరింత ఖర్చు అవుతుందని కృష్ణమూర్తి తెలిపారు.

నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
బుధవారం 6 ఫిబ్రవరి 2019
WWW.NTNEWS.COM



హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జీఏ) ఆధ్వర్యంలో 5వ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్‌షిప్ ఈ నెల 6 నుంచి 9వ తేదీవరకు హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరుగనుంది. మంగళవారం ట్రోఫీని రాష్ట్ర టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆవిష్కరించారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీ భూపతిరెడ్డి, కెప్టెన్ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దంచికొట్టేదెవరో?

నేడు భారత్, న్యూజిలాండ్ తొలి టీ20 ■ జోరుమీదున్న రోహిత్‌సేన ■ ప్రతీకారం కోసం విలియమ్సన్ బృందం

చూడటానికి రెండు జట్ల బలం, బలగం సమానం.. పరిస్థితులు మాత్రం న్యూజిలాండ్‌కు అనుకూలం. కానీ ఫేవరెట్ హోదా మాత్రం భారత్‌కు.. ఫార్మాట్ ఏదైనా వరుసగా సిరీస్‌లను కొల్లగొడుతున్న టీమ్‌ఇండియా ఇప్పుడు కివీస్ గడ్డపై మరో రికార్డు కోసం వేట మొదలుపెడుతున్నది. క్షణక్షణానికి ఉత్కంఠను తారాస్థాయికి తీసుకెళ్లే ధనాధన్‌లో దంచికొట్టాలని ప్రణాళికలు రచిస్తున్న రోహిత్ బృందం.. కివీస్ గడ్డపై తొలి టీ20 సిరీస్‌ను ఒడిసిపట్టుకోవాలని భావిస్తున్నది. మరోవైపు తమకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో ఆధిపత్యం చూపెట్టాలని యోచిస్తున్న కివీస్.. వన్డే సిరీస్‌కు ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య నేడు తొలి టీ20 మ్యాచ్ జరుగనుంది.

వెల్లింగ్టన్: గత మూడు నెలల విదేశీ పర్యటనలో చిరస్మరణీయ విజయాలు సొంతం చేసుకున్న భారత్ జట్టు.. తుది అంకాన్ని కూడా ఘనంగా ముగించేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే 4-1తో వన్డే సిరీస్‌ను సాధించిన టీమ్‌ఇండియా.. పొట్టి ఫార్మాట్‌లోనూ ఆధిపత్యం చూపెట్టాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం న్యూజిలాండ్‌తో జరిగే తొలి టీ20లో అమీతుమీ తేల్చుకోనుంది. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీకి విశ్రాంతి ఇవ్వడంతో కల్పించేందుకు కసరత్తులు ముమ్మరం చేసింది. మే-జూలైలో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు ముందు భారత్.. ఐపీఎల్, ఆసీస్‌తో వన్డే సిరీస్ మాత్రమే ఆడుతుంది. దీంతో ఆ 15 మంది ఎవరనే దానిని ఇప్పుడే తేల్చేందుకు సిద్ధమవుతున్నది.

పంత్ వచ్చేశాడు..!

వన్డే సిరీస్‌కు దూరంగా ఉన్న కుర్ర వికెట్ కీపర్ రిషబ్ పంత్ పరుగుల దాహంతో ఉన్నాడు. వరల్డ్‌కప్ జట్టులో చోటు కావాలంటే ఈ సిరీ





విలియమ్సన్

రోహిత్ సారథ్యంలోని కుర్రాళ్లు సిరీస్ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసీస్, కివీస్ గడ్డపై వరుస విజయాలతో ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్ జట్టుపై ఓ అవగాహనకు వచ్చిన టీమ్ మేనేజ్‌మెంట్ లోటుగా మిగిలిపోతున్న స్థానాలపై కూడా తుది అంచనాకు రావాలని భావిస్తున్నది. ఈ సిరీస్‌లో రాణించిన వాళ్లకు సరైన అవకాశాలు

స్‌లో రాణించడం అతనికి అత్యంత కీలకం. అలాగే దినేశ్ కార్తీక్‌కు కూడా ఇదో గొప్ప అవకాశమనే చెప్పొచ్చు. ఆసీస్‌తో టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్న వెటరన్ ఎంఎస్ ధోనీ మళ్లీ జట్టులోకి రావడంతో లైనప్‌లో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఐదో వన్డేలో 90 పరుగులతో చెలరేగిన అంబటి రాయుడుకు మిడిలార్డర్‌లో ఓ స్థానం ఖరారైనట్లే. అందరి నోళ్లలో నానుతున్న 19 ఏండ్ల యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్.. చివరి రెండు వన్డేల్లో నిరూపించుకోలేకపోయాడు. అయితే విరాట్ గైర్హాజరీతో టీ20ల్లో గిల్ మూడోస్థానంలో బ్యాటింగ్‌కు దిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఆల్‌రౌండర్ క్రునాల్ పాండ్యా కూడా జట్టులో చోటు కోసం తీవ్రంగా పోటీపడుతున్నాడు. కానీ ఇతనికి కేదార్ జాదవ్ నుంచి గట్టిపోటీ ఉంది. వన్డే సిరీస్‌లో రాణించలేకపోయిన ధవన్ కూడా కసిగా కనిపిస్తున్నాడు. టెన్నిస్ బంతితో నెట్స్‌లో చెమటోడ్చాడు. బౌలింగ్‌లో బుమ్రా లేకపోవడంతో భారం మొత్తం భువనేశ్వర్‌పై పడింది. సిరాజ్ అవకాశాలను వృథా చేసుకోవడంతో అతని స్థానంలో ఖలీల్ అహ్మద్‌ను తీసుకున్నారు. పంజాబ్ పేసర్ సిద్ధార్థ్ కౌల్‌కు అవకాశం లేనట్లే. మూడో సీమర్‌గా హార్దిక్ పాండ్యా బాధ్యతలు తీసుకోనున్నాడు. స్పిన్నర్లలో కుల్దీప్, చాహల్‌లో ఒకరికే చాన్స్ దక్కొచ్చు. ఓవరాల్‌గా తొలి మ్యాచ్‌లో ప్రభావం చూపిన ఆటగాళ్లకు దాదాపుగా వరల్డ్‌కప్ బెర్తులు ఖాయమైనట్లే.

ప్రతీకారం కోసం..

వన్డే సిరీస్‌ను చేజార్చుకుని ఇంటా, బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న న్యూజిలాండ్ ఇప్పుడు పరువు కాపాడుకునే పనిలో పడింది. స్టార్లు అందుబాటులో ఉన్నా సమిష్టిగా ఆడటంలో విఫలంకావడంతో మేనేజ్‌మెంట్ ప్రక్షాళనపై గురిపెట్టింది. వరల్డ్‌కప్‌నకు నాలుగు నెలల సమయమే ఉండటంతో అన్ని వనరులను క్షుణ్ణంగా పరిశీలించాలని భావిస్తున్నది. 2008-09లో కివీస్ గడ్డపై ఆడిన ఏకైక సిరీస్‌లో భారత్ 0-2తో ఓటమిపాలైంది. 2012లో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య జట్టు 1-0తో ఎగురేసుకుపోయింది. 2017-18లో భారత్‌లో జరిగిన సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-1తో సాధించింది. కెప్టెన్ విలియమ్సన్, టేలర్ ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. మున్రో గాడిలో పడాలి. నీషమ్, గ్రాండ్‌హోమీ, సీఫెర్ట్ చెలరేగితే భారీ స్కోరు ఖాయం. ప్రధాన పేసర్ ట్రెంట్ బౌల్ట్ లేకపోవడం లోటు. బ్రాస్‌వెల్, ఫెర్గుసన్, సౌతీ, సోధీ భారత్‌ను అడ్డుకోవడంపైనే విజయం ఆధారపడి ఉంటుంది. ఆల్‌రౌండర్ డారెల్ మిచెల్, పేసర్ బ్లెయిర్ టిక్నెర్‌కు అరంగేట్రం అవకాశం ఇస్తారో లేదో చూడాలి.

జట్ల అంచనా

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, గిల్, పంత్, కార్తీక్, ధోనీ, పాండ్యా, క్రునాల్ పాండ్యా / కేదార్ జాదవ్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, చాహల్ / కుల్దీప్.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), మున్రో, సీఫెర్ట్, టేలర్, నీషమ్, గ్రాండ్‌హోమీ, సాంట్నెర్, కుగ్గెలిన్, బ్రాస్‌వెల్, ఫెర్గుసన్ / సౌతీ, సోధీ

పిచ్, వాతావరణం

వెస్ట్‌ప్యాక్ పిచ్ ఎప్పుడూ మిస్టరీగానే ఉంటుంది. పైకి కనిపించిన దానికి భిన్నంగా స్పందిస్తుంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపిస్తున్నా.. ఆరంభంలో స్వింగ్ కావొచ్చు. మంచు ప్రభావం ఉంటుంది. టాస్ కీలకం.


1 రోహిత్ సారథ్యంలో భారత్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క దాంట్లో ఓటమిపాలైంది.

10 చివరి పది ద్వైపాక్షిక టీ20 సిరీస్‌ల్లో భారత్ ఒక్కదాంట్లో కూడా ఓడిపోలేదు.



రిషబ్

మధ్యాహ్నం 12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో



రవిశాస్త్రి

కుల్దీప్ నంబర్‌వన్ బౌలర్

వెల్లింగ్టన్: భారత యువ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌పై జట్టు చీఫ్ కోచ్ రవిశాస్త్రి ప్రశంసలు గుప్పించాడు. విదేశాల్లో అతను మా నంబర్‌వన్ బౌలరంటూ కుల్దీప్‌ను ఆకాశానికెత్తాడు. సీనియర్ స్పిన్నర్లు అశ్విన్, జడేజా కంటే కుల్దీప్ ముందంజలో కొనసాగుతున్నాడని స్పష్టం చేశాడు. తుది జట్టులో ఒక స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే అది కచ్చితంగా కుల్దీప్ అని శాస్త్రి పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ సందర్భంగా ఓ వెబ్‌సైట్‌కు రాసిన ప్రత్యేక కాలమ్‌లో రవి పలు విషయాలు మాట్లాడాడు. 'ఇప్పటికే కుల్దీప్..పలు విదేశీ టోర్నీల్లో సత్తాచాటాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన ఆఖరి టెస్ట్‌లో ఐదు వికెట్లు తీసి సత్తాచాటాడు. ప్రతి ఒక్కరికి ఒక్కో సమయం వస్తుంది (గతేడాదిలో అశ్విన్ ఫిట్‌నెస్‌ను ఉద్దేశిస్తూ). విదేశీ టెస్ట్‌ల్లో ప్రస్తుతం కుల్దీప్ స్పిన్ హవా నడుస్తున్నది. సిడ్నీ టెస్ట్‌లో ఈ చైనామన్ బౌలింగ్‌ను అర్థం చేసుకోవడంలో ఆసీస్ బ్యాట్స్‌మెన్ ఘోరంగా తడబడ్డారు. వైవిధ్యమైన బంతులతో వికెట్ల వేట కొనసాగించిన కుల్దీప్..కచ్చితంగా మా నంబర్‌వన్ బౌలర్. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై చారిత్రక టెస్ట్ సిరీస్ విజయంలో పుజార కీలక భూమిక పోషించాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో జట్టులో చోటు కోల్పోయిన పుజార..తన బ్యాటింగ్ స్టాన్స్‌లో మార్పులతో బౌలర్లకు సింహస్వప్నంలా నిలిచాడు. ఆసీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు' అని రవిశాస్త్రి అన్నాడు.

రిచర్డ్స్, ఇమ్రాన్‌ను గుర్తుకు తెస్తున్నాడు:

క్రికెట్ ప్రపంచాన్ని ఏకఛత్రాధిపత్యంతో ఏలిన దిగ్గజాలు వీవీయన్ రిచర్డ్స్, ఇమ్రాన్ ఖాన్‌ను విరాట్ కోహ్లీ గుర్తుకు తెస్తున్నాడని టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. 'దిగ్గజ రిచర్డ్స్, ఇమ్రాన్‌ను దగ్గరగా చూసిన



వాడిగా చెబుతున్నాను. విరాట్‌లో వాళ్లిద్దరు కనిపిస్తున్నారు. ఆధిపత్యం, దూకుడు కనబరుచడంలో కోహ్లీని మించిన క్రికెటర్ కనిపించడం లేదు. క్రమశిక్షణ, ట్రైనింగ్, స్వీయ నియంత్రణలో అతను అద్భుతం. ఇమ్రాన్‌ను చాలా కోణాలను కోహ్లీ గుర్తుకు తెస్తుంటాడు. లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు తగ్గట్లు కఠోరంగా శ్రమించడం విరాట్‌లో కనిపిస్తుంది. ఇమ్రాన్‌లా కోహ్లీ.. జట్టును ముందుండి నడిపిస్తాడు' అని శాస్త్రి అన్నాడు.

జాతీయ టీ20 చాంప్ తెలంగాణ

చందన ఆల్‌రౌండ్ ప్రదర్శన ■ ఫైనల్లో ఉత్తర్‌ప్రదేశ్‌పై అద్భుత విజయం

మయూరి సెంటర్, ఖమ్మం: తెలంగాణ మహిళల క్రికెట్ జట్టు గెలుపు బావుటా ఎగురేసింది. జాతీయ స్థాయి టీ20 టోర్నీలో తెలంగాణ చాంపియన్‌గా నిలిచి సత్తాచాటింది. టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన మన జట్టు ఫైనల్లోనూ అదరగొట్టింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఉత్తర్‌ప్రదేశ్‌తో జరిగిన టైటిల్ పోరులో తెలంగాణ 3 పరుగుల తేడా(డక్‌వర్త్ లూయిస్ పద్ధతి)తో అద్భుత విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తర్‌ప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులు చేసింది. కల్పన(3/21), మమత(2/14), చందన (2/21) విజృంభణతో యూపీ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చెలరేగడంతో యూపీ బ్యాట్స్‌వుమెన్ నిలదొక్కుకోలేకపోయారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన తెలంగాణ..వెలుతురులేమితో మ్యాచ్ ఆగిపోయే సమయానికి 13 ఓవర్లలో 3 వికెట్లకు 82 పరుగులు



ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ చందన

చేసింది. వెలుతురు సరిగ్గా లేకపోవడంతో మ్యాచ్ అర్ధంతరంగా ముగిసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం రన్‌రేట్ ఆధారంగా తెలంగాణను విజేతగా ప్రకటించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' చందన(35 బంతుల్లో 55), కల్పన(11) ఆకట్టుకున్నారు. చందనకు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌తో పాటు బెస్ట్ బ్యాట్స్‌వుమన్‌గా అవార్డులు కైవసం చేసుకుంది. జిల్లా జడ్జీలు లక్ష్మణ్, వినోద్‌కుమార్, పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, ఏసీపీ వెంకట్రావు విజేతలకు బహుమతులు అందజేశారు.

పంత్.. టీమ్‌ఇండియాకు ఆస్తి

క్షణాల్లో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేస్తాడు: ధవన్

వెల్లింగ్టన్: యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్.. భారత్ జట్టుకు ఓ ఆస్తిగా మారాడని సీనియర్ ఓపెనర్ శిఖర్ ధవన్ ప్రశంసలు కురిపించాడు. చాలా తక్కువ సమయంలో మ్యాచ్ స్వరూపాన్ని మార్చే సత్తా అతని సొంతమని కితాబిచ్చాడు. 'పంత్ దూకుడైన బ్యాట్స్‌మన్. జట్టుకు అతను తరగని ఆస్తి. ప్రత్యర్థుల నుంచి క్షణాల్లో మ్యాచ్‌ను లాగేసే సత్తా ఉన్న ఆటగాడు. ఈ సిరీస్‌లో వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టుకుంటాడనే నమ్మకం ఉంది. తిరుగులేని విజయాలతో ఈ టూర్‌కు ముగింపు పలకాలని భావిస్తున్నాం. ఇదే స్థాయిలో స్వదేశంలో ఆసీస్‌తో సిరీస్‌ను మొదలుపెట్టాలనుకుంటున్నాం' అని ధవన్ పేర్కొన్నాడు. రాబోయే సిరీస్ కుర్రాళ్లకు మంచి అవకాశమని చెప్పిన చీఫ్ కోచ్ రవిశాస్త్రి.. సీనియర్లు రోహిత్, ధవన్‌కు కూడా విశ్రాంతి ఇవ్వడం ముఖ్యమేనన్నాడు. ఈ వ్యాఖ్యలతో ధవన్ ఏకీభవించాడు. తాము కూడా మనుషులమేనని, తమ శరీరాలు కూడా విశ్రాంతిని కోరుకుంటాయన్నాడు. టెన్నిస్ బంతితో ప్రాక్టీస్ గురించి మాట్లాడుతూ.. 'బౌన్సర్లను దీటుగా ఎదుర్కోవాలంటే టెన్నిస్ బంతితో ప్రాక్టీస్ చేయాలి. నాకు కండపుష్టి బాగా ఉంది. కాబట్టి బౌన్సర్ బంతిని బలంగా లాగి కొడితే చాలు. ఇప్పుడు అదే ప్రాక్టీస్ చేస్తున్నా. త్రో డౌన్స్‌తో ఇంత బౌన్స్ రాదు. సరైన ప్రదేశాల్లో బంతి పడదు. స్వింగ్‌ను ఎదుర్కోవడంపై కూడా దృష్టిపెట్టాం. ఫార్మాట్ మారుతున్నప్పుడల్లా మానసిక దృక్పథాన్ని కూడా మార్చుకోవాలి. వికెట్ మీద మన ఆటతీరు ఆధారపడుతుంది. బలమైన షాట్లు కొట్టడం నాకు ఇష్టం. వికెట్ సహకరిస్తే అలాగే ఆడుతా' అని ధవన్ వెల్లడించాడు.

కెప్టెన్సీ నుంచి చండిమల్ ఔట్

కొలంబో: ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న కెప్టెన్ దినేశ్ చండిమల్‌కు లంక క్రికెట్ బోర్డు షాకిచ్చింది. సారథ్యం నుంచి అతన్ని తొలగించి.. దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపిక చేసిన 17 మంది జట్టు నుంచి తప్పించింది. దేశవాళీ టోర్నీ ల్లో ఆడి ఫామ్‌ను సంతరించుకోవాలని సెలెక్టర్లు చండిమల్‌కు సూచించారు. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ దిముత్ కరుణరత్నేను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించారు. ఈనెల 13 నుంచి సఫారీ జట్టుతో లంక రెండు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో చండిమల్ 5, 10, 15, 4 పరుగులే చేశాడు. సఫారీలతో టెస్ట్ సిరీస్‌కు ముగ్గురు



అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు ఒషాడో ఫెర్నాండో, సీమ్ బౌలర్ మహ్మద్ షిరాజ్, లెఫ్టార్మ్ స్పిన్నర్ లసిత్ ఎంబుల్డెనియాకు అవకాశం ఇచ్చారు. దాదాపు మూడేండ్ల తర్వాత ఆల్‌రౌండర్ మిలిండా సిరివర్దనకు పిలుపు అందింది.



హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ బాక్సింగ్ లీగ్ ముగిసింది. టోర్నీ ఫైనల్లో అఫ్ఘనిస్తాన్ బాక్సర్ అల్‌హదాద్ రహిమి, భారత బాక్సర్ శుభమ్ శర్మను ఓడించి విజేతగా నిలిచాడు. వీరిద్దరి మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. విజేతను తేల్చేందుకు వీరి బౌట్‌ను మరో రెండు రౌండ్లపాటు జడ్జీలు పెంచారు.

స్నెల్ పటేల్ సెంచరీ

సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 307 ఆలౌట్ ■ రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ 55/2

నాగ్‌పూర్: విదర్భతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర పోరాట స్ఫూర్తి చూపెట్టింది. 158 పరుగులకే సగం జట్టు పెవిలియన్‌కు చేరినా.. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ దీటుగా ఆడటంతో తేరుకుంది. స్నెల్ పటేల్ (102) ఈ సీజన్‌లో తొలి సెంచరీ నమోదు చేయడంతో.. మంగళవారం మూడో రోజు సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 117 ఓవర్లలో 307 పరుగులకు ఆలౌటైంది. దీంతో విదర్భకు కేవలం ఐదు పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. 158/5 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన స్నెల్ పటేల్, మన్కడ్ (21)పై ఉమేశ్ యాదవ్ బౌన్స్‌తో ఎదురుదాడి చేశాడు. ఆడటానికి కూడా వీలుకాని స్థాయిలో పేస్‌తో బెంబేలెత్తించాడు. ఈ క్రమంలో పటేల్ చేయికి, తలకు బలంగా బంతి తాకింది. తర్వాత ఎంఆర్‌ఐ స్కానింగ్ కూడా చేయించుకోవాల్సి వచ్చింది. మన్కడ్ భుజానికి కూడా బంతి తాకినా.. ఈ ఇద్దరు పట్టుదలతో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. ఈ ఇద్దరు ఆరో వికెట్‌కు 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను పటిష్ఠపరిచారు. 11 పరుగుల తేడాతో ఈ ఇద్దరు ఔటైనా.. జడేజా (23) విదర్భ బౌలర్లను ఆడుకున్నాడు. కమ్లిష్ మక్వానా (27)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 38 పరుగులు జత చేశాడు. చివర్లో ఉనాద్కట్ (46) ఇన్నింగ్స్‌తో సౌరాష్ట్ర బాగా తేరుకుంది. తన ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్.. చేతన సకారియా (28 నాటౌట్)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. దాదాపు 26.5 ఓవర్ల పాటు విదర్భ బౌలర్లను విసిగించిన ఈ జోడీ పదో వికెట్‌కు 60 పరుగులు జోడించడంతో సౌరాష్ట్ర స్కోరు 300లు దాటింది. స్పిన్నర్లు ఆదిత్య సర్వాటే 5, అక్షయ్ వాఖరే 4 వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 31 ఓవర్లలో 2 వికెట్లకు 55 పరుగులు చేసింది. గణేశ్ సతీష్ (24 బ్యాటింగ్), వసీమ్ జాఫర్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఫజల్ (10), సంజయ్ (16) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. జడేజా ఈ రెండు వికెట్లు తీశాడు. ప్రస్తుతం విదర్భ 60 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.



స్నెల్ పటేల్ (102)

మరో సిరీస్‌పై గురి..

భారత్, కివీస్ మహిళల తొలి టీ20 నేడు

వెల్లింగ్టన్: భారత మహిళల క్రికెట్ జట్టు మరో సిరీస్‌పై గురిపెట్టింది. న్యూజిలాండ్‌పై ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో గెలిచి మంచి జోరుమీదున్న టీమ్‌ఇండియా టీ20 పోరుకు సిద్ధమైంది. బుధవారం ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరుగనుంది. వెస్టిండీస్ వేదికగా గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్ తర్వాత భారత్‌కు ఇదే మొదటి మ్యాచ్. మెగా టోర్నీ సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్ కప్ ఆశలు నెరవేర్చుకోలేకపోయింది. సీనియర్ క్రికెటర్ మిథాలీరాజ్‌ను తప్పించడంతో వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. కివీస్‌తో టీ20 మ్యాచ్ విషయానికొస్తే..హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలో బరిలోకి



ఉదయం 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో

దిగుతున్న భారత్..తమ దూకుడు కొనసాగించేందుకు పట్టుదలతో కనిపిస్తున్నది. యువ క్రికెటర్లు స్మృతి మందన, జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు మిథాలీ మంచి ఫామ్‌మీదుండటం జట్టుకు బాగా కలిసిరానుంది. వన్డే సిరీస్‌లో కౌర్‌కు సరైన రీతిలో బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినా..టీ20ల్లో సత్తాచాటేందుకు తహతహలాడుతున్నది. మందన, రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నారు. ఫామ్‌లేమితో జట్టుకు దూరమైన వేదా కృష్ణమూర్తి స్థానంలో యువ ఆల్‌రౌండర్ ప్రియా పూనియా అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కివీస్‌తో ఆఖరి వన్డేలో మన బ్యాట్స్‌వుమెన్ తడబడ్డా..తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు రెడీగా ఉన్నారు. హైదరాబాదీ అరుంధతి రెడ్డి, మాన్సి జోషి, శిఖా పాండే, పూనమ్ యాదవ్, రాధా యాదవ్‌తో టీమ్‌ఇండియా బౌలింగ్ బెంచ్ బలంగా కనిపిస్తున్నది. మరోవైపు వన్డే సిరీస్ ఓటమికి టీ20 సిరీస్ ద్వారా ప్రతీకారం తీర్చుకునేందుకు కివీస్ కసితో ఉన్నది. సొంతగడ్డపై పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యర్థిపై ఆధిపత్యం సాధించే ప్రయత్నంలో ఉన్నది. దీంతో ఇరు జట్ల మధ్య సిరీస్ రసవత్తరంగా సాగే అవకాశముంది.

టీ20లకు మిథాలీ వీడ్కోలు!

భారత సీనియర్ క్రికెటర్ మిథాలీరాజ్ త్వరలో అంతర్జాతీయ టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలుకనుందా. అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. స్వదేశం వేదికగా ఇంగ్లండ్‌తో వచ్చే నెలలో మొదలయ్యే టీ20 సిరీస్‌లో మిథాలీ గుడ్‌బై చెప్పే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే బుధవారం నుంచి న్యూజిలాండ్‌తో మొదలయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మిథాలీకి చాన్స్ లభిస్తుందా అనేది సందేహంగా మారింది. కివీస్‌తో వన్డే సిరీస్‌లో మెరుగ్గా రాణించిన ఈ హైదరాబాదీ క్రికెటర్‌కు టీ20ల్లో అంత మెరుగైన రికార్డు లేవు. ఈ కారణంగానే ఇటీవలి టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్ నుంచి అనూహ్యంగా తప్పించడం వివాదంగా మారింది. చీఫ్ కోచ్ రమేశ్ పొవార్, సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ తన క్రికెట్ కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మిథాలీ మీడియాకెక్కిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిథాలీకి మళ్లీ చాన్స్ దక్కుతుందా లేదో చూడాలి. దీనికి తోడు వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ యువ క్రికెటర్లకు ప్రాధాన్యమిచ్చే అవకాశమున్నట్లు వినికిడి. ఇదే జరిగితే మిథాలీ..రిజర్వ్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్ ద్వారా మిథాలీకి గౌరవంగా వీడ్కోలు ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు బోర్డు సీనియర్ అధికారి పేర్కొన్నాడు.

సరైన దారిలో హార్దిక్..

మాజీ క్రికెటర్ కిరణ్‌మోరే

ముంబై: ప్రపంచకప్ ముందు టీమ్ ఇండియాకు మరింత బూస్ట్. మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలతో నిషేధం అనంతరం జట్టులోకి తిరిగివచ్చిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి జట్టులో తానెంత కీలక ఆటగాడో నిరూపించుకున్నాడు. కివీస్‌తో ముగిసిన వన్డే సిరీస్‌లో పాండ్యా అద్భుత ప్రదర్శన చేశాడు.చివరి వన్డేలో తుఫాన్ వేగంతో బ్యాటింగ్ చేసి 22 బంతుల్లోనే 44 పరుగులు, బౌలింగ్‌లో కీలకమైన 2 వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా వివాదం నుంచి బయటపడి ఆటపై దృష్టిపెట్టాడని, అతను సరైన దారిలో పయనిస్తున్నాడని అతని మెంటార్, మాజీ క్రికెటర్ కిరణ్‌మోరే చెబుతున్నాడు.

ఫేవరెట్ జట్టుకు సమతూకం

వచ్చే ప్రపంచకప్‌లో కోహ్లీ నేతృత్వంలోని టీమ్ ఇండియా హాట్ ఫేవరెట్ హోదాతో బరిలోకి దిగనుంది. అద్భుతమైన ఓపెనింగ్ జోడీ..నిలకడగా ఆడుతున్న మిడిలార్డర్.. మాజీ కెప్టెన్ ధోనీ అండ..బౌలింగ్‌లో అదరగొడుతున్న మణికట్టు స్పిన్నర్లు..వికెట్ల వేట కొనసాగిస్తున్న పేసర్లు..ఈ నేపథ్యంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో అసమాన ప్రతిభ కలిగిన హార్దిక్ రాకతో టీమ్ ఇండియాకు అదనపు శక్తిని కలిగించిందన్నాడు. ఇప్పుడు వివాదాలన్నీ మరిచిన అతను క్రికెట్‌పైనే దృష్టిపెట్టాడని మోరే స్పష్టంగా చెప్పాడు. 'హార్దిక్ పూర్తిగా క్రికెట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాడు. న్యూజిలాండ్‌లో ఆడుతున్న సమయంలో అతని దృష్టి మొత్తం క్రికెట్‌పై లగ్నమైంది. నిషేధంతో తప్పును తెలుసుకున్నాడు. అతను ఇప్పుడు రాణించడం ద్వారా మానసికంగా తానెంత దృఢంగా ఉన్నాడో చాటాడు. అతను కుర్రాడు. ప్రతి మ్యాచ్ నుంచి అతను నేర్చుకుంటున్నాడు. ఒకసారి అతను పరిణితి చెందితే తానేం చేస్తున్నాడో తెలుసుకోగలుగుతాడు' అని కిరణ్ మోరే పేర్కొన్నాడు

సెన్సెక్స్	నిఫ్టీ
36,617	10,934
↗34	↗22

ముడి చమురు (బ్రెంట్) ↘ 62.18 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	34,475
22 క్యారెట్లు	34,325
వెండి (కిలో)	41,700

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.90	75.40
యూరో	78.70	86.70
బహ్రెయిన్ దినార్	183.20	195.20
కువైట్ దినార్	227.70	240.70
సౌదీ రియాల్	18.10	19.90
యూఏఈ దిర్హామ్	18.60	20.20

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	70.00
రిటైల్ లైవ్	92.00
డ్రెస్డ్	133.00
స్కిన్‌లెస్	152.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	403-00
రంగారెడ్డి	403-00
మెదక్	403-00
కరీంనగర్	405-00
వరంగల్	405-00
రిటైల్ ప్రైస్	4-65

ఫ్లిప్‌కార్ట్‌కు వాల్‌మార్ట్ గుడ్‌బై?

మోర్గాన్ స్టాన్లీ అంచనా ▪ కొత్త ఈ-కామర్స్ విధానమే కారణం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: వాల్‌మార్ట్-ఫ్లిప్‌కార్ట్ మురిపెం.. మూణ్ణాళ్ల ముచ్చటేనా. కార్ట్, మార్ట్ బంధం ముగిసిపోనుందా.. మోర్గాన్ స్టాన్లీ అంచనాలను చూస్తుంటే ఇలాంటి సందేహాలే వ్యక్తమవుతున్నాయి మరి. దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌ను అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్.. 16 బిలియన్ డాలర్లు పోసి సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. భారత్‌లో ఆన్‌లైన్ మార్కెట్‌కు నానాటికీ పెరుగుతున్న ఆదరణ.. వాల్‌మార్ట్‌ను భారీ డీల్ వైపు నడిపించగా, ఫ్లిప్‌కార్ట్‌ను ఒడిసిపట్టుకునేలా చేసింది. ఇక్కడివరకు కథంతా బాగానే ఉన్నా.. అసలు వ్యథ వాల్‌మార్ట్‌కు ఈ నెల 1 నుంచే మొదలైంది. ఈ-కామర్స్ కంపెనీలకు సంబంధించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నూతన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి తెచ్చిన సంగతి విదితమే. ఈ కొత్త ఎఫ్‌డీఐ విధానం ప్రకారం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ వేదికలు తమ వెబ్‌సైట్ల ద్వారా జరిపే అమ్మకాలు పారదర్శకంగా ఉండాలి. ఆయా ఉత్పాదక సంస్థలతో టై-అప్ అవడం లేదా వాటిల్లో వాటాలను కొనడం ద్వారా మార్కెట్‌ను శాసిస్తున్నాయని, కొన్ని బ్రాండ్ల అమ్మకాలకే పెద్దపీట వేసి, మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తున్నాయనే కేంద్రం కొత్త ఈ-కామర్స్ పాలసీని తీసుకువచ్చింది. సంప్రదాయ మార్కెట్ నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు, ఆందోళనలూ వ్యక్తం కావడం కూడా నయా పాలసీ రాకకు ఓ కారణమే. దీంతో వాల్‌మార్ట్ ఆశలు నీరుగారిపోయాయి. లాభం లేకపోతే ఫ్లిప్‌కార్ట్ ఎందుకు దండగ అన్నతీరులో మోర్గాన్ స్టాన్లీ అంచనాలూ ఉన్నాయి.

ఆదాయం ఆవిరి

కొత్త నిబంధనలతో ఆన్‌లైన్ మార్కెటీర్లకు ఆదాయం ఆవిరైపోతున్నది. ఇప్పటికే ఈ నూతన ఈ-కామర్స్ విధానంతో అమెజాన్ రాత్రికిరాత్రి లక్షలాది వస్తువులను తమ వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ఫ్లిప్‌కార్ట్ సైతం 25 శాతం ఉత్పత్తులను తీసేయాల్సి వస్తున్నది. ఇందులో స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్సే అధికం. ఫ్లిప్‌కార్ట్ అమ్మకాల్లో 50 శాతం వాటా వీటిదే. దీంతో భారతీయ ఆన్‌లైన్ మార్కెట్ పరుగులకు ఇక బ్రేక్ పడినట్లేనని అంటున్నది అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ మోర్గాన్ స్టాన్లీ. ఏ ఆదాయం కోసమైతే, ఏ వ్యాపారాభివృద్ధి కొరకైతే ఫ్లిప్‌కార్ట్‌ను వాల్‌మార్ట్ చేజిక్కించుకున్నదో.. అవే దూరమయ్యాక మార్ట్‌కు కార్ట్ భారమేగా అన్న అభిప్రాయాన్ని స్టాన్లీ వెలిబుచ్చుతున్నది. భవిష్యత్తులో ఫ్లిప్‌కార్ట్ ఆదాయం ఊసూరుమనిపించేలాగానే ఉండొచ్చని హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే 2017 చివరన చైనాలో అమెజాన్‌కు ఎదురైన అనుభవమే.. ఇప్పుడు భారత్‌లో వాల్‌మార్ట్‌కు ఎదురైనా ఆశ్చర్యపోనక్కర్లేదని సోమవారం పొద్దుపోయాక విడుదలైన ఓ నివేదికలో మోర్గాన్ స్టాన్లీ అంటున్నది. నాడు అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ ఆఫర్లు, మొబైల్ యాప్ చైనా వినియోగదారులను ఏమాత్రం ఆకట్టుకోలేదు. ఫలితంగా ఈ గ్లోబల్ ఆన్‌లైన్ దిగ్గజం చైనాకు బైబై చెప్పేసింది.

స్టాక్ మార్కెట్లలోనూ దెబ్బ

దేశీయ ఈ-కామర్స్ విధానం సెగ.. అంతర్జాతీయంగానూ వాల్‌మార్ట్, అమెజాన్‌లకు తగులుతున్నది. భారత్‌లో కొత్త పాలసీ అమల్లోకి వచ్చినరోజే అమెరికా స్టాక్ మార్కెట్లలో వాల్‌మార్ట్, అమెజాన్‌ల మార్కెట్ విలువ భారీ ఎత్తున పతనమైంది. గత శుక్రవారం ఒక్కరోజే ఏకంగా 50 బిలియన్ డాలర్లకుపైగా మార్కెట్ విలువ దిగజారింది. నాస్‌డాక్ స్టాక్ మార్కెట్‌లో అమెజాన్ షేర్ విలువ 5.38 శాతం క్షీణించి 1,626.23 డాలర్ల వద్దకు చేరడంతో.. సంస్థ మార్కెట్ విలువ 45.22 బిలియన్ డాలర్లు తగ్గింది. అలాగే న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌వైఎస్‌ఈ)లో వాల్‌మార్ట్ షేర్ విలువ 2.06 శాతం క్షీణించి 93.86 డాలర్ల వద్ద నిలువడంతో.. సంస్థ మార్కెట్ విలువ 5.7 బిలియన్ డాలర్లు పడిపోయింది. రెండు సంస్థలు కలిసి 50.92 బిలియన్ డాలర్ల (డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ప్రకారం దాదాపు రూ.3,64,400 కోట్లు) మార్కెట్ విలువను నష్టపోయాయి.

ఆన్‌లైన్ బీటూబీపై దృష్టి

ముంబై: ఆన్‌లైన్ మార్కెట్‌లో ప్రత్యర్థి సంస్థలకు పోటీనిచ్చేందుకు బీటూబీ (బిజినెస్ టు బిజినెస్) ఈ-కామర్స్ బిజినెస్‌పై దృష్టి పెడుతామని వాల్‌మార్ట్ ఇండియా మంగళవారం తెలిపింది. ఈ కామర్స్ రంగంలో ఎఫ్‌డీఐ నిబంధనల ప్రతికూలతల నేపథ్యంలో ఓమ్ని చానెల్, ఆన్‌లైన్ బీటూబీల్లో రెండంకెల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పింది. కాగా, ఫ్లిప్‌కార్ట్, వాల్‌మార్ట్ ఇండియా వేర్వేరని, ఫ్లిప్‌కార్ట్‌ను వాల్‌మార్ట్ ఇండియా మాతృ సంస్థ వాల్‌మార్ట్ ఐఎన్‌సీ నడిపిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.



ఒప్పో ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్

తెలంగాణ ప్రభుత్వంతో
ఒప్పో ఒప్పందం
స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలకు సహకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వంతో చైనాకు చెందిన ప్రముఖ మొబైల్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో.. ఒప్పందం కుదుర్చుకుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతోపాటు స్టార్టప్‌లకు సహాయం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో వివరించింది. స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్లకు అండగా ఉండేందుకు, వివిధ నైపుణ్యాల్లో వాళ్లకు కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కాగా, ఒప్పో సంస్థ స్టార్టప్‌లకు సంబంధిత అంశాల్లో నైపుణ్య సంబంధ సహాయం, మెంటరింగ్ కల్పించనుండగా ప్రభుత్వం తరపున తగు ఎకోసిస్టమ్‌ను అందించనున్నారు. కెమెరాలు, ఇమేజింగ్ ప్రాసెస్, బ్యాటరీ, 5జీ నెట్‌వర్క్స్, సిస్టమ్ పర్‌ఫార్మామెన్స్, పేమెంట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గేమింగ్ రంగాల్లో ఈ సహాయ సహకారాలు ఉండనున్నాయి. దేశంలోని మొబై ఫోన్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఆయా స్టార్టప్‌లు చూపించే పరిష్కార మార్గాలను అనుసరించి స్టార్టప్‌ల ఎంపిక ఉండనుంది. ఒప్పో ఆర్‌అండ్‌డీ ఇండియా హెడ్ తస్లీమ్ ఆరిఫ్ మాట్లాడుతూ 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఈ ఒప్పందం ద్వారా భారత్‌లో స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల మార్కెట్‌ను ప్రభావితం చేసే ఆవిష్కరణలు రానున్నాయి' అన్నారు.



24 గంటల్లో రిఫండ్లు
రెండేండ్లలో ఐటీ చెల్లింపుదారులకు అందనున్న సౌకర్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కేవలం ఒకే ఒక్క రోజులో ఆదాయం పన్ను (ఐటీ) రిటర్నుల ప్రక్రియ, రిఫండ్ల జారీ అయిపోగలదని రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. అయితే ఇందుకు మరో రెండేండ్లు ఆగాలన్నారు. ఇప్పటికే ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) సమాచార వ్యవస్థ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.4,200 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఇది పూర్తయితే రిటర్నుల ప్రాసెస్, రిఫండ్లు, పరిశీలన తదితర పనులు వేగవంతం కాగలవని చెప్పారు. ప్రస్తుతం రిఫండ్లు.. ఆటోమేటిక్ పద్ధతిలో ఆన్‌లైన్ ప్రాసెస్ అవుతున్నాయన్న ఆయన ఈ ఏడాదిలో రూ.1.50 లక్షల కోట్ల రిఫండ్లు నేరుగా బ్యాంక్ ఖాతాల్లోనే జమవుతాయని తెలిపారు. అయితే ఇప్పుడున్న వ్యవస్థ అప్‌గ్రేడ్ కావాల్సి ఉందన్న పాండే.. అది విజయవంతమైతే 24 గంటల్లోగా రిఫండ్లను అందుకోవడం సాధ్యమేనన్నారు. వీలైనంత త్వరగానే ఈ సౌకర్యాన్ని ఐటీ చెల్లింపుదారులకు అందించేందుకు కృషి చేస్తున్నామని, అయినప్పటికీ రెండేండ్ల సమయం పట్టవచ్చున్నారు. ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ సౌలభ్యానికి సమయం తీసుకుంటున్నదని వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్.. పార్లమెంట్‌లో ఈ నెల 1న ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఐటీ శాఖ తమ కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో విస్తరిస్తున్నదని, రిటర్నులు, అసెస్‌మెంట్లు, రిఫండ్లు, ఇతరత్రా సేవలను ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయనుందని చెప్పిన విషయం తెలిసిందే.

వాణిజ్య యుద్ధంతో
భారత్‌కు లాభమే

- ఐరాస నివేదిక అంచనా
- అత్యధిక లబ్ధి ఈయూ దేశాలకే



జెనీవా, ఫిబ్రవరి 5: అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంతో లాభపడుతున్న దేశాల్లో భారత్ కూడా ఉందని ఐక్య రాజ్య సమితి (ఐరాస) తమ తాజా నివేదికలో పేర్కొన్నది. ప్రపంచ అగ్ర రాజ్యాలైన అమెరికా-చైనా మధ్య ప్రస్తుతం జరుగుతున్న వాణిజ్య యుద్ధంతో యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలే అత్యధికంగా లాభపడుతున్నాయన్న ఐరాస.. ఈయూలో ఎగుమతులు 70 బిలియన్ డాలర్ల మేర పెరిగే వీలుందన్నది. గతేడాది మార్చిలో ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తుల దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలను వేసిన దగ్గర్నుంచి అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ చర్య చైనాను అమితంగా ప్రభావితం చేయడంతో డ్రాగన్ దేశం ప్రతీకార సుంకాలకు తెరతీసింది. దీంతో అమెరికా-చైనా మధ్యే ప్రధానంగా వాణిజ్య యుద్ధం నడుస్తున్నది. ఇరు దేశాలు బిలియన్ డాలర్లకొద్దీ విలువైన పన్నులతో పరస్పర సుంకాల పోరుకు సై అంటున్నాయి. ఈ క్రమంలో ఈ టిట్ ఫర్ టాట్ ట్రేడ్ వార్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చిక్కులు తప్పవని ఐరాస నిపుణులు అభిప్రాయపడుతుండగా, అయినప్పటికీ దేశీయ ఉత్పత్తిదారులకు ఈ పరిణామం లాభించేదిగానే వారు అభివర్ణిస్తున్నారు. కాగా, ఐరాస నివేదిక ప్రకారం ఈయూ తర్వాత జపాన్, కెనడా దేశాల ఎగుమతులు 20 బిలియన్ డాలర్ల చొప్పున పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఆస్ట్రేలియా ఎగుమతులూ 4.6 శాతం పెరుగనున్నాయంటున్న ఐరాస నిపుణులు.. బ్రెజిల్ (3.8 శాతం), భారత్ (3.5 శాతం), ఫిలిప్పీన్స్ (3.2 శాతం) ఎగుమతులూ పెరుగుతాయని పేర్కొంటున్నారు. ఇదిలావుంటే అమెరికా-చైనా ద్వైపాక్షిక వాణిజ్యంలో చైనాదే పెత్తనమని ట్రంప్ తరచూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో 375 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును తగ్గించడానికి అమెరికా దిగుమతులను పెంచుతామని, ఆ దేశంలో పెట్టుబడులను పెడుతామని చైనా హామీ ఇస్తున్నది. ఈ నిర్ణయం అమలుకు వచ్చే నెల 1 ఆఖరు. ఈ గడువులోగా చైనా.. వాణిజ్య లోటును తగ్గించకపోతే ఇరు దేశాల ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు 10 శాతం నుంచి 25 శాతానికి పెరిగిపోతాయని ఐరాస చెబుతున్నది. మొత్తానికి ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం.. ఆయా దేశాల్లోని విదేశీ సంస్థల లాభాలను దెబ్బతీస్తున్నాయి. దీంతో ఈ రెండు దేశాలకు సంబంధం లేకుండా ఎగుమతి-దిగుమతులకు అన్ని దేశాలు ఉపక్రమిస్తున్నాయని ఐరాస చెబుతున్నది.

ఎట్టకేలకు లాభాల్లోకి పీఎన్‌బీ
క్యూ3లో రూ.246 కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద కుంభకోణానికి వేదికైన ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికి బ్యాంక్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 7.12 శాతం పెరిగి రూ.246.51 కోట్లుగా నమోదైంది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ రూ.14,356 కోట్ల రుణం తీసుకొని మోసం చేసిన విషయం తెలిసిందే. గతేడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.230.11 కోట్ల లాభాన్ని గడించింది. అలాగే బ్యాంక్ ఆదాయం 2.64 శాతం తగ్గి రూ.14,854.24 కోట్లకు పరిమితమైంది. ఈ సందర్భంగా బ్యాంక్ ఎండీ, సీఈవో సునీల్ మెహతా మాట్లాడుతూ.. చీకటి రోజుల నుంచి వెలుగులోకి వచ్చామని, పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం వల్లనే నీరవ్ మోదీ స్కాం నుంచి బయటపడ్డమని చెప్పారు. ఒక్క సమస్య బ్యాంక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని, దీని నుంచి బయట పడటానికి ఏడాదికి పైగా సమయం పట్టిందని తెలిపారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ అడ్వాన్స్‌లో 16.33 శాతానికి పెరుగడం కొంత ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. గతేడాది ఇది 12.11 శాతంగా ఉన్నది. అలాగే నికర ఎన్‌పీఏ మాత్రం 8.90 శాతం నుంచి 8.22 శాతానికి తగ్గినట్లు ఆయన పేర్కొన్నారు.

భెల్ 40 శాతం మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి ప్రభుత్వ రంగ సంస్థయైన భెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు 40 శాతం లేదా 80 పైసల మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడంతో ఈ నెల 21న వాటాదారులకు చెల్లింపులు జరుపనున్నది సంస్థ. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో రూ.191.95 కోట్ల లాభాన్ని గడించింది. గతేడాది నమోదైన రూ.153.19 కోట్లతో పోలిస్తే 25.30 శాతం పెరుగుదల నమోదైందని ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ అతుల్ సోబ్టి మంగళవారం తెలిపారు.

కిలోమీటర్‌కు రూ.1.75



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: బస్సు, రైళ్లలో ప్రయాణించాలంటే కిలోమీటర్‌కు సరాసరిగా రూ.2, అదే క్యాబ్‌లో ప్రయాణించాలంటే కనీసంగా రూ.5 చెల్లించాల్సి ఉంటుంది. కానీ విమానంలో ప్రయాణించాలంటే కిలోమీటర్‌కు రూ.1.75 చెల్లిస్తే సరిపోతున్నది. ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ మెగా సేల్ పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ దేశీయ విమానయాన రంగంలో అత్యంత చౌకది కావడం విశేషం. ఈ నెల 9 అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద 3.50 లక్షల సీట్లను కేటాయించింది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 25 లోగా ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చునని సూచించింది. ఎంపిక చేసిన రూట్లలో లిమిటెడ్ సీట్లు ఉండటంతో తొలుత వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే అంతర్జాతీయ రూట్లకు కిలోమీటర్‌కు రూ.2.5 చొప్పున చార్జీ విధించింది. జమ్ము-శ్రీనగర్, చెన్నై-బెంగళూరు, కొచి-బెంగళూరు, హుబ్లీ-బెంగళూరుల మధ్య ఒకవైపు విమాన టిక్కెట్ ధరను రూ.899గా ఉండనున్నది. దేశవ్యాప్తంగా గంటకు పైగా ప్రయాణ రూట్లలో కిలోమీటర్‌కు రూ.1.75గా నిర్ణయించింది. కంపెనీ వెబ్‌సైట్, ఆన్‌లైన్ ట్రావెల్ పోర్టల్స్, స్పైస్‌జెట్ మొబైల్ యాప్, ట్రావెల్ ఏజెంట్ల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చుని సూచించింది.

విమాన టిక్కెట్లపై స్పైస్‌జెట్ ప్రత్యేక ఆఫర్

బీవోబీ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రిజర్వు బ్యాంక్ పరపతి సమీక్ష కంటే ముందే ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) వడ్డీరేట్లను 0.2 శాతం పెంచింది. దీంతో గృహ, వాహన, ఇతర రుణాలపై చెల్లించే వడ్డీరేట్లు మరింత పెరుగనున్నాయి. ఎంసీఎల్‌ఆర్‌లో మార్పులు చేసింది. సవరించిన వడ్డీరేట్లు గురువారం నుంచి అమల్లోకి రానున్నాయి.

టెక్ మహీంద్రా లాభం రూ.1,203 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశంలో ఐదో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా విశ్లేషకుల అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్) గాను రూ.1,203 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18) ఇదే త్రైమాసికానికి నమోదైన రూ.943.10 కోట్ల లాభంతో పోలిస్తే 27.5 శాతం వృద్ధిని కనబరిచింది. ఆదాయం విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 15 శాతం ఎగబాకి రూ.8,944 కోట్లుగా నమోదైంది. 5 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్న సంస్థకు ఈ మూడో త్రైమాసికం కీలకంగా మారిందని, ప్రస్తుత త్రైమాసికంలో కమ్యూనికేషన్స్, ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారాల్లో నిలకడైన వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉన్నదని టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ తెలిపారు.

హైదరాబాద్‌లో 'మిరే' బిజినెస్ పార్క్?

హైదరాబాద్, ఫిబ్రవరి 5: దక్షిణ కొరియాకు చెందిన అసెట్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ 'మిరే' అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ.. దేశీయ రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. గతేడాది ఈ రంగంలో సేవలు ఆరంభించిన సంస్థ.. ఇక్కడే బిజినెస్ పార్క్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నది. అయితే ఎక్కడ ఏర్పాటు చేస్తుందన్నదానిపై ఇంకా స్పష్టత రాకపోయినప్పటికీ హైదరాబాద్‌తోపాటు పుణె, చెన్నై, ఢిల్లీ వంటి నగరాల్లో ఏదో ఒక నగరంలో ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈవో) స్వరూప్ మోహంతి సంకేతాలిచ్చారు. ఇప్పటికే రెండింటిని ఏర్పాటు చేయడం జరిగిందని, మరోకటి అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నట్లు ఆయన చెప్పారు. ఒక్కో ప్రాజెక్టు కోసం రూ.1,500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల వరకు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ బిజినెస్ పార్క్ ఏర్పాటులో హైదరాబాద్‌కు అత్యంత ప్రాధాన్యతనివ్వనున్నట్లు ప్రకటించిన ఆయన పూర్తి వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు. రాష్ట్రంలో అసెట్ మ్యూచువల్ ఫండ్లలోకి భారీగా పెట్టుబడులు పెడుతున్నారని, గతేడాది రూ.728 కోట్లు ఇన్వెస్ట్ చేశారని, ఈ ఏడాది ఇది వెయ్యి కోట్ల రూపాయలు దాటనున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే సంస్థ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 16 నగరాల్లో సేవలు అందిస్తుండగా, వచ్చే రెండేండ్లలో 30 నగరాలకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం రూ.23,500 కోట్లుగా ఉన్న అసెట్ మేనేజ్‌మెంట్ ఆస్తులు ఈ ఏడాది చివరినాటికి రూ.40 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు.

హెచ్‌పీసీఎల్ లాభంలో భారీ క్షీణత


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) ఆర్థిక ఫలితాలకు ఇన్వెంటరీ నష్టాలు, రిఫైనరీ మార్జిన్ల సెగ గట్టిగానే తగిలింది. దీంతో డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ నికర లాభం 87 శాతం క్షీణించి రూ.248 కోట్లకు పడిపోయినట్లు కంపెనీ సీఎండీ ముకేశ్ కే సురానా తెలిపారు. నిరుడు ఇదే కాలంలో రూ.1,950 కోట్లుగా ఉన్నది. క్రూడాయిల్ ధర లు భారీగా పతనమవడంతో ఇన్వెంటరీ నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. క్రూడాయిల్ కొనుగోలు చేసేనాడు ఉన్న ధరకు విక్రయించేనాటికి ఉన్న ధర భారీగా తగ్గడంతో రూ.3,465 కోట్లు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. కాగా, బ్యారెల్ చమురు శుద్ధి ద్వారా 3.72 డాలర్ల ఆదాయం సమకూరింది. గతేడాది వచ్చిన 9.04 డాలర్లతో పోలిస్తే భారీగా తగ్గడం ఫలితాలపై ప్రభావం చూపిందని తెలిపారు. సమీక్ష కాలంలో కంపెనీ విక్రయాలు రూ.62,832 కోట్ల నుంచి రూ.76,884 కోట్లకు చేరుకున్నాయి. అయినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతిషేరుకు రూ.6.50 మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది.

సైనిక స్థావరంపై దాడి

- 26 మంది జవాన్ల మృతి..
- ఆఫ్ఘన్‌లో ఘటన

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు మళ్లీ రెచ్చిపోయారు. కుందుజ్ ప్రావిన్స్‌లోని సైనిక స్థావరంపై తాలిబన్లు జరిపిన 26 మంది సైనికులు, పోలీసులు మృత్యువాత పడ్డారు. సోమవారం అర్ధరాత్రి రెండు గంటలకు ఈ ఘటన జరిగింది. తాలిబన్లు దాడి చేసిన సంగతి తెలియగానే అప్రమత్తమైన సైనిక బలగాలు, ఇతర ప్రాంతాల నుంచి అదనపు బలగాలను రప్పించారు. దాదాపు ఐదుగంటల పాటు ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సోమవారం రాత్రి రష్యా రాజధాని మాస్కోలో తాలిబన్లతో చర్చలకు మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయి సారథ్యంలోని ప్రతినిధి బృందం బయలుదేరి వెళ్లగా, ఈ దాడి జరుగడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

స్పీకర్‌కు మాతృ వియోగం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డికి మాతృ వియోగం కలిగింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో బాన్సువాడలో కన్నుమూశారు. రెండు రోజుల క్రితమే తీవ్ర అస్వస్థతకు గురైన పరిగె పాపవ్వ (107)కు బాన్సువాడ ఏరియా దవాఖానలో చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి బాన్సువాడకు చేరుకొని తల్లి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. అత్యవసర చికిత్స అందిస్తున్న సమయంలో మంగళవారం ఆమె తుదిశ్వాస విడిచారు. బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి చెందిన పరిగె పాపవ్వ భర్తపేరు పరిగె రాజిరెడ్డి. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందులో మూడో సంతానం పోచారం శ్రీనివాసరెడ్డి. తన రాజకీయ జీవితంలో ప్రధాన ఘట్టాలకు శ్రీకారం చుట్టబోయే ముందు పోచారం శ్రీనివాసరెడ్డి తల్లి ఆశీర్వాదం తీసుకుంటారు. ప్రతి ఎన్నికల్లోనూ తన మాతృమూర్తి పాపవ్వ ఆశీర్వాదంతోనే నామినేషన్ వేయడం పరిపాటి. తల్లి మరణ వార్త తెలిసిన వెంటనే శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి బాన్సువాడకు చేరుకున్నారు. ఆమె మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. బుధవారం బాన్సువాడలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

జీవితఖైదీ కుటుంబాలకు జైళ్ల శాఖ అండ

- 2016 నుంచి రూ.50 లక్షలకుపైగా రుణాలు అందజేత
- రుణ పరిమితిని రూ.లక్షకు పెంచే యోచనలో జైళ్లశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీవితఖైదు పడిన ఖైదీల కుటుంబాలకు జైళ్ల శాఖ ఆర్థికంగా ఉంటున్నది. వారి కుటుంబాలకు రుణాలు అందిస్తూ భరోసా కలిగిస్తున్నది. జీవితఖైదీల పిల్లల చదువులు, ఆడబిడ్డల పెండ్లిండ్లకు వడ్డీ లేకుండా రూ.50 వేల వరకు రుణాన్ని అందిస్తున్నది. దేశంలోనే ఏ జైల్లో కూడా లేనివిధంగా తెలంగాణ జైళ్ల శాఖ 2016 నుంచి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేస్తున్నది. ఒక్కో జీవితఖైదీ కుటుంబానికి వారి అవసరాలను బట్టి రూ.50వేల వరకు రుణం అందజేస్తున్నారు. ఈ మొత్తాన్ని లక్ష రూపాయలకు పెంచేందుకు జైళ్ల శాఖ ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. 2016 నుంచి 2018 డిసెంబర్ వరకు 197 మంది జీవితఖైదీలకు రూ.50,09,500 రుణాలు మంజూరుచేశారు. జైలుశిక్ష అనుభవిస్తున్నా తమ కుటుంబాలకు ఎంతోకొంత అండగా ఉన్నామన్న సంతృప్తితో ఆ ఖైదీల మానసిక పరివర్తనలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇంటి పెద్ద క్షణికావేశంలో చేసిన తప్పుకు జైలుపాలవడంతో వారి కుటుంబం రోడ్డున పడుతున్నది. ఫలితంగా పిల్లల చదువుకు ఆర్థిక వనరులు కరువై చదువు మాన్పించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకొన్న జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్.. జీవితఖైదు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేలా రుణాల మంజూరును ప్రవేశపెట్టారు.

జీవితఖైదు కుటుంబాలకు అందిస్తున్న రుణాలు

ఏడాది	రుణం పొందిన జీవితఖైదీల సంఖ్య	పొందిన రుణం మొత్తం
2016	137	36,58,500
2017	26	5,46,500
2018	34	8.04,500
మొత్తం	197	50,09,500

జైలులో ఉండి సంపాదించే మొత్తంలో కొద్దికొద్దిగా మినహాయించుకొనేలా రుణాలను మంజూరుచేస్తున్నట్టు జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఖైదీలు తయారుచేసి విక్రయించే ఉత్పత్తులపై వచ్చే లాభాల్లో నుంచి కొంత మొత్తాన్ని కూడా రుణాలకు వాడుతున్నట్టు చెప్పారు.

శ్రీశైలం ఎండీడీఎల్ దిగువ నీటిని వాడొద్దు

- కృష్ణానది యాజమాన్య బోర్డు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం జలాశయంలో ఎండీడీఎల్ దిగువ నీటిని ప్రస్తుతం వాడుకోవద్దని కృష్ణానది యాజమాన్య బోర్డు రెండు రాష్ట్రాలకు లేఖలు రాసింది. ప్రస్తుతం జలాశయంలో ఎండీడీఎల్ స్థాయిలో 834 అడుగుల నీటిమట్టం ఉన్నందున.. తదుపరి ఎలాంటి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయొద్దని లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ నీటిని తీసుకోవాల్సి వస్తే ముందుగా త్రిసభ్య కమిటీ అనుమతి ఉండాలని సూచించారు.

హైదరాబాదీ బాల మేధావికి ఎస్‌బీఐ యోనో అవార్డు



అవార్డు అందుకుంటున్న మహ్మద్ అలీ హసన్

హైదరాబాద్: వయస్సు చూస్తే 11 ఏండ్లు..కానీ బీటెక్, ఎంటెక్ చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. అతని ప్రతిభను గుర్తించిన బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)..యోనో అవార్డుతో సత్కరించింది. అతనే హైదరాబాదీ బాల మేధావి మహ్మద్ అలీ హసన్. తమ నైపుణ్యం, అనుభవంతో సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయత్నించిన దేశవ్యాప్తంగా ఉన్న 20 ఏండ్లలోపు ఉన్న యువ ప్రతిభావంతులను గుర్తించి బ్యాంక్ ఈ అవార్డులను అందజేసింది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏండ్ల పోతునూరి లయ కూడా ఉన్నది. వాహన ఉద్గారాలను నియంత్రించే ఫిల్టర్‌ను కనుగొన్నందుకుగాను లయకు ఈ అవార్డు లభించింది. బెంగళూరులో జరిగిన అవార్డుల ప్రధాన వేడుకలో 20 మంది యంగ్ ఎచీవర్స్‌ను యోనో ఎస్బీఐ 20 అండర్ ట్వెంటీ అవార్డులతో సత్కరించింది. ఈ యువ ప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించిన ఓటింగ్‌లో 1.7 లక్షల మంది పాల్గొన్నారు. ఎనిమిది మంది నిష్ణాతుల బృందంతో కూడిన కమిటీ చివరకు విజేతలను ప్రకటించింది. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ..2020 నాటికి వెయ్యి మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనుకుంటున్నట్లు చెప్పారు.

బలహీనతే బలిగొన్నది

జయరాం హత్యకు ప్రధాన కారణం అదే

శిఖాచౌదరి పాత్ర లేదంటున్న ఏపీ పోలీసులు ■ కేసు నీరుగార్చేందుకు రంగంలోకి ఏపీ పెద్దలు?

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ:

పారిశ్రామికవేత్త జయరాం హత్యకేసు యాక్షన్ థ్రిల్లర్‌ను తలపిస్తున్నది. పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం జయరాం తనకున్న బలహీనతతోనే సులభంగా రాకేశ్‌రెడ్డి ట్రాప్‌లో పడ్డారు. రాకేశ్ ప్లాన్ ప్రకారం అమ్మాయి పేరుతో చాటింగ్ చేసి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-10 లోని ఓ ఇంటికి రప్పించారు. ఈ కేసులో మొదటినుంచీ జయరాం మేనకోడలు శిఖాచౌదరి పేరు వినిపిస్తున్నది. ఈ కేసులో ఆమె అత్యంత కీలకమని భావించగా.. అసలు ఈ హత్యకు, శిఖాకు సంబంధంలేదని కృష్ణా జిల్లా ఎస్పీ ప్రకటించడంపై విమర్శలు వస్తున్నాయి. కేసును నీరుగార్చేందుకు ఏపీ పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత శిఖా, రాకేశ్ కలిసి పథకం ప్రకారం జయరాంను హత్యచేసినట్టు వార్తలు వచ్చాయి. తర్వాత శిఖా బయటికి వచ్చి తనకు జయరాంతో వివాహేతర సంబంధం ఉన్నదని, ఆర్థిక లావాదేవీల కారణంగానే రాకేశ్ ఈ హత్యచేశాడని చెప్పింది. కృష్ణాజిల్లా పోలీసులు హైదరాబాద్, నందిగామలో విచారించి హత్యలో శిఖాచౌదరికి సంబంధం లేదని తేల్చారు. దీంతో కథ కొత్త మలుపు తిరిగింది.

రంగంలోకి ఏపీ పెద్దలు..?

రాకేశ్‌రెడ్డికి ఏపీ తెలుగుదేశం పార్టీలోని కీలక వ్యక్తులతో మంచి సంబంధాలు ఉన్నట్టు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున రాకేశ్‌రెడ్డి చురుకైన పాత్ర పోషించాడని అందరికీ తెలుసు. ఏపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో ఈజీగా కేసు నుంచి తప్పించుకోగలననే ధీమాతోనే జయరాం మృతదేహాన్ని తెలంగాణ సరిహద్దు దాటించి ఏపీలోని నందిగామ వద్ద పడేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తగ్గట్టే గత ఐదు రోజులుగా కేసు దర్యాప్తు పేరుతో హైదరాబాద్, నందిగామలో హడావుడి సృష్టించిన ఏపీ పోలీసులు మంగళవారం ప్రెస్‌మీట్‌లో ఐదు రోజులుగా మీడియాలో వస్తున్న విషయాలనే వల్లెవేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ హత్యలో శిఖా పాత్ర లేదని, కేవలం డబ్బు కోసమే జయరాంను రాకేశ్‌రెడ్డి హత్యచేశాడంటూ సంచలన హత్యకేసును కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సింపుల్‌గా తేల్చేశారు. నిందితుడు ఇచ్చిన వాంగ్మూలాన్ని మీడియాకు చెప్పారే తప్ప.. దర్యాప్తు ఏవిధంగా సాగుతున్నది? నిందితుడిని ఏ విధంగా గుర్తించారు? ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి? వంటి విషయాలపై మీడియా ప్రతినిధులు అడిగినా సరైన సమాధానం ఇవ్వలేదు. రాకేశ్‌పై 2017లో హైదరాబాద్ జీడిమెట్లలో కేసు నమోదైంది. తన తల్లిదండ్రులు పద్మ, శ్రీనివాస్‌రెడ్డిపై దాడి చేయడంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టు విచారణలో ఉన్నది.

ఏసీపీ మల్లారెడ్డికి ఉచ్చుగా మారిన భూ వివాదం

రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్‌లో నెలకొన్న ఓ భూ వివాదంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డి, రాకేశ్‌రెడ్డి మధ్య పరిచయం ఏర్పడింది. రికార్డుల ప్రకారం గ్రామంలోని సర్వే నంబర్-74, 75, 76లో 56 ఎకరాల భూమి ఉన్నది. కానీ వాస్తవంగా అక్కడ 41 ఎకరాలు మాత్రమే ఉన్నదని, లింగారెడ్డి అనే వ్యక్తి ఆధీనంలో ఉన్నదని తేలింది. రాకేశ్‌రెడ్డి, మరికొందరు కలిసి మిగతా 15 ఎకరాలకు పాస్‌బుక్‌లు తయారుచేయించుకొని ఆ స్థలంలోకి వెళ్లారు. దీంతో లింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు 2018జూన్‌లో రాకేశ్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, శ్రీకాంత్‌పై ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయంలో ఏసీపీ మల్లారెడ్డి జోక్యం చేసుకొని రాకేశ్‌రెడ్డి, అతడి స్నేహితులకు మద్దతు ఇచ్చారని అప్పట్లో లింగారెడ్డి ఆరోపించారు. అప్పటినుంచి రాకేశ్, మల్లారెడ్డి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని సమాచారం. ఈ చనువుతోనే రాకేశ్ వ్యాపారవేత్త జయరాంను హత్యచేసిన తర్వాత ఏసీపీ మల్లారెడ్డికి ఫోన్ చేశాడు. ఈ విషయం బయటపడటంతో ఏసీపీ మల్లారెడ్డిని ఉన్నతాధికారులు బదిలీచేశారు.

ఏపీ పోలీసులపై నమ్మకంలేదు

- హైదరాబాద్ పోలీసులే దర్యాప్తు చేయాలి
- జూబ్లీహిల్స్ పోలీసులను కోరిన జయరాం భార్య పద్మశ్రీ
- శిఖాచౌదరి తన ఇంట్లో నుంచి విలువైన పత్రాలు ఎత్తుకెళ్లిందని ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న పద్మశ్రీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తన భర్త జయరాం హత్యకేసు విచారణలో ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని, హైదరాబాద్‌లో హత్య జరిగింది కాబట్టి హైదరాబాద్ పోలీసులే కేసు దర్యాప్తు చేయాలని జయరాం భార్య పద్మశ్రీ డిమాండ్‌చేశారు. ఆమె మంగళవారం రాత్రి తన తండ్రి పిచ్చయ్య చౌదరి, లాయర్‌తో కలిసి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. జయరాం చనిపోయాడని తెలిసిన తర్వాత శిఖాచౌదరి అక్కడికి వెళ్లకుండా, తన ఇంట్లోకి వచ్చి సోదాలు చేసిందని, ఎందుకలా చేసిందో తేల్చాలని ఫిర్యాదు చేశారు. అనంతరం పద్మశ్రీ మీడియాతో మాట్లాడారు. తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని చెప్పారని, అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చేవరకు అలాగే అనుకున్నాని తెలిపారు. రూ.80 లక్షల కోసం మనిషిని ఇంత కిరాతకంగా హత్యచేస్తారా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో హత్యచేసి మృతదేహాన్ని ఏపీలో పడేశారని, ముందు యాక్సిడెంట్ అన్నారని, విష ప్రయోగం అని చెప్పారని, కొట్టి చంపారని అంటున్నారని వాపోయారు. ఏది నిజమో తేల్చాలని, హైదరాబాద్ పోలీసులే కేసును దర్యాప్తు చేయాలని కోరారు. శిఖా తన ఇంట్లోకి వచ్చి విలువైన డాక్యుమెంట్లు తీసుకెళ్లిందని ఆరోపించారు. కేసును నీరుగార్చేందుకు శిఖా, రాకేశ్ ఏపీ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారా..? అన్న ప్రశ్నకు 'అయ్యి ఉండొచ్చు' అని పద్మశ్రీ సమాధానంఇచ్చారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ.. శిఖాచౌదరి తన ఇంట్లోకి వచ్చి విలువైన పత్రాలు, వస్తువులు తీసుకెళ్లిందని పద్మశ్రీ ఫిర్యాదు ఇచ్చారని, కేసును ఏపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నందున న్యాయ సలహాతో ముందుకు వెళ్తామని చెప్పారు.

పే అండ్ స్టే స్కాంలో పురోగతి

- అమెరికాలో భారతీయ విద్యార్థులకు ఏజెంట్లను కేటాయించిన అధికారులు
- ఏజెంట్లలో తొలి వ్యక్తికి విముక్తి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పే అండ్ స్టే కుంభకోణంలో భాగంగా అమెరికాలో దర్యాప్తు ఎదుర్కొంటున్న విద్యార్థులకు విముక్తి కలిగించే ప్రక్రియ మొదలైంది. ఏజెంట్లు, వివాదంలో చిక్కుకున్న విద్యార్థులను సైతం బయటకు తీసుకొచ్చే ప్రక్రియ జరుగుతున్నది. అమెరికా కాలమానం ప్రకారం.. సోమవారం మిచిగన్ ఫెడరల్ కోర్టులో తొలి వాదనలు జరిగాయి. ఏజెంట్లలో తొలి ఐదుగురిని ప్రవేశపెట్టగా అందులో ఫణీంద్ర కర్నాటికి బెయిల్ దొరికింది. ఫణీంద్ర కుటుంబసభ్యుల ఎదుటే విచారణ జరిగింది. విద్యార్థులకు ప్రభుత్వం తరఫున ఏజెంట్ల నియామక ప్రక్రియ చేపట్టారు. అరెస్టయిన 129 మంది భారత విద్యార్థుల పురోగతి గురించి కేంద్ర విదేశాంగశాఖ విజ్ఞప్తి చేయగా వారిలో 117 మందికి కాన్సులర్ అవకాశం కల్పించినట్టు అమెరికా ప్రభుత్వం పేర్కొన్నది.

విద్యార్థులకు అండగా ఆటా తెలంగాణ

విద్యార్థుల తరఫున అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ (ఆటా-తెలంగాణ) తన కార్యాచరణను మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురు విద్యార్థులకు అటార్నీలను నియమించి వారి తరఫున వాదనలు వినిపిస్తున్న ఆటా తెలంగాణ తాజాగా విద్యార్థులను కస్టడీ నుంచి విముక్తి కలిగించేందుకు నేరుగా డిటెయిన్ సెంటర్ల వద్దకు వెళ్లింది. అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ వెంకట్ మంతెన తాజాగా మిచిగన్‌లోని థియేడర్ యునైటెడ్ స్టేట్స్ కోర్ట్ హౌస్ వద్ద ఫెడరల్ క్రిమినల్ అటార్నీ ఎడ్వర్డ్ భజోకాతో సమావేశమయ్యారు. విద్యార్థుల తరఫున వాదిస్తున్న ఎడ్వర్డ్‌తో సమావేశం సందర్భంగా కస్టడీలో ఉన్న వారిని విముక్తి చేసేందుకు సత్వరం ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని వెంకట్ కోరారు. విద్యార్థులు మోసపోయారని పేర్కొంటూ వారిని అరెస్టు నుంచి విముక్తి చేయడం, తదుపరి విచారణ ఎప్పుడు ఉంటుందనేది మరో రెండు మూడు రోజుల్లో తేలనుందని ఆయన వివరించారు.

డబ్బుకోసమే జయరాం హత్య

మొదటిపేజీ తరువాయి...

తీసుకున్నారు. అయితే తన భర్త హత్య హైదరాబాద్‌లో జరిగింది కాబట్టి తెలంగాణ పోలీసులే కేసును విచారించాలని జయరాం భార్య పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదన్నారు. జయరాం చనిపోయిన తర్వాత శిఖాచౌదరి తన ఇంట్లో నుంచి విలువైన పత్రాలు తీసుకెళ్లిందని, అవి ఏమయ్యాయో తేల్చాలని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ పేరుతో చాటింగ్

రెండు తెలుగురాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన జయరాం హత్య కేసు వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం నందిగామలో వెల్లడించారు. ప్రధాన నిందితులు రాకేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఆయన కథనం ప్రకారం.. రాకేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారి. సెటిల్మెంట్లు కూడా చేసేవాడు. కుత్బుల్లాపూర్‌లోని తన టెక్రాన్ సంస్థలో సమస్యలు రావడంతో జయరాం అమెరికా నుంచి రాకేశ్‌రెడ్డికి ఫోన్‌చేశారు. వాటిని పరిష్కరించడానికి తన మేనకోడలు శిఖాచౌదరికి సహకరించాలని రాకేశ్‌ను కోరాడు. అలా జయరాంకు, శిఖాచౌదరికి రాకేశ్‌తో పరిచయం ఏర్పడింది. జయరాం కొన్నాళ్ల తర్వాత రాకేశ్‌రెడ్డి దగ్గర రూ.2.25కోట్లు, రూ.1.5కోట్లు ఇలా.. మొత్తం రూ.4కోట్లు అప్పుగా తీసుకున్నాడు. తర్వాత అమెరికాకు వెళ్లిపోయాడు. ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని పలుసార్లు కోరినా జయరాం స్పందించకపోవడం, ఫోన్ కట్ చేయడం, నంబర్ బ్లాక్ చేయడంతో రాకేశ్ కక్ష పెంచుకున్నాడు. జయరాంను హైదరాబాద్‌కు రప్పించి హత్య చేయాలని ప్లాన్ వేసుకున్నాడు. జయరాం భారత్‌కు వస్తే చెప్పాలని శిఖాను కోరాడు. జయరాం గత నెల 29న రాత్రి అమెరికా నుంచి భారత్‌కు వచ్చి శిఖా ఇంటికి వెళ్లాడు. ఆమె ఆ సమాచారాన్ని వెంటనే రాకేశ్‌కు చెప్పింది. పథకం ప్రకారం రాకేశ్ కొత్త నంబర్ నుంచి అమ్మాయి పేరుతో జయరాంతో చాటింగ్ చేశాడు. మరుసటి రోజు జూబ్లీహిల్స్‌లోని రోడ్ నంబర్-10లోని ఓ ఇంటికి పిలిపించాడు. వెంటనే అతడిని బంధించి, తన డబ్బును వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్‌చేశాడు. అతడి స్నేహితులకు ఫోన్ చేయించాడు. 31న ఉదయం వరకూ వేచి చూసినా డబ్బు రాలేదు. రాకేశ్ ఆగ్రహంతో ముఖంపై బలంగా గుద్దడంతో జయరాం సోఫాపైనుంచి కిందపడిపోయాడు. వెంటనే జయరాం ముఖాన్ని సోఫాకు అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. తర్వాత వాచ్‌మన్ శ్రీనివాస్ సాయంతో జయరాం మృతదేహాన్ని కారులో తీసుకెళ్లాడు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసులోంచి బయటపడాలని రాకేశ్ భావించాడు. జనవరి 31న రాత్రి మృతదేహాన్ని కారులో ఉంచి కృష్ణా జిల్లా నందిగామ దగ్గర వదిలేసి వెళ్లిపోయారు.

శిఖాచౌదరి పాత్ర లేదు

కేసును సవాల్‌గా తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నామని ఎస్పీ త్రిపాఠి తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలు, రాకేశ్‌రెడ్డి కాల్‌డాటా వంటి సాంకేతిక ఆధారాలు సేకరించామన్నారు. రాకేశ్‌రెడ్డి నేరాన్ని అంగీకరించాడని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆధారాల ప్రకారం ఈ హత్యలో జయరాం మేనకోడలు శిఖాచౌదరి పాత్ర ఏమీలేదని తేలిందని చెప్పారు. అయితే మృతుడి భార్య పద్మశ్రీ పలు అనుమానాలు లేవనెత్తుతూ స్టేట్‌మెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలతో పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ హత్యలో ఇంకా ఎవరెవరు ఉన్నారో ఆరా తీస్తున్నామని చెప్పారు. హత్య విషయంలో రాకేశ్‌రెడ్డి ఇద్దరు తెలంగాణ పోలీసు అధికారులతో ఫోన్‌లో సంభాషించినట్టు గుర్తించామన్నారు. హత్యకు ముందు జయారాంను దస్పల్లా హోటల్‌లో ఎవరు కలిశారు? అక్కడ ఎవరికి డబ్బు ఇచ్చాడన్నది తెలియాల్సి ఉన్నదన్నారు. హత్య హైదరాబాద్‌లో జరిగినందున కేసును తెలంగాణ పోలీసులకు బదిలీచేయడంపై న్యాయసలహా తీసుకుంటామని వివరించారు.

ఇద్దరు తెలంగాణ పోలీసులపై వేటు

జయరాంను హత్యచేసిన తర్వాత రాకేశ్‌రెడ్డి ఇద్దరు తెలంగాణ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్టు ఏపీ పోలీసులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారంతో తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డిని అంబర్‌పేట హెడ్‌క్వార్టర్స్‌కు, నల్లకుంట సీఐ శ్రీనివాస్‌ను కంట్రోల్‌రూమ్‌కు అటాచ్ చేశారు.



మంగళ వారం కృష్ణాజిల్లా నందిగామలో జయరాం హత్యకేసు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన కృష్ణా జిల్లా ఎస్పీ త్రిపాఠి

చకచకా చనాక-కొర్ట

- మే 15 నాటికి పనుల పూర్తే లక్ష్యం
- 47 శాతానికి పైగా పూర్తయిన బరాజ్
- దేశంలోనే మొదటిసారిగా పోస్ట్ టెన్షనింగ్ విధానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

చనాక-కొర్ట బరాజ్ నిర్మాణాన్ని మే 15 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే మంగళవారం ప్రాజెక్టు పనులను ప్రత్యేకంగా పరిశీలించడంతో పాటు పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రాజెక్టు అధికారులతో పాటు వర్కింగ్ ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో భాగంగా సాత్నాల నదిపై నిర్మిస్తున్న బరాజ్‌లలో దేశంలోనే మొదటిసారిగా పోస్ట్ టెన్షనింగ్ విధానాన్ని వినియోగిస్తుండటం విశేషం. ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన ఈ ప్రాజెక్టు కల త్వరలోనే సాకారం కానున్నది. చనాక-కొర్ట అంతర్రాష్ట్ర ప్రాజెక్టును సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 2016 ఆగస్టులో మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నారు. పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న ఈ బ్యారేజీ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల ప్రధాన కాల్వ నిర్మించి... ఆపై ఎనిమిది డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్, తాంసీ మండలాల్లోని పదకొండు గ్రామాలు, ఆదిలాబాద్ నియోజకవర్గంలోని జందాపూర్ గ్రామంతో పాటు జైనథ్ మండలంలోని మరో మూడు గ్రామాల పరిధిలోని 13,500.70 ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం పెనుగంగపై 342 మీటర్ల పొడవున బ్యారేజీ నిర్మాణంతో పాటు 23 గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం బ్యారేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మట్టి, కాంక్రీట్ పనులతో పాటు లైనింగ్ పనులు 47 శాతానికి పైగా పూర్తయ్యాయి. పంపుహౌస్ నిర్మాణంలో సివిల్ పనులు 41 శాతం వరకు పూర్తయ్యాయి. సుమారు 43 కిలోమీటర్ల ప్రధాన కాల్వ పనుల్లో 73 శాతం పనులు పూర్తయ్యాయి.

దేశంలోనే మొదటిసారి..

చనాక-కొర్ట బరాజ్ నుంచి ప్రధాన కాల్వ ద్వారా నీటి తరలింపు ప్రక్రియలో సాత్నాల నదిని దాటాల్సి ఉంది. ఇందుకు ఆ నదిపై వయా డక్ట్‌ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. 1.65 కిలోమీటర్ల మేర జరగాల్సిన ఈ నిర్మాణంలో భాగంగా 24 మీటర్ల పొడవున్న 67 స్పాన్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో అమర్చే గడ్డర్స్ (భారీ సిమెంటు దిమ్మెలు) తయారీలో పోస్ట్ టెన్షనింగ్ విధానాన్ని వినియోగిస్తున్నారు. గడ్డర్స్ నిర్మాణంలో వాడే స్టీల్ (ఇనుప రాడ్లు)కు ముందుగానే పోస్ట్ టెన్షనింగ్ విధానాన్ని వాడటం వల్ల సాధారణంగా వాడే స్టీల్ కంటే ఈ స్టీల్ అధిక బరువును (లోడ్)ను తట్టుకునే సామర్థ్యం ఉంటుంది.



నిర్మాణంలో ఉన్న చనాక — కొర్ట బరాజ్ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ శ్రీధర్‌దేశ్ పాండే, మాజీ మంత్రి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న (ఇన్‌సెట్)

చనాక-కొర్ట ప్రాజెక్టు పనుల తాజా పరిస్థితి

పనిరకం	బరాజ్		పంపుహౌస్		ప్రధాన కాల్వ	
	చేయాల్సింది	చేసింది	చేయాల్సింది	చేసింది	చేయాల్సింది	చేసింది
మట్టి పని (క్యూ.మీ.)	38,33,552	10,42,070	5,47,732	4,52,250	25,33,350	20,55,690
కాంక్రీట్ పని (క్యూ.మీ.)	3,11,323	1,77,247	32,045	13,674	1,50,733	1,06,803
లైనింగ్ (చ.మీ.)	88,276	18,600	–	–	3,31,349	1,31,564
నిధుల వ్యయం (రూ.కోట్లల్లో)	427.95	202.50	100.71	43.46	213.62	156.71

డిమాండ్‌లేని కోర్సుల తొలిగింపు!

25 శాతంలోపు అడ్మిషన్లు ఉన్న కోర్సులు క్లోజ్

- ముందుకొస్తున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలు
- అఫిలియేషన్లు ఇవ్వడంతో కఠినంగా ఉంటాం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 25 శాతంలోపు ప్రవేశాలు పొందిన కోర్సులను స్వయంగా తొలిగించడానికి ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు ముందుకొస్తున్నాయి. అలాంటి కోర్సుల వల్ల ఆర్థికభారం పడుతుందని ఆలస్యంగా గ్రహించాయి. బోధన సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉన్నందున డిమాండ్‌లేని కోర్సులను బలవంతంగా కొనసాగించడానికి బదులు క్లోజ్ చేయడమే మేలని భావిస్తున్నాయి. 2018-19 విద్యాసంవత్సరంలో డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం ఆఫ్ తెలంగాణ (దోస్త్) కౌన్సెలింగ్ ద్వారా భర్తీ అయిన సీట్ల వివరాల ప్రకారం రాష్ట్రంలో డిమాండ్ లేని కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. 350 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సుమారు 11 రకాల కోర్సుల్లో అసలు ప్రవేశాలు జరుగలేదు. బీఏ, బీఎస్సీ, బీకాం గ్రూపుల్లో కొన్నిరకాల కాంబినేషన్ల కోర్సుల్లో సీట్లు బాగా మిగిలాయి. బీఏ (ఎకనామిక్స్-హిస్టరీ- పొలిటికల్ సైన్స్) కాంబినేషన్‌తో రాష్ట్రవ్యాప్తంగా 29,320 సీట్లు ఉండగా.. 8,297 సీట్లు మాత్రమే నిండాయి. 21,023 సీట్లు మిగిలాయి. బీఏ (హిస్టరీ-ఎకనామిక్స్-కంప్యూటర్ సైన్స్) కాంబినేషన్‌తో 5,000 సీట్లు ఉండగా.. కేవలం 536 సీట్లు నిండాయి. 4,464 సీట్లు మిగిలాయి. బీఎస్సీ (బొటనీ-జువాలజీ-బయోలాజికల్ కెమిస్ట్రీ) కాంబినేషన్‌తో 52,936 సీట్లు ఉండగా.. 19,986 సీట్లు మాత్రమే నిండాయి. 32,950 సీట్లు మిగిలాయి. బీఎస్సీ (మ్యాథ్స్-ఫిజిక్స్-కెమిస్ట్రీ) కాంబినేషన్‌తో 27,399 సీట్లు ఉండగా 5,928 సీట్లు నిండాయి. 21,471 సీట్లు మిగిలాయి. బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో 45,912 సీట్లకుగాను 18,656 సీట్లు నిండాయి. 27,256 సీట్లు మిగిలాయి. ఈ నేపథ్యంలో డిమాండ్ మేరకే వచ్చే విద్యాసంవత్సరంలో కోర్సులవారీగా అఫిలియేషన్ ఇవ్వడానికి చర్యలు చేపట్టామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యావిధానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో కఠినంగానే ఉంటామని స్పష్టంచేశారు.

నాణ్యమైన విద్యకోసం కృషి చేస్తాం

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను మాత్రమే తమ కాలేజీల్లో ప్రవేశ పెట్టడానికి ముందుకొస్తామని, అందుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రైవేటు యాజమాన్యాలు కోరుతున్నాయి. రాష్ట్రంలో నాణ్యమైన విద్యావిధానాన్ని అందించడం, సర్కారు నిబంధనలకు అనుగుణంగా తమ కాలేజీలను బలోపేతం చేయడం కోసం తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీసీ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ

జిందగీ

బుధవారం 6 ఫిబ్రవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



ఈ బస్సుకు ఇంధనం అవసరం లేదు. జస్ట్.. ఎక్కితే చాలు.. వెళ్లిపోతుంది.

సంకేతలో..

కెమెరా లేకుండానే ట్రావెల్ ఫొటోలు తీసి.. వాటితో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాడు.

యువలో..



ముప్పైలోపే మెరిశారు

దీపం ఉండగానే
ఇల్లు చక్కబెట్టాలని నానుడి..
ముప్పై రాకముందే
కెరీర్‌లో స్థిరపడాలనేది
ఇప్పటి మాట..
విజయాలు..
కెరీర్‌లో దూసుకెళ్లేతత్వం..
వ్యాపారం.. సినిమా.. క్రీడలు.. సేవ..
ఇలా పదహారు రంగాల్లోని
ప్రతిభావంతులను ఫోర్బ్స్ గుర్తించింది..
30యేండ్లలోపు ఉన్న
30మందిని సెలెక్ట్ చేసింది..
అందులో పదిమంది మహిళలే
ఉండడం విశేషం..
వారి గురించే ఈ ప్రత్యేక కథనం..

1 

తన్వి జోహ్రి

2 

హిమదాస్

3 

మేఘన మిశ్రా

4 

స్మృతి మంధన

5 

టీనా సూత్రధార్, నికితా సూత్రధార్

7 

కనికా గోయల్

8 

రీతూ మల్హోత్ర

9 

కరీన బజాజ్

10 

అతిథి అగర్వాల్, అంజలీ మీనన్

1 పరిశుభ్రతే పరమావధిగా!

పేరు : తన్వి జోహ్రి
వయసు : 27
రంగం : కార్మేసి సీఈఓ

ఉత్తరప్రదేశ్‌లోని మధురకి చెందిన తన్వి జోహ్రి, తను ఎదుర్కొన్న సమస్యలు ఇతరులు పడకూడదనే ఉద్దేశంతో 2017 జనవరిన 'ఎలిజె' సింథటిక్ సానిటరీ ప్యాడ్స్‌ని విడుదల చేసింది. అవే ఆమెను ఫోర్బ్స్ 30 అండర్ 30లో ఒకరిగా నిలబెట్టాయి. తన్వి తయారు చేసిన ప్యాడ్స్ మామూలు ప్యాడ్స్ కంటే 2.5 రెట్లు మన్నికైనవి. అందుకే వీటిని సుమారు 70,000 కస్టమర్లు వీటినే వినియోగిస్తున్నారు. తన్వి జోహ్రి ఢిల్లీలోని హిందూ కాలేజీలో కెమిస్ట్రీ హానర్స్ గ్రాడ్యుయేట్ చేసింది. కొన్ని రోజుల నుంచి తను సానిటరీ ప్యాడ్స్ కారణంగా వ్యక్తిగత సమస్యలకు గురవుతుండేది. 2015 నుంచి 2016 లోపు ప్లాస్టిక్‌తో చేసిన సానిటరీ ప్యాడ్స్ మీద పరిశోధన చేసింది. అనంతరం తానే స్వయంగా సౌకర్యవంతమైన ప్యాడ్స్‌ని అందుబాటులోకి తెచ్చింది.

2 భారతదేశపు బంగారు కొండ!

పేరు : హిమదాస్
వయసు : 19
రంగం : క్రీడలు

అస్సోంలోని నాగయోస్ జిల్లాకు చెందిన హిమదాస్ అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 400 మీటర్ల పరుగు పందెం పోటీలో స్వర్ణ పతకాన్ని సాధించింది. అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారత మహిళగా ఆమె చరిత్ర సృష్టించింది. హిమదాస్ తండ్రి సాధారణ రైతు. అయినప్పటికీ చిన్నప్పటి నుంచి క్రీడలపై ఉన్న అసక్తితో కష్టపడి అంచెలంచెలుగా ఎదిగింది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడంతో డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్‌కు చెందిన కోచ్ నిపోన్‌దాస్ గుర్తించి శిక్షణ ఇచ్చారు. 2018 మార్చిలో కామన్వెల్త్‌లో పాల్గొని 400 మీటర్ల లక్ష్యాన్ని 51.32 సెకన్లలో చేరుకొని ఆరో స్థానంలో నిలిచింది. తర్వాత జూలైలో జరిగిన అంతర్జాతీయ చాంపియన్ షిప్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించింది.

3 పాటే.. ప్రాణం!

పేరు : మేఘన మిశ్రా
వయసు : 18
వృత్తి : సింగర్

స్కూల్‌లో జరిగిన పాటల కాంపిటేషన్‌కి ఒక బెంగాలీ మ్యూజిక్ డైరెక్టర్ వచ్చాడు. ఆయన మేఘన గొంతు విని 'విట్టి దండు' అనే సినిమాలో పాడే అవకాశం ఇచ్చాడు. ఆ తర్వాత సీక్రెట్ సూపర్‌స్టార్ సినిమాలో జైరా వాసీమ్ పాడే పాటకు 28మందికి పైగా ఆడిషన్ చేశారు. చివరగా మేఘన గొంతు విని అవకాశాన్ని ఇచ్చారు. ఈ అమ్మాయి పాటకు ఫిల్మ్‌ఫేర్, జీ సినీ, మిర్చీ మ్యూజిక్, ఐఫా అవార్డులు లభించాయి. అంతేకాదు.. ఆమిర్‌ఖాన్ ప్రశంసలు కూడా దక్కాయి. తండ్రి గాయకుడు, తల్లి తబలా ఆర్టిస్ట్, డ్యాన్సర్. తండ్రి సింగర్. అందుకే తండ్రి దగ్గరే శిష్యరికం చేసి పాటలు నేర్చుకుంది. 'మేఘన మిశ్ర' పేరుతో యూట్యూబ్ చానెల్ కూడా నడుపుతున్నది. పలు స్టేజ్ షోలు కూడా ఇస్తూ బిజీబిజీగా ఉంటున్నది.

4 మంధన.. మాణిక్యం!

పేరు: స్మృతి మంధన
వయసు : 22
రంగం : క్రీడలు

ముంబైకి చెందిన స్మృతి మంధన భారతదేశ మహిళా క్రికెట్ జట్టులో ఓపెనర్. 2018 ఉత్తమ మహిళా క్రికెటర్‌గా ఐసీసీ ప్రకటించింది. ఉత్తమ వన్డే ప్లేయర్‌గానూ నిలిచిన మంధన క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందుకున్న రెండో భారత మహిళగా రికార్డు నెలకొల్పింది. గతంలో వెస్టిండీస్‌లో జరిగిన టీ20 ప్రపంచ కప్ పోటీలో తన పర్ఫామెన్స్‌తో అదరగొట్టింది. ఆమె సోదరుడు కూడా క్రికెటరే. అండర్ -16లో పాల్గొని సెంచరీ సాధించినప్పుడు ఆ స్టేడియంలో కూడా ఉంది. ఆ కరతాళ ధ్వనులే ఆమెను క్రికెట్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టేలా చేశాయి. వన్డే గేమ్‌లో డబుల్ సెంచరీ చేసిన మొదటి భారతీయ మహిళ స్మృతి కావడం విశేషం. ఇప్పటివరకు వరల్డ్ టీ20ల్లో వెయ్యి రన్నులు చేసిన మూడవ ఇండియన్ ప్లేయర్‌గా ఈమె రికార్డు ఉంది.

5 తండ్రిని చూసి..

పేరు : టీనా సూత్రధార్, నికితా సూత్రధార్
వయసు : 29, 27
వృత్తి : మియునికు వ్యవస్థాపకురాళ్లు

ముంబైకి చెందిన టీనా, నికితా అక్కాచెల్లెళ్లు. తండ్రి మ్యూజీషియన్. తరచూ యూఎస్, యూకే టూర్లు వెళ్తుంటాడు. వృత్తికి తగ్గట్టుగా వస్త్రధారణ ఉండేది. దాని ప్రభావమే మామీద పడిందని టీనా, నికిత చెబుతున్నారు. 2010 సెప్టెంబర్‌లో లండన్ కాలేజ్ ఆఫ్ ఫాషన్‌లో బీఏ కోర్స్‌లో చేరారు. అక్కడే బట్టలు ఎలా కత్తిరించాలి. ఎలాంటి వాటికి ఎటువంటివి నప్పుతాయో అధ్యయనం చేశారు. అక్కడి భాష, అందరితో మాట్లాడే విధానం నేర్చుకున్నారు. అక్కడ జరిగే అన్ని పోటీల్లో పాల్గొనేవారు. 2014లో జరిగిన ఎల్‌వీఎమ్‌హెచ్ పోటీకి ఆన్‌లైన్‌లోఅప్లై చేశారు. 30 సెమీ ఫైనలిస్ట్స్‌ల్లో వారు కూడా ఎంపికయ్యారు. మొదటి రౌండ్ పారిస్‌లో జరిగింది. అక్కడ కొంతమంది నిపుణుల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. తదనంతరం ఎల్‌వీఎంహెచ్ స్పెషల్ జూరీలో వీరే విజేతలుగా నిలిచారు. అక్కడి నుంచే మియునికుని స్థాపించినట్లు చెబుతున్నారీ అక్కాచెల్లెళ్లు. 'మా కుటుంబంలో ఈ వృత్తికి సంబంధించిన వారు ఎవరూ లేరు. మేము ఇందులో విజయం సాధించినందుకు ఆనందంగా ఉంద'ని టీనా, నికితా చెప్పుకొచ్చారు.

6 డిజిటల్ దివా!



పేరు : ప్రజక్తా కోలీ
వయసు : 25
రంగం : యూట్యూబర్

గతేడాది నవంబర్‌లో.. న్యూయార్క్ సిటీలో -3 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల వద్ద ఆకుపచ్చని చీర కట్టుకొని యునైటెడ్ నేషన్స్ హెడ్‌క్వార్టర్‌లోకి అడుగు పెట్టింది. అన్ని దేశాల జెండాల రెపరెపలు వినిపిస్తున్నాయి. మువ్వన్నెల జెండా చూసి ఆ రోజు చాలా మురిసిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా 50 డిజిటల్ క్రియేటర్స్‌కి అక్కడికి ఆహ్వానం అందింది. అందులో ప్రజక్తా కోలీ ఒకరు. బ్యాచిలర్ ఆఫ్ మాస్ మీడియా పూర్తి చేసిన ఈ థానే వాసి MostlySane అనే యూట్యూబ్ చానెల్‌ని నడుపుతున్నది. ఇందులో అప్పుడప్పుడు ఆయుష్మాన్ ఖురానా, కాజోల్, నవాజుద్దీన్ సిద్దిఖీ, సింగర్-కంపోజర్ బాద్‌షా కూడా కనిపిస్తుంటారు. ఆరవ తరగతి నుంచే రేడియో జాకీగా, ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా పనిచేసింది. 101, ఫీవర్ 104 ఎఫ్ఎమ్ రేడియో స్టేషన్లలో పనిచేస్తున్నప్పుడు యూట్యూబ్ పెట్టే ఆలోచన వచ్చింది. మొదటిసారి వాలెంటైన్స్ డేకి ముందు 12 ఫిబ్రవరి 2015రోజున 'టైప్స్ ఆఫ్ సింగిల్స్' పేరుతో వీడియో పోస్ట్ చేసింది. ప్రతీరోజూ ఇతరులను గమనించి అందులో నుంచే వీడియోలను చేసి పోస్ట్ చేస్తుంది. ఈమె చానెల్‌కి 3.2 మిలియన్‌లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈమెకు 2017లో వైరల్ క్వీన్, ఐడబ్ల్యూమ్ డిజిటల్ అవార్డులు లభించారు. బాడీ షేమింగ్ మీద కోలీ చిన్నపాటి ఉద్యమమే చేసింది. 'షేమ్‌లెస్' పేరుతో ఒక ర్యాప్ సాంగ్ కూడా పాడింది. 2018 నుంచి 'ఇండియన్ యూట్యూబ్ గ్లోబల్ ఇన్షియేటివ్'కి అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నది.

7 ఛేదించింది.. గెలిచింది!

పేరు : కనికా గోయల్
వయసు : 29
రంగం : ఫ్యాషన్

కనికాది సంప్రదాయ ఉమ్మడి కుటుంబం . అక్కడ కట్టుబాట్లు కూడా ఎక్కువే. వాటిని ఛేదించి ధైర్యంగా ముందడుగు వేసింది. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో యాక్సెసెరీస్ డిజైనింగ్‌లో పట్టా పొందింది. కానీ ఆ తర్వాత గార్మెంట్ రంగంలోకి దిగింది. 2014లో తన పేరుతో లేబుల్ లాంచ్ చేసింది. మొదటి నుంచే బాలీవుడ్‌లోని ఎ-లిస్ట్ సెలెబ్రిటీలు ఈమె వద్దే బట్టలు కొనడం ప్రారంభించారు. ఎక్కువగా దీపికా పదుకొనే, అలియ భట్, అనుష్క శర్మలు కనికా గోయల్ వేర్‌ని ఎక్కువగా తీసుకుంటారు. దేశం మొత్తం మీద 12 స్టోర్స్, యూఏఈలో మూడు స్టోర్‌లు నెలకొల్పింది కనిక. మెన్స్‌వేర్, ఉమెన్స్ వేర్ అన్నిట్లోనూ తనదైన మార్క్ వేస్తూ ఫోర్బ్స్ 30 అండర్ 30 లిస్ట్‌లో స్థానం సంపాదించింది.

8 సేవే లక్ష్యం!

పేరు : రీతూ మల్హోత్ర
వయసు : 22
రంగం : సేవ

ఈజీస్ప్రిట్ అనే ఎన్జీఓ సంస్థను స్థాపించి ఎకో ఫ్రెండ్లీ ఆవిష్కరణలు చేస్తున్నది రీ. ముఖ్యంగా ఆస్పత్రుల్లో ఉపయోగపడే ఉమ్మి తొట్టీలను ఆవిష్కరించారు. వీటితో పాటు ఎకోఫ్రెండ్లీ డిస్పోసెబుల్ బ్యాగులను తయారు చేసి గుర్తింపు పొందారు. 2023 కల్లా టీబీ, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధుల వ్యాప్తిని తగ్గించడం తమ లక్ష్యమని చెపుతున్నారు. ఈజీ లిక్విడ్ బిన్ పేరుతో చిన్న టెట్రా ప్యాకులను తయారు చేసి దాన్ని లిక్విడీ డిస్పోజల్‌ని హైబ్రీడ్ ఫెర్టిలైజర్ తయారయ్యే విధంగా కొత్త ఆవిష్కరణ చేశారు. తన సోదరుడితో కలిసి 'ఈజీస్ప్రిట్' పేరుతో ఒక వెబ్‌సైట్‌ని కూడా ప్రారంభించింది. దీంట్లో ఆ టెట్రా ప్యాకులు అమ్ముతున్నారు. పర్యావరణ సంరక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరికీ అవగాహన కల్పిస్తున్నారు.

9 సౌకర్యమైన ఆహారం..

పేరు : కరీన బజాజ్
వయసు : 25
వృత్తి: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కేఏ హాస్పిటాలిటీ

కరీనా బజాజ్ వంట చాలా బాగా చేస్తుంది. అది కూడా ఫ్రైడ్‌రైస్, థాయ్ ఆమ్లెట్ చేయడంలో దిట్ట. ఆకలితో ఉన్నవారు రకరకాల వంటలను రుచి చూసి తెలుసుకోవాలంటున్నది. సౌకర్యవంతమైన ఆహారం ఏంటని కరీనాని అడిగితే 'సింధి కర్రీ, రైస్, క్రిస్పీ అలో టుక్' అనే చెబుతుంది. కరీనా తాతయ్య జపాన్‌లో ఆరోగ్యాన్నిచ్చే వంటలనే ప్యాషన్‌గా ఎంచుకున్నాడు. దానికి అమ్మమ్మ కూడా సాయపడింది. జపాన్‌లో చేసిన ఆమ్లెట్, ఇతర వంటలు ఇండియాకి పరిచయం చేశాడు. ఈ విధంగా కరీనా కూడా వంట నేర్చుకున్నది. కరీనా స్విట్జర్లాండ్‌లోని ఐగ్లోన్ కళాశాలలో చదువుకున్నది. బోస్టన్ ఎమెర్సన్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది.

10 డిజైన్లు అదుర్స్

పేరు : అతిథి అగర్వాల్, అంజలీ మీనన్..
వయసు : 29, 28
వృత్తి : డిజైనింగ్

గుడ్‌గుడీ అనే సంస్థ ద్వారా వీళ్లు అనూహ్యంగా గుర్తింపు పొందారు. ఇన్‌డోర్, అవుట్‌డోర్ ఆటస్థలాలను సృష్టిస్తున్నారు. ఇద్దరూ అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌కు చెందిన విద్యార్థులు. దేశంలోని బహిరంగ ప్రదేశాలను ఆటస్థలాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఎన్ఐడీలో డిజైనింగ్ పూర్తి చేసిన తర్వాత అతిథి అగర్వాల్ యంగ్ ఇండియా ఫెలోకి హాజరయ్యారు. అక్కడ ఆమె ఫోర్డ్ ఫౌండేషన్ గ్రాంట్, పార్క్ ఎలెడెకర్ అవార్డు అందుకున్నారు. దీంతోపాటు చైనా, టర్కీ, నేపాల్‌లో ఏటా జరిగే వరల్డ్ వుడ్ డే కార్యక్రమాల్లో అతిథి చురుగ్గా పాల్గొంటారు. అంజలీ కూడా ఫర్నీచర్ డిజైనింగ్‌లో చక్కటి ప్రతిభ కలిగి ఉంది.

దివ్యౌషధం కొబ్బరి నీళ్లు



ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుత పానీయం కొబ్బరినీళ్లు. ఇందులో కొవ్వు ఉండదు. కృత్రిమమైన సంరక్షకులు, రసాయనాలు ఉండవు. అందుకే ఇవి మనిషికి దివ్యౌషధంగా ఉపయోగపడుతాయి.

కొబ్బరినీళ్లలో మనకు అవసరమైన అన్ని రకాల ఖనిజాలున్నాయి. ఔషధ విలువలు ఎంతో మెండు. కొబ్బరి బోండం లోపల స్వచ్ఛమైన రంగులో మెరిసే కొబ్బరి నీళ్ళలో ఫైటో కెమికల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, మామూలు చక్కెరలు ప్రత్యేక రీతిలో కలిగి ఉన్నాయి. కొబ్బరినీళ్ళు శారీరక శ్రమ చేయడం వల్ల, చెమటద్వారా మన శరీరం నుంచి బయటకెళ్లిన ద్రవాలను, ఖనిజాలను మనలో నింపుతుంది. డీహైడ్రేషన్ వల్ల మన శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి అందించడంలో కొబ్బరినీళ్లు ఎంతో సహాయం చేస్తాయి. కొబ్బరినీళ్ళు జీవన క్రియలు సరిగా జరగడానికి, తిన్న ఆహారం జీర్ణం కావడానికి సహాయం చేస్తాయి. కొబ్బరినీళ్ళలో ఉన్న బయోయాక్టివ్ ఎంజైము మన జీవనక్రియలను వేగవంతం చేస్తుంది. అరుగుదల శక్తిని మెరుగుపరుస్తుంది. కండరాలు తిమ్మిరెక్కడం, మొద్దుబారడం, అలాగే కండరాలు సాగడం లాంటి ఇబ్బందుల నుంచి కొబ్బరినీళ్ళు మనకు ఉపశమనాన్నిస్తాయి. మనశరీరానికి బాగా అవసరమైన చాలా ముఖ్యమైన ఎలక్ట్రోలైట్, ఖనిజం పొటాషియం. కొబ్బరినీళ్ళను తాగడం వల్ల మన శరీరంలో పొటాషియం తిరిగి భర్తీ అవుతుంది. దాంతో తిమ్మిరి ఎక్కడం, మొద్దుబారడం తగ్గుతాయి. కొబ్బరినీళ్ళు తాగడం వల్ల మన శరీరంలోని జీవనక్రియలు వేగవంతం అవుతాయి.

చేరదీశారు అంతే.. చాంపియన్ అయింది!



'షల్లు' ఐదేండ్ల పాప.. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉదయం 5 గంటలకు ఒంటరిగా కూర్చుని ఏడుస్తున్నది. అటుగా వెళ్తున్న ఓ మహిళ చూసి ఆరా తీసింది. కానీ ఫలితం లేదు. చేరదీసింది. ఆ ఆయిదేండ్ల పాపకు ఇప్పుడు 23 ఏండ్లు.. పవర్‌లిఫ్టింగ్ చాంపియన్. స్పెషల్ ఒలింపిక్స్‌లో భారతదేశం నుంచి బరిలోకి దిగనుంది.

తల్లిదండ్రులు విడిచిపెట్టారో తెలియదు. ఆమె తప్పిపోయిందో తెలియదు. కానీ ఆమెను ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన పద్మిని అనే మహిళ చేరదీసింది. షల్లు అమ్మానాన్న ఎవరో తెలియదు. ఎక్కడి నుంచి వచ్చిందో అంతకన్నా తెలియదు. పోలీసులకు సమాచారం అందించినా ఫలితం లేకుండా పోయింది.దీంతో షల్లునీ తమ ఇంటికి తీసుకెళ్లింది. నిజానికి పద్మిని భర్త ఉద్యోగం రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. అయినా షల్లుని వెంటే ఉంచుకుంది. మెల్లిగా తనను అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. ఎదిగే కొద్ది ఆమె శక్తి సామర్థ్యాలను అంచనా వేసింది. దీంతో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇప్పించింది. షల్లుకి 12 ఏండ్ల వయస్సులో తీవ్ర ఒత్తిడికి గురయ్యేది. పవర్ లిఫ్టింగ్ మీద ఆసక్తి కోల్పోయింది. దానికి బదులు ఫుట్‌బాల్ ఆట నేర్చుకుంది. ఒక మ్యాచ్ ఆడుతున్నప్పుడు విఫలయయింది. ఈ ఘటన షల్లు ఆలోచనను మలుపు తిప్పింది. పవర్‌లిఫ్టింగ్‌లో తన పనితనాన్ని చూపించాలనుకుంది. సుదీర్ఘ కృషి తర్వాత షల్లు మెరుగైన ఫలితాలను సాధించింది. ఇప్పుడు అబుదాబీలో జరిగే స్పెషల్ ఒలింపిక్స్‌లో షల్లు పవర్‌లిఫ్టింగ్‌లో పాల్గొంటోంది. సుమారు 190 దేశాలు 24 రకాల క్రీడల్లో పాల్గొంటాయి.దాదాపు 7000 మంది క్రీడాకారులు పాల్గొనే ఈ స్పెషల్ ఒలింపిక్స్‌లో షల్లు పాల్గొని గోల్డ్ మెడల్ సాధిస్తుందని పద్మిని చెబుతున్నది.

పులిపిర్లతో బాధపడుతున్నారా?



చూడచక్కని ముఖారవిందం. చేతులపై ఎక్కడ పడితే అక్కడ పులిపిర్లు ఉన్నాయా? అందరిముందూ చేతులు చాచాలంటే ఇబ్బంది పడుతున్నారా? ఈ చిట్కాలు పాటించండి.

- ఉల్లిపాయను సగానికి కట్ చేసుకోవాలి. మధ్యభాగాన్ని స్పూన్‌తో తొలిగించి అందులో కొద్దిగా ఉప్పు నింపాలి. కాసేపటి వరకు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని పులిపిరులున్న ప్రదేశంలో రాసుకుంటే ఫలితం ఉంటుంది.
- ఆముదం తీసుకొని పులిపిరి మీద రాసి స్టిక్కింగ్ టేప్ అతికించాలి. ఐదు గంటల తర్వాత టేప్‌ను తీసేయ్యాలి.రోజుకి రెండుసార్లు ఇలా చేస్తే పులిపిర్లు తొలిగిపోతాయి.
- వెల్లుల్లిని సగానికి కట్ చేయాలి. దీన్ని పులిపిర్ల మీద రుద్దాలి. 30 నిమిషాల తర్వాత నీటితో కడుగాలి. వారం రోజుల పాటు ఈ పద్ధతిని పాటించాలి. ఇలా చేస్తే పులిపిర్లు మాయమవుతాయి.
- అంజుర జ్యూస్‌ని పులిపిర్ల మీద రాయాలి. జ్యూస్ ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. క్రమం తప్పకుండా ఈ పద్ధతి పాటిస్తే పులిపిర్లు మాయమవుతాయి.
- అరటి పండు తొక్క తీసుకొని పులిపిర్ల మీద రుద్దాలి. కొంత సమయం తర్వాత చల్లని నీటితో కడుగాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే ఉన్నవి తొలిగి కొత్తవి రాకుండా ఉంటాయి.

నమస్తే తెలంగాణ
యువ
[కరీంనగర్]
బుధవారం 6 ఫిబ్రవరి 2019

ఏక్‌దమ్ ఎరీ సిల్క్!

ఫ్యాషన్ ట్రెండ్స్ ఎప్పుడూ ఒకేలా ఉండవు. రకరకాల ట్రెండ్స్ వచ్చి ఎప్పటికప్పుడు కొత్త సోయగాలను తీసుకొస్తాయి. ఇప్పుడు అలాంటి ట్రెండ్ ఒకటి వచ్చింది అదే. ఎరీ సిల్క్.



రాబోయే సీజన్ సమ్మర్. ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? అవి ఎంత ఫ్యాషనేబుల్‌గా ఉండాలి? అనే విషయాలు డిజైనర్ల ఆలోచనల్ని మార్చేస్తుంటాయి. ఇప్పుడు ఎరీ సిల్క్ టైమ్ వచ్చేసింది. ఇది లేకుండా అస్సలు ఫ్యాషన్‌ను ఊహించలేం అంటున్నారు డిజైనర్లు. లాక్మే ఫ్యాషన్ వీక్ దీనికి వేదికగా మారింది. హైదరాబాద్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ జ్యోతిరెడ్డి ఈ ఎరీ సిల్క్‌ను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేశారు. ఎరీనా బ్రాండ్ పేరిట వస్తున్న డ్రెస్సులు ఇటు వింటర్‌లోనూ.. అటు సమ్మర్‌లోనూ వేసుకోవచ్చని ఎరీ సిల్క్ ప్రదర్శన సందర్భంగా జ్యోతి తెలిపారు. ఎరీ సిల్క్ ఏక్‌దమ్ ఫిట్ ఉంటుందనీ.. రాబోయేదంతా ఎరీ స్కిల్ ట్రెండేనని పలువురు ఫ్యాషన్ డిజైనర్లు పేర్కొన్నారు.

యువ సైన్యం కోసం..

సోదరభావాన్ని పెంపొందించడంతోపాటు దేశ శ్రేయస్సుకు పాటుపడే అవకాశం కల్పించేది రక్షణ రంగం మాత్రమే. అలాంటి రక్షణ రంగం వైపు ఎక్కువ మంది యువతను మేల్కొల్పి దేశ రక్షణలో భాగస్వాములను చేస్తున్నాడు ఓ ఆర్మీ అధికారి. అందుకోసం ప్రతి పాఠశాల,కళాశాలలకు వెళ్లి మరింత మంది భారత సైనికులుగా మార్చేందుకు కృషి చేస్తున్నాడు.



ఉత్తర ప్రదేశ్‌లోని ఖతులికి చెందిన కల్నల్ సందీప్ అహ్లావత్ ఆర్మీ అధికారిగా పనిచేస్తున్నాడు. భవిష్యత్ తరాలకు భారత సైనికుల త్యాగాలను గురించి తెలియజేస్తూ రక్షణ శాఖ ఔన్నత్యాన్ని వివరిస్తున్నాడు. 1947కు పూర్వం దేశ నాయకులు, సైనికులు ఏ విధంగా భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారనే అంశాలను మరోసారి ఆయా విద్యార్థులతో పంచుకుంటున్నాడు. యువకులను దేశ సేవలో భాగస్వాములను చేసేందుకు పాఠశాలలు, కళాశాలలే కాదు ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ రక్షణ దళం పోషిస్తున్న పాత్రను గురించి పాఠాలు చెబుతున్నాడు. అందులో భాగంగానే సందీప్ ఇప్పటి దాకా 30కి పైగా విద్యా సంస్థలను చుట్టి వచ్చాడు. ఐఐటీ ఢిల్లీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంటి విద్యా సంస్థలకు చెందిన 30వేల మంది విద్యార్థులను దేశ సేవ చేసేందుకు ప్రేరేపించాడు. విద్యార్థులకే కాకుండా నిరక్షరాస్యులకు సైతం దేశ రక్షణలో సైనికుల పాత్రను గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఎక్కువ మంది యువతను సైనికులుగా తీర్చిదిద్ది దేశ సమగ్రతను కాపాడుతున్నాడు.

నవ యవ్వనమే!

కొందరి వయసు తక్కువగా ఉంటుంది. కానీ చూడటానికి పెద్ద వారిలా కనిపిస్తారు. ఎందుకు?



కారణాలు ఏమైనప్పటికీ వ్యాయామం లోపించడం వల్లే అలా జరుగుతుంది అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా 10–20 సంవత్సరాల వయసున్న వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిందేనట. వ్యాయామం వల్ల ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు.. మానసిక దృఢత్వం ఏర్పడుతుందట. న్యూయార్క్ కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు ఈ అంశంపై అధ్యయనం చేశారు. వ్యాయామం చేసినట్లయితే యవ్వనంగా కనిపించొచ్చు అంటున్నారు నిపుణులు. కాబట్టి యువత క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు.



పైసా లేకుండా..
జ్ఞాన సంచారం!

ప్రస్తుత విజ్ఞాన స్రవంతిలో సెల్‌ఫోన్‌లేనిదే పూట గడవదు. సహచర స్నేహితుల్లేనిదే కాలు కదలదు. ప్రణాళిక లేనిదే పక్కూరికి కూడా వెళ్లలేరు. కమ్యునికేషన్ లేనిదే కంటికి నిద్ర కూడా పట్టదు. ఇవేవీ లేకుండా కట్టుబట్టలతో భారతయాత్ర పూర్తిచేశాడో యువకుడు! కెమెరా లేకుండానే ట్రావెల్ ఫొటోలు తీసి.. వాటితో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న సందర్భంగా ఈ కథనం.

అతడి పేరు: అభితేజ్ బోడ

వయస్సు: **22** సంవత్సరాలు

యాత్రా కాలం: **522** రోజులు

ఎన్ని రాష్ట్రాలు: **28**

కేంద్ర పాలిత ప్రాంతాలు : **5**

ఎన్నివైపులు? : దేశం నాలుగు దిక్కులా

ప్రారంభం: ఢిల్లీ

ముగింపు ఎక్కడ: హైదరాబాద్



ఇయ్యాలరేపు హైదరాబాద్ శివార్లకు వెళ్లాలంటేనే ఒక ప్రణాళిక ఉండాలి. ముందుగా చేతిలో సరిపడా డబ్బుండాలి. మరీ ముఖ్యంగా సమాచారం కోసం సెల్‌ఫోన్ ఉండాలి. బస చేయడానికి వసతి ఉండాలి. ఇవేనా? ఏం తినాలి? ఎక్కడ తినాలి? ఏం కొనాలి? ఎక్కడ కొనాలి? ఎవరిని కలవాలి? అట్నుంచి ఇంకెక్కడికి వెళ్లాలి? వంటివి చాలా ఉంటాయి. కానీ ఇవేవీ అవసరం లేదు అంటున్నాడు హైదరాబాద్ యువకుడు. నయా పైసా చేతిలో లేకుండా కట్టుబట్టలు చేతిలో పట్టుకొని యాత్ర ప్రారంభించి భారతదేశం మొత్తం చుట్టేశాడు.

యాత్ర నేపథ్యం

అభితేజ్ హైదరాబాదీ. మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఎఫ్ఏలో ఫొటోగ్రఫీ స్పెషలైజేషన్ డిగ్రీ చేశాడు. సర్టిఫికేట్ చేతిలోకి వచ్చింది. దాంతో ఏ కంపెనీలో చేరినా నెలకు రూ. 30 వేలకు పైనే జీతం వస్తుంది. హాయిగా ఉండొచ్చు. కానీ అతడికి అలా చేయడం ఇష్టం లేదు. జీవితం ఎక్కడ మొదలయ్యిందో అక్కడే ముగిస్తే ప్రయోజనం ఏంటి? అనుకున్నాడు. దేశ సంచారం చేస్తానని పేరెంట్స్‌తో చెప్పాడు. వాళ్లు చీవాట్లు పెట్టారు. తమాషా చేస్తున్నావా? అని కొట్టినంత పని చేశారు. 'మీకు ఇష్టం లేకపోయినా.. మీ నుంచి అనుమతి రాకపోయినా.. నేను మాత్రం ఇండియా మొత్తం తిరగాలనుకుంటున్నాను. నాకు ఒక్క పైసా కూడా వద్దు. చేతిలో డబ్బులు.. ఫోన్ లేకుండా.. ఎలాంటి ప్లాన్ లేకుండా ఈ యాత్ర పూర్తిచేసి రెట్టింపు ఆనందోత్సాహలతో తిరిగి వస్తా' అని పేరెంట్స్‌కు చెప్పి వెళ్లాడు.

మిషన్ క్యాష్‌లెస్ ట్రావెల్

డబ్బుల్లేకుండా హైదరాబాద్‌కు చేరుకున్న గుజరాతీ యువకుడు అనే వార్త అభితేజ్‌ను మరింత ఆలోచింపజేసింది. అదేదో బాగుందే అనుకున్నాడు. తాను ఏదో ఒక్క రాష్ట్రంలో కాకుండా దేశమంతా చుట్టేయాలని #MissionCashlesstravel క్యాంపెయిన్‌ను ప్రారంభించాడు. ట్రావెలింగ్‌కు ప్రధాన వనరులైన డబ్బు, వాహనం, కెమెరా, స్మార్ట్‌ఫోన్, తోడు వంటివి లేకుండా సరికొత్త రికార్డు సృష్టించొచ్చు అనేది ఈ క్యాంపెయిన్ ఉద్దేశం. దీంట్లో భాగంగా తన యాత్రను దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభించాలి అనుకున్నాడు. తాను చేసే పని యువతకు సందేశంగా.. ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చాడు.

ఢిల్లీలో తొలి అడుగు

స్నేహితుల సహకారంతో హైదరాబాద్ నుంచి ఢిల్లీ చేరుకున్నాడు అభితేజ్. 22 మార్చి 2017న చేతిలో రెండు లగేజీ బ్యాగ్‌లు.. జాతీయ జెండా పట్టుకొని జీటీబీ నగర్ చౌరస్తాలో నిల్చున్నాడు. ఎదురైన ప్రతీవారిని లిఫ్ట్ అడిగినా కొందరు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఓ టూవీలర్ అతను.. అభితేజ్ చేతిలో జాతీయ జెండా చూసి ఆశ్చర్యపోయి ఆపాడు. 'ఏంటీ.. ఈ చేతిలో బ్యాగులు.. ఆ చేతిలో జాతీయజెండా.. పైగా లిఫ్ట్ అడుగుతున్నావ్? ఎవరు నువ్వు?' అని అడిగితే.. తన గురించి వివరించాడట అభి. అలా మొదటి లిఫ్ట్ దొరికింది. అతడు ఎర్రకోట వరకు చేరవేశాడు. అక్కడ దిగిన అభి.. ఎర్రకోటను సందర్శించాడు. అక్కడ కొత్తవాళ్లను పరిచయం చేసుకొని ఫొటోలు తీసుకున్నాడు. పెన్‌డ్రైవ్ కొనుక్కొని ఫొటోలు దాంట్లో వేసుకున్నాడు.

హిమాచల్ పయనం

ఢిల్లీని చుట్టేసి మళ్లీ రోడ్డుపైకి వచ్చేశాడు. మళ్లా అదే సీన్. రోడ్డుపై ఎంతోమందిని లిఫ్ట్ అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. చాలాసేపటికి ఒక కారు ఆగింది. 'ఎక్కడికి వెళ్లాలి?' అని అడిగాడు కారులో ఉన్న వ్యక్తి. మనోడికి ఏమీ తోచలేదు. 'మీరెక్కడిదాకా వెళ్తారు?' అని ప్రశ్నించాడు అభి. ఆయన కాసేపు ఆశ్చర్యంగా చూశాడు. కారు ఎందుకు ఆపాన్రా బాబూ అనే ఎక్స్‌ప్రెషన్స్ ముఖంలో కనిపించాయి. అయినా అభి ఫీల్ కాలేదు. మొత్తానికి అతడిని కన్విన్స్ చేయగలిగాడు. 'హిమాచల్ వెళ్తున్నా' అని అతడు చెప్పడంతో ఓకే అని కార్ ఎక్కాడు అభితేజ్.

ఎగ్జిబిషన్ పెడతా: అభితేజ్



నాకు అంతా తెలుసు అనుకుంటే నాకు ఇవన్నీ ఏవీ తెలియకపోయేవి. ఏం చేయాలో ఎలా చేయాలో తెలియకున్నా ఇంట్లో నుంచి అడుగు బయటకు వేశా. పైసల్లేకుండా బతకొచ్చు.. ఫోన్లు లేకుండా మనిషి మనుగడ సాధించొచ్చు అనేది నేర్చుకున్నా. కెమెరా లేకున్నా ఎన్నో అద్భుతమైన ఫొటోలు తీశాను. ఎవ్వరు ఏది పెట్టినా తిన్నాను. నా అనుభవాలకు రూపాలైన ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నా. దేశవ్యాప్తంగా తిరిగి నేనెంతో సర్‌ప్రైజ్ అయ్యా. ఆ సర్‌ప్రైజ్‌ను త్వరలో తెలంగాణ ప్రజలకు చూపిస్తా.

హిమాలయా రేంజ్ ఆఫ్ ఇండియా

హిమాచల్ ప్రదేశ్‌లో దిగిన అభికి ఎటు వెళ్లాలో అర్థం కాలేదు. మొదటిరోజు ఫ్లాట్‌ఫామ్‌పై పడుకున్నాడు. తెల తెలవారగానే ఎవరో ఒకరు లేపారట. అక్కడున్న ప్రదేశాలను అన్నింటినీ చుట్టేశాడు. ఎక్కడా ఆగకుండా కేవలం లిఫ్టల ద్వారానే హిమాచల్ ప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, హర్యానా, పంజాబ్ తిరిగాడు. ఇక్కడ తినడానికి.. పడుకోవడానికి పెద్దగా ఇబ్బంది ఏమీ కలగలేదు. హరిద్వార్, రిషికేష్, స్మిత్‌వ్యాలీ, అమృత్‌సర్, గోల్డెన్ టెంపుల్ అతడికి ఆశ్రయం ఇచ్చాయి. అప్పటికి 103 రోజులు పూర్తయ్యాయి. అక్కడ్నుంచే ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, సిక్కిం, అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మేఘాలయ చుట్టేశాడు. ఇవన్నీ తిరగడానికి 125 రోజులు పట్టింది. మొత్తానికి హిమాలయా రేంజ్ ఆఫ్ ఇండియాగా పిలిచే ఒక అసాధారణ టాస్క్ కంప్లీట్ చేశాడు అభి.

జీవితం నేర్పిన నార్త్ ఈస్ట్

తన ఏకాంత పర్యటనలో అభితేజ్ చాలా నేర్చుకున్నాడు. ముఖ్యంగా నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లో పర్యటన. అక్కడ భిన్నమైన జీవనశైలి కలిగిన మనుషులు ఉంటారు. 16 కిలోమీటర్లకు ఒక వ్యక్తి కనిపిస్తాడు. పైగా లిఫ్ట్ సౌకర్యం దొరకదు. 10 సంవత్సరాలు వెనకబడి ఉంటుంది. ఆకలేస్తే అప్పటికప్పుడు చెరువులోకి వెళ్లి చేపలు పట్టుకొని ఇంత ఉప్పు వేసుకొని తింటారు. రుచి.. కారం వంటివి కనిపించవు. మన ఆహార విధానానికి అలవాటుపడ్డ వారికి నార్త్ ఈస్ట్ భోజనం అస్సలు రుచించదు. అందుకే ఒక టెంట్ సంపాదించుకున్నాడు. సుమారు నాలుగు నెలలపాటు టెంట్ నీడనే సేదతీరాడు. ఇలా ఓ కొత్త జీవితాన్ని నేర్పించింది నార్త్ ఈస్ట్ పర్యటన.

అందరూ స్నేహితులే

మామూలుగా పోలీసువాళ్లు ఎవ్వరితో స్నేహం చేయరు. మిలటరీ వాళ్లయితే అస్సలు దగ్గరికే రానివ్వరు. రాష్ట్రాల సరిహద్దుల్లో.. సమస్యాత్మక ప్రాంతాల్లో ఒంటరిగా తిరుగుతూ కనిపించిన అభితేజ్‌కు అలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. కానీ చాలా తక్కువ సమయంలో వారితో స్నేహం ఏర్పరచుకున్నాడు అభి. ఎలాంటి వసతి సౌకర్యం లేకపోతే వెంటనే పోలీసు వాళ్లను గానీ.. ఆర్మీనిగానీ సంప్రదించేవాడు. అతి ప్రమాదకరం అని భావించే ట్రక్కు డ్రైవర్లే చాలాసార్లు అతడికి అన్నం పెట్టారు. అడిగిన చోట దింపారట. భాష ఏదైనా.. ఆహారపు అలవాట్లు ఎలాంటివైనా వారందరినీ స్నేహితులుగా మార్చుకొని 522 రోజుల యాత్ర పూర్తి చేసుకొని హైదరాబాద్‌లో ల్యాండ్ అయ్యాడు.

... దాయి శ్రీశైలం

వైరల్ అప్పగింతలు!

ఈ తరం అమ్మాయిలు, బంధాల విలువలతో పెద్దగా పట్టింపు ఉండదు. అన్నింటినీ లైట్‌గా తీసుకుంటారు అనే అభిప్రాయం చాలామందికి ఉంటుంది. కానీ అది తప్పు అని నిరూపిస్తున్నది ఓ వీడియో. ఇది ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యింది.

పెండ్లి పిల్లను పంపే తంతు పాత రోజుల్లో ఎలా ఉండేది? చూస్తే ఏడుపు రానివాళ్లకు కూడా ఏడుపొచ్చే విధంగా ఉండేది. కానీ ఈ రోజుల్లో అప్పగింతల కార్యక్రమం సరదాగా సాగిపోతున్నది. భావేద్వేగాలకు అవకాశం లేకుండా పోతున్నది. కానీ ఇప్పటికీ ఎక్కడో అక్కడ భావోద్వేగాల అప్పగింతల కార్యక్రమం చూస్తూనే ఉన్నాం. అలాంటి వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. బెంగాలీ సాంప్రదాయ కుటుంబానికి చెందిన పెండ్లిపిల్ల అప్పగింతలప్పుడు భావోద్వేగానికి గురైన తీరు అందర్నీ ఆలోచింపజేస్తున్నది. 68 వేల మంది షేర్ చేశారంటే ఈ వీడియో ను జనాలు ఎంతలా ఆదరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇంతకూ ఆమె ఇచ్చిన సందేశం ఏంటంటే.. 'తల్లిదండ్రుల రుణం ఏమిచ్చినా తీర్చుకోలేనిది. ఈ రోజు నుంచి నేను మెట్టినింట్లో అడుగు పెడుతున్నా అని తలుచుకుంటేనే భయంగా ఉంది. ఈ భయమంతా నేను నా తల్లిదండ్రులకు దూరంగా ఉండాల్నా? అనే విషయంలో. ఇప్పటివరకు నాకు ఏ సమస్య రాకుండా చూసుకున్నారు. తల్లిదండ్రుల దగ్గర గడిపిన ఆనంద క్షణాలకు ఇక గుడ్‌బై అని నా కన్నీళ్లు చెప్తున్నాయి' అని చెప్పింది.



ప్రవర్తనే సాయపడుతుంది!



సమాజంలో వివిధ రకాల అభిరుచులున్న వ్యక్తులు కనిపిస్తుంటారు. అయితే ఒంటరిగా ఉన్నప్పుడు ఒకలా, పదిమంది స్నేహితులతో కలిసి ఉన్నప్పుడు మరోలా ఉంటారట. అందులోనూ కొత్తవారితో అయితే కొంచెం జాగ్రత్తగా మలుచుకుంటారట. ఇదే విషయం కెనడాలోని వాటర్‌లూ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు వెల్లడించారు.

బయట సరదాగా గడిపే సమయంలోనే మనిషి ప్రవర్తన ఏ విధంగా ప్రభావం చూపుతుందనే అంశంపై వాటర్‌లూ యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇలాంటి సందర్భంలోనే అసలు విషయాలు బహిర్గతమవుతాయట. సంతోషంగా అందరితో గడిపే సమయంలో ఒక వ్యక్తి హావభావాలు ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. ఆ ప్రభావం కొందరికి ప్రతికూలంగానూ, మరి కొందరికి అనుకూలంగానూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కొందరి తీరు పట్ల హాని కూడా జరిగే ప్రమాదం ఉందని వారు తమ పరిశోధనలో వెల్లడించారు. శరీరంలో వచ్చే హావభావాలు కొన్నిసార్లు మేలు కూడా చేస్తాయని ఆ అధ్యయనంలో తేలింది. కొంతమంది బయటకు వెళ్లినప్పుడు కావాలని తమ వినమ్రతను చూపిస్తుంటారు. దాని వల్ల చాలా అనర్థాలు వస్తాయి. ఒకవేళ ఎప్పుడూ ఒకేలా ఉంటే అటువంటి వారికి ఏ మాత్రం ఇబ్బందులుండవు. 17 ఏండ్ల నుంచి 25 ఏండ్లున్న 92మంది అమ్మాయిలను వరుసగా ఏడు రోజుల పాటు ఒకే దగ్గర ఉంచి వారి ప్రవర్తనలపై పరిశోధన చేసి వాటి వల్ల జరిగే పరిణామాలను గురించి అధ్యయనం చేసి ఫలితాలను వెల్లడించారు.

సుడోకు

డైలీ సుడోకు **57** సమాధానం

3	5	7	2	9	8	4	6	1
6	8	4	1	7	5	2	9	3
9	2	1	3	4	6	7	8	5
7	9	5	4	1	2	8	3	6
2	1	8	5	6	3	9	7	4
4	3	6	7	8	9	5	1	2
5	7	2	9	3	1	6	4	8
8	4	3	6	2	7	1	5	9
1	6	9	8	5	4	3	2	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -58

		2			5	9		3
	1		3	8			6	
9				3				
			5		7			8
5	4			2		3		
2	6							
	8			4		7	5	
7		1						

ట్వీట్

విజయ్ దేవరకొండ
@TheDeverakonda



విజయ్ దేవరకొండను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

5,65,583

నేను 25 యేండ్లు ఉన్నప్పుడు నా అకౌంట్‌లో 500 రూపాయలు లేవని ఆంధ్రా బ్యాంక్ అకౌంట్ లాక్ చేసిన్రు. అప్పుడు మా నాన్న 30 సంవత్సరాల వయసులోపు, తల్లిదండ్రులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు ప్రయోజకుడివి కావాలని చెప్పారు. నాలుగు సంవత్సరాల తర్వాత ఫోర్బ్స్ టాప్ 100 మంది సెలబ్రిటీలలో నేను ఒకడిని. ఫోర్బ్స్ అండర్ 30లో నేను ఒకడిని.

కామన్‌మ్యాన్ వాయిస్

వాస్తవంగా ఇప్పుడు బెంగాల్‌లో జరుగుతున్న ఎపిసోడ్ కేవలం మమతా బెనర్జీ గారి ఆధిపత్య పోరు..తన అనే మనుషుల తప్పు ఉన్నాగాని వాళ్లను రక్షించుకోవాలనే తపన. అక్కడి విషయాలు ప్యూర్‌గా వ్యక్తిగత విషయాలు కాబట్టే కేసీఆర్ గారు స్పందించడం లేదు. కానీ చంద్రబాబు, రాహుల్ గాంధీ గార్లు గుడ్డెద్దు చేన్ల పడ్డట్టు ఉరుకుతున్నారు.
–Katpally Santosh Reddy

బాగున్నారా అని అడిగి తెలుసుకునే రోజులు పోయాయి. మనిషి ఆన్‌లైన్‌లో కనిపిస్తే చాలు బాగానే ఉన్నాడులే.. అనుకుంటున్నారు ఈ కాలం మనుషులు.
–Sai Pramod Kumar Paku

ఎవడన్నా ప్రాజెక్ట్ పూర్తయితే పొగిడించుకుంటాడు. ఇయనేంద్రా బాబు ఏకంగా భజనలు చేయించుకుంటున్నాడు. ఇక గెలవలేనని అర్థమైందనుకుంటా.
–Buchibabu Kp

వైరల్ వీడియో



మార్వెల్ స్టూడియోస్ సమర్పించు అవెంజర్స్ ఎండ్ గేమ్ సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో హల్ చల్ చేస్తున్నది.

Marvel Studios' Avengers: Endgame - Big Game TV Spot

Total views : **12,101,418+**

Premiered Jan 24, 2019

III.
నమస్తే తెలంగాణ
సంకేత
[కరీంనగర్]
బుధవారం 6 ఫిబ్రవరి 2019
టెక్నాలెడ్జీ 2.0

పబ్‌జీ.. వద్దు బుజ్జీ!



'నమస్కారం.. ప్రధానమంత్రి గారూ.. నా పేరు మధుమిత. నా బిడ్డ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అంతకు ముందు బాగా చదివేవాడు. ఈ మధ్య చదువు మీద అస్సలు శ్రద్ధ పెట్టడం లేదు. ఆన్‌లైన్ గేమ్స్ ఎక్కువగా ఆడుతున్నాడు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మొన్న జరిగిన పరీక్షా పర్ చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీని ఓ తల్లి అడిగిన ప్రశ్న ఇది. ఆమె ప్రశ్న పూర్తి కాగానే.. మోడీ స్పందిస్తూ.. 'యే.. పబ్‌జీ వాలా హే క్యా' అన్నారు. వెంటనే సభలో నవ్వులు పూశాయి. నిజమే.. చాలా మంది పిల్లలు పబ్‌జీ మత్తులో పడి చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం నాశనం చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న పబ్‌జీ గేమ్ అంత ప్రమాదకరమైనదా? ఆన్‌లైన్ గేమ్‌ల విజృంభణ దేనికి సంకేతం.. ఈ వారం సంకేతలో చర్చిద్దాం..

ముంబైలో..

రోజూ మొబైల్‌లో పబ్‌జీ గేమ్ ఆడాడు. క్రమంగా ఆ ఆటకు బానిస అయ్యాడు. అప్పుడు వాడుతున్న మొబైల్‌లో పబ్‌జీ గేమ్ కాస్త స్లోగా రావడంతో తల్లి దండ్రులను కొత్త మొబైల్ కావాలని అడిగాడు. వాళ్లు రూ. 20 వేలు ఇస్తామన్నారు. కానీ.. ఆ కుర్రాడు రూ. 37 వేల రూపాయాల విలువైన ఫోన్ కావాలని పట్టుబట్టాడు. దీంతో ఆ పేరెంట్స్ అంత డబ్బు పెట్టి ఫోన్ కొనివ్వడం కుదరదని తేగేసి చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన 18 ఏండ్ల కుర్రాడు ఫ్యాన్‌తో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఇది ముంబైలోని నెహ్రూనగర్‌లో జరిగిన వాస్తవ సంఘటన.



ఢిల్లీలో..

చదువు పక్కనపెట్టి స్నేహితులతో నిత్యం పబ్‌జీ గేమ్‌లో మునిగిపోతున్న తమ్ముడిని చూసి ఓ అక్క తట్టుకోలేకపోయింది. ఏ పని చెప్పినా చేయకపోవడం, సమయానికి తిండి కూడా తినకుండా గేమ్‌లోనే మునిగిపోవడం చూసి ఆందోళన చెందింది. ఫ్రెండ్స్‌తో కలిసి గేమ్‌లో మునిగిపోయిన తమ్ముడిని ' ఆ గేమ్ ఆడకు' అని చెప్పినందుకు క్షణికావేశంలో ఆ అక్కను కత్తితో పొడిచి చంపేశాడు ఆ కుర్రాడు. ఇది దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఘటన. పబ్‌జీ గేమ్‌కి బానిసై అక్క ప్రాణాలు తీసిన ఆ కుర్రాడు ఇప్పుడు జైల్లో ఊచలు లెక్కబెడుతున్నాడు.

జమ్మూలో..

అందరికీ ఫిజికల్ ఫిట్‌నెస్ పాఠాలు చెప్పే ఫిట్‌నెస్ ట్రైనర్ ఆయన. సరదాగా పబ్ జీ గేమ్ ఆడడం మొదలుపెట్టాడు. క్రమంగా దానికి బానిసై పిచ్చివాడైపోయాడు. ఫిట్‌నెస్ ట్రైనర్ ఉద్యోగం పోగొట్టుకున్నాడు. కత్తితో తనను తాను గాయపరుచుకున్నాడు. ఇదొక పర్యవసానం.

'అరేయ్.. ఏడున్నవ్ రా?' 'ఇంట్లనే ఉన్నరా' 'ఆన్‌లైన్‌కి రా.. పబ్‌జీ ఆడుదాం' అవును.. ఏ ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నా ఇప్పుడు ఇదే సంభాషణ. నేరుగా అయితే మాటల్లేవ్.. మాట్లాడుకోవడాల్లేవ్.. ఓన్లీ పబ్‌జీ. పక్కన ఏం జరుగుతుందో పట్టించుకోరు. ఎవరు పిలుస్తున్నారో వినిపించుకోరు. కదిలిస్తే చాలు.. 'జై పబ్‌జీ..' అంటూ ఊగిపోతారు. అవును.. సరదాగా ఆడుకునే గేమ్‌లే ప్రాణాంతకం అవుతున్నాయి. మొన్నటి వరకు పోకెమన్, నిన్న బ్లూవేల్, ఇప్పుడు డేంజరస్ పబ్‌జీ. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ ఆన్‌లైన్ గేమ్‌లు చాలా ప్రమాదం. రోజురోజుకి మనుషుల ప్రాణాలు మింగేస్తున్న భూతాల్లా తయారవుతున్నాయి. పిల్లల్లో హింసాత్మక ధోరణి పెరిగేలా రెచ్చగొడుతున్నాయి. అవతల మనతో గేమ్ ఆడుతున్న వ్యక్తి ఎవరో కూడా తెలియకుండా ఆటలో మునిగిపోయేలా చేయడం, ఒళ్లు తెలియకుండా గేమ్‌లో లీనమయ్యేలా రూపొందిస్తున్న ఈ గేమ్ వల్ల లాభమా? నష్టమా?

పబ్ జీ అంటే ఏంటి?

ఈ ప్రశ్న పబ్‌జీ గేమ్ ఆడేవారిని అడిగి చూడండి. నూటికి ఒకరో, ఇద్దరో సరైన సమాధానం చెప్తారు. అవును.. గేమ్ పూర్తి పేరు కూడా తెలియకుండానే చాలామంది గేమ్‌లో మునిగిపోతున్నారు. ఇంతకీ పబ్ జీ అంటే 'ప్లేయర్ అన్‌నోన్స్ బ్యాటిల్ గ్రౌండ్' (Pubg) అన్న మాట. ఇది దక్షిణ కొరియాలోని పబ్ జీ కార్పోరేషన్ అనే గేమింగ్ సంస్థ రూపొందించిన ఆన్‌లైన్ గేమింగ్ యాప్. 2017 సంవత్సరాంతంలో విడుదలైన ఈ గేమ్‌ని ప్రస్తుతం ఈ ఆటను ప్రపంచవ్యాప్తంగా 20కోట్ల మంది ఆడుతున్నారు. కనీసం నాలుగు కోట్లమంది ఆన్‌లైన్ ప్లేయర్స్ నిత్యం యాక్టీవ్‌గా ఉంటున్నారు.

సమస్యేంటంటే..

సరదాగా, టైమ్‌పాస్ కోసం ఆటలు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడొచ్చు. కానీ దాన్ని వ్యసనంగా మార్చుకుంటే లేనిపోని సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. ఇలాంటి ఆన్‌లైన్ గేమ్‌లకు అడిక్ట్ అయి, గేమ్ ఆడుతున్న సమయంలో ఎవరినీ పట్టించుకోరు. గేమ్ నుంచి పక్కకు చూస్తే గేమ్‌లో శత్రువులు మన మీద దాడి చేసి చంపేస్తారనే భయంతో పరిసరాలను సైతం మరిచిపోయి ఆటలో మునిగిపోతున్నారు. ఫోన్ చేసినా ఎత్తరు, పిలిచినా పట్టించుకోరు. డిస్టర్బ్ చేస్తే.. అసహనం ప్రదర్శిస్తారు. కొన్ని సందర్భాల్లో అయితే కోపంలో ఏం చేస్తున్నారో కూడా తెలియకుండా ప్రవర్తిస్తారు. ఆటలో మునిగిపోయి ఎక్కువసేపు మొబైల్ చూడడం వల్ల కంటిచూపు మీద ప్రభావం, నిద్రలేమి సమస్యలు వస్తాయి. ఒకేచోట కూర్చొని ఎక్కువసేపు కదలకుండా ఉండడం వల్ల నరాల సంబంధ వ్యాధితో బాధపడాల్సి వస్తుంది. గేమ్‌లో శత్రువులను చంపడం అనేది నిజ జీవితంలో ఒక లక్షణంగా మారిపోయి హింసాప్రవృత్తి పెరిగిపోతుంది. అటు చదువు మీద ఎఫెక్ట్ పడుతుంది.. ఆరోగ్యం దెబ్బతింటుంది.. ఇంట్లోవాళ్లతో, స్నేహితులతో గడిపే టైమ్ వేస్టయితుంది.. అందుకే.. పబ్ జీ.. వద్దురా బుజ్జీ!



ఎందుకు అడిక్ట్ అవుతున్నారు?

కంప్యూటర్‌లో గానీ, మొబైల్‌లో గానీ ఈ ఆట ఆడొచ్చు. ఒక్కరుగా ఆడొచ్చు. లేదంటే స్నేహితులతో కలిసి ఆడొచ్చు. మొత్తం గేమ్‌లో వంద మంది ఉంటారు. ఒంటరిగా ఆడితే.. 99మందిని గెలువాలి. ఈ ఆటలో భాగంగా గేమ్‌లో బాంబులు, తుపాకులు, కత్తులు, ఈటెలు, ఇతర ఆయుధాలు ఉపయోగించి ఎదుటివారిని చంపేయాలి. అలా చంపేస్తూ చివరి వరకు ఎవరు మిగులుతారో వారే విజేత. ఒక్కరే ఈ ఆట ఆడితే పెద్దగా మజా ఉండదు. ఎందుకంటే ఆట చాలా త్వరగా ముగించేయాల్సి వస్తుంది. కానీ.. స్నేహితులతో కలిసి జట్టుగా గేమ్‌లోకి ఎంటరైతే ఒకరికొకరు సహకరించుకుంటూ మనకు తెలియనివారిని చంపేస్తూ ఆట చివరి వరకు కొనసాగవచ్చు. జట్టుగా ఆడినవారు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. స్నేహితులతో కలిసి ఆడడం, ఎవరో తెలియని వ్యక్తులతో కత్తులు, బాంబులు, తుపాకులతో దాడి చేసి చంపడం వంటి టాస్కులు ఉండడంతో గేమ్ ఆడుతుంటే మజా వస్తుంది. స్నేహితులతో గుంపులు గుంపులుగా కూర్చొని ఆడవచ్చు. మనకు తెలియకుండానే ఫుల్ టైమ్‌పాస్. అందుకే యువత ఈ గేమ్‌కి ఎక్కువగా అడిక్ట్ అవుతున్నారు. ఆడడం, గెలవడం, ఆయుధాలు, చంపడాలు అంతా గేమ్ వరకే. కానీ.. యువత ఆ విషయం వదిలేసి.. గేమ్‌ని సీరియస్‌గా తీసుకుంటుంది. ప్రాణాల మీదకు తెచ్చుకుంటుంది.

... ✍ ప్రవీణ్‌కుమార్ సుంకరి

రియల్‌మీ యూ1

నయామాల్

వాలెంటైన్స్ డే సందర్భంగా ఒప్పో 'యూ అండ్ ఐ రియల్‌మీ డేస్' సేల్ ప్రారంభించింది. ఈ సందర్భంగా మార్కెట్లో రియల్‌మీ యూ1 పేరుతో కొత్త మొబైల్ మీద ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. ఆ మొబైల్ ఫీచర్లు ఇలా ఉన్నాయి.



డిస్‌ప్లే	: 6.3 అంగుళాలు ఎల్ఈడీ డిస్‌ప్లే
రిజెల్యూషన్	: 2340x1080
ఆపరేటింగ్ సిస్టమ్	: 8.1 ఓరియో (కలర్ ఓఎస్ 5.2)
ర్యామ్	: 3/4 జీబీ
ఇంటర్నల్ స్టోరేజీ	: 32/64 జీబీ
ప్రాసెసర్	: మీడియాటెక్ హీలియో పీ70 ప్రాసెసర్
రియర్ కెమెరా	: 13+2 మెగాపిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా	: 25 మెగాపిక్సెల్స్
సిమ్ టైప్	: డ్యుయల్ సిమ్
అందుబాటులో ఉన్న రంగులు	: యాంబిషనల్ బ్లాక్, బ్రేవ్ బ్లూ, ఫిరీ గోల్డ్
ధర	: రూ. 11,499

ఎక్కితే వెళ్లిపోయే బస్సు!

బస్సు ఎక్కగానే మనకు డ్రైవర్ కనిపిస్తాడు. తెలిసిన వాడైతే నవ్వుతూ పలుకరిస్తాడు. ఎక్కిన తర్వాత బస్సు కదులాలంటే గేర్ వేయాలి, క్లచ్ తొక్కాలి, ఎక్సలేటర్ ఇవ్వాలి. ఇవన్నీ జరుగాలంటే బస్సులో ఇంధనం పోయాలి. కానీ ఈ బస్సుకు అవన్నీ ఏం అవసరం లేదు. జస్ట్.. ఎక్కితే చాలు.. వెళ్లిపోతుంది.



మనోళ్లు మామూలోళ్లు కాదు. టెక్నాలజీ అంతు చూడడంలో కాకలు తీరిన టెక్నాలజీ వీరులతో సైతం తలపడుతున్నారు. రాజస్థాన్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి చెందిన అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సౌరశక్తితో కదిలే డ్రైవర్‌లెస్ బస్సును తయారుచేశారు. యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన వర్క్‌షాప్‌లో 300 మంది విద్యార్థులు, 50మంది అధ్యాపకులు కష్టపడి ఈ సోలార్ బస్సును రూపొందించారు. ఒక్కసారి ఫుల్‌ఛార్జ్ చేస్తే 70 కిలోమీటర్లు పరుగులు తీస్తుంది. ఆ తర్వాత బస్సు టాప్‌లో ఉన్న సోలార్ ప్యానెల్‌తో నిత్యం ఛార్జ్ అవుతూనే ఉంటుంది. కేవలం రూ.15 లక్షల ఖర్చుతోనే ఈ బస్సు రూపొందించడం విశేషం.

పవర్‌బ్యాంక్ కొంటున్నారా?

టెక్ చిట్కాలు

ఇంటర్నెట్ వాడే వేగానికి మొబైల్‌లో చార్జింగ్ కూడా అంతేవేగంగా అయిపోతున్నది. ఇందుకు పరిష్కారం.. పవర్‌బ్యాంకులు. అయితే.. నాసిరకం, నకిలీ పవర్‌బ్యాంకులు కొని మోసపోకుండా ఈ చిట్కాలు పాటించండి.



- మార్కెట్లో ఒరిజినల్ బ్రాండ్లు ఎన్ని ఉన్నాయో.. అంత కంటే ఎక్కువ నకిలీ బ్రాండ్లు కూడా ఉన్నాయి. అందుకే.. ఏదైనా బ్రాండ్ కొనేటప్పుడు పేరు, లోగోను నిశితంగా పరిశీలించండి.
- రోడ్డు పక్కన అమ్మే పవర్‌బ్యాంకులు కొంటే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోండి.
- పవర్‌బ్యాంక్ కొనేముందు మొబైల్ బ్యాటరీ కెపాసిటీకి సరిపోయేలా కొనండి.
- మీ మొబైల్ బ్యాటరీ సామర్థ్యం 3000 ఎంఏహెచ్ అయితే.. 6000 ఎంఏహెచ్ పవర్‌బ్యాంక్ కొనండి. రెండు యూఎస్‌బీ పిన్నులు జతచేసుకునేది ఉంటే ఇంకా బెటర్.
- తక్కువ ధరలో వస్తుంది కదా.. అని తొందరపడి ఏదో ఒకటి కొనకండి. మంచి సామర్థ్యం ఉన్న పవర్‌బ్యాంకు ధర కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది.
- ఎంత ఎక్కువ సామర్థ్యం ఉన్న పవర్‌బ్యాంకు అయితే.. అన్ని ఎక్కువసార్లు మొబైల్‌కి చార్జింగ్ పెట్టుకోవచ్చు.
- ఆన్‌లైన్‌లో కొనేకంటే.. ఏదైనా మంచి షాప్‌కెళ్లి కొనడం బెటర్. అక్కడైతే చెక్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

బీఎస్‌ఎఫ్‌లో 1763 ఖాళీలు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ట్రేడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టు పేరు:** ట్రేడ్ కానిస్టేబుల్
- **మొత్తం ఖాళీల సంఖ్య – 1763** (పురుషులు–1761, మహిళలు–2)
- **విభాగాల వారీగా ఖాళీలు:** కానిస్టేబుల్ (కాబ్లర్)–32, కానిస్టేబుల్ (టైలర్)–36, కానిస్టేబుల్ (కార్పెంటర్)–13, కానిస్టేబుల్ (కుక్)–561, కానిస్టేబుల్ (డ్రాఫ్ట్స్‌మెన్)–1, కానిస్టేబుల్ (పెయింటర్)–1, కానిస్టేబుల్ (వెయిటర్)–9, కానిస్టేబుల్ (స్వీపర్)–389, కానిస్టేబుల్ (డబ్ల్యూ/సీ)–320, కానిస్టేబుల్ (డబ్ల్యూ/ఎం)–253 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులన్నీ పురుషులకు మాత్రమే. మహిళా కానిస్టేబుల్ (టైలర్)–2 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** పదోతరగతితోపాటు రెండేండ్ల పాటు సంబంధిత ట్రేడ్ రంగంలో అనుభవం ఉండాలి లేదా ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి సంబంధిత ట్రేడ్‌లో రెండేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019, ఆగస్టు 1 నాటికి 18 – 23 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 21,700–69,100/- (పే మ్యాట్రిక్స్ లెవల్ 3 ప్రకారం)
- **శారీరక ప్రమాణాలు: ఎత్తు:** పురుషులు–162. సెం.మీ., ఛాతీ: 76 సెం.మీ., గాలి పీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచించాలి .
- మహిళలు–150 సెం. మీ ఎత్తు ఉండాలి.
- **బరువు:** వైద్య ప్రమాణాల ప్రకారం ఎత్తు, వయస్సుకు దామాషాగా ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, పీఎస్‌టీ/పీఈటీ, ట్రేడ్ టెస్ట్ ద్వారా ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. రాతపరీక్షలో మొత్తం 100 ప్రశ్నలు– 100 మార్కులు.2 గంటల కాలవ్యవధిలో పూర్తిచేయాలి.
- మొదటి దశ రాతపరీక్షలో జనరల్ అవేర్‌నెస్/జనరల్ నాలెడ్జ్, నాలెడ్జ్ ఆఫ్ ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ ఇంగ్లిష్/హిందీ, అనలిటికల్ ఆప్టిట్యూడ్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలను ఇస్తారు.
- రెండోదశ–పీఎస్‌టీ/పీఈటీ, ట్రేడ్ టెస్ట్, ఫైనల్ మెడికల్ ఎగ్జామ్ టెస్ట్.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి 2–8)లో వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తులను పంపాలి.
- **వెబ్‌సైట్:** http://bsf.nic.in

ఐఐఆర్ఆర్‌లో

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్ (ఐఐఆర్ఆర్) ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

- **విభాగాలవారీగా ఖాళీలు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో–4, జూనియర్ రిసెర్చ్ ఫెలో–4, యంగ్ ప్రొఫెషనల్ (గ్రేడ్2)–3, టెక్నికల్ అసిస్టెంట్–5 , టెక్నికల్ హెల్పర్–2, రిసెర్చ్ అసోసియేట్–1, ఫీల్డ్ అసిస్టెంట్–2
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ లేదా డిప్లొమా ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 14,15,16, 18, 19
- **వెబ్‌సైట్:** www.iirr.org.in

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ఎన్ఎఫ్ఎల్ -రామగుండం ఫర్టిలైజర్స్ & కెమికల్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో ఖాళీగా ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు పేరు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్
- **మొత్తం పోస్టులు:** 53 (జనరల్–28, ఓబీసీ–14, ఎస్సీ–8, ఎస్టీ–3)
- **అర్హత:** బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్) లేదా కెమికల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత. సంబంధిత బ్రాంచిలో గేట్ స్కోర్ – 2016లో అర్హత సాధించాలి.
- సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2018 డిసెంబర్ 31 నాటికి 18 నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 9,000–16,400/- డీఏ, హెచ్ఆర్ఏ, మెడికల్, తదితర సౌకర్యాలు కల్పిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ. 200/-, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు.
- **పరీక్షకేంద్రాలు:** హైదరాబాద్, రామగుండం, కరీంనగర్, మంచిర్యాల, పెద్దపల్లితో కలిపి దేశవ్యాప్తంగా మొత్తం 17 కేంద్రాల్లో ఎగ్జామ్ నిర్వహిస్తారు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాతపరీక్ష
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 15
- **చివరితేదీ:** మార్చి 14
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

ఎన్ఐఆర్‌టీలో ఖాళీలు

చెన్నైలోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ ట్యూబర్క్యులోసిస్ (ఎన్ఐఆర్‌టీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు టెక్నీషియన్/అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టులు:** 575
- **విభాగాలవారీగా** : సైంటిస్ట్ సీ–23, ప్రాజెక్టు టెక్నికల్ ఆఫీసర్–69, ప్రాజెక్టు అసిస్టెంట్–46, ప్రాజెక్టు టెక్నీషియన్ (గ్రేడ్3)–161, డ్రైవర్ కమ్ మెకానిక్–23, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ –46, ప్రాజెక్టు టెక్నీషియన్ (గ్రేడ్2)–161, సీనియర్ ప్రాజెక్టు అసిస్టెంట్–23 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** సైంటిస్ట్ సీ పోస్టులకు ఎంబీబీఎస్, ఎండీ/డీఎన్‌బీ/ఎంపీహెచ్/ఎంఏఈ లేదా ఎంబీబీఎస్+పీజీ డిప్లొమా, ప్రాజెక్టు టెక్నికల్ ఆఫీసర్/అసిస్టెంట్‌లకు సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీ, ప్రాజెక్టు టెక్నీషియన్ (గ్రేడ్2, గ్రేడ్3) పోస్టులకు పదోతరగతి/ఇంటర్, డీఎంఎల్‌టీ, బీఎస్సీ, డాటా ఎంట్రీ ఆపరేటర్/ సీనియర్ ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్‌తోపాటు టైపింగ్ నాలెడ్జ్. డ్రైవర్ కమ్ మెకానిక్ పోస్టులకు పదోతరగతి+డ్రైవింగ్ లైసెన్స్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణత.
- **వయస్సు:** ప్రాజెక్టు టెక్నీషియన్ (గ్రేడ్2), డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు 28 ఏండ్లు, డ్రైవర్/ఎంటీఎస్ పోస్టులకు 25 ఏండ్లు, మిగతా పోస్టులకు 30 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూతేదీ:** ఫిబ్రవరి 13 నుంచి 27 వరకు
- **వెబ్‌సైట్:** www.nirt.res.in

సినీ పరిశ్రమలోనే కాదు ఏ రంగంలోనైనా జయాపజయాలు దోబూచులాడుతుంటాయి. విజయాల్ని ప్రతి ఒక్కరూ గర్వంగా స్వీకరిస్తుంటారు. అయితే అపజయాల విషయంలో చాలా మందిలో దాటవేసే ధోరణి కనిపిస్తుంటుంది. ఫెయిల్యూర్స్‌ను అంగీకరించడానికి మనసొప్పకోదు. టాలీవుడ్ హీరోలు మాత్రం అందుకు అతీతంగా నిలుస్తున్నారు. అపజయాల్ని హుందాగా స్వీకరిస్తూ అభిమానుల మనసుల్ని గెలుచుకుంటున్నారు. అందరిని మెప్పించే మంచి సినిమా చేయలేకపోయామని తప్పుల్ని ఒప్పుకుంటున్నారు. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' చిత్ర పరాజయానికి పూర్తి బాధ్యత తనదే నని బాలీవుడ్ మిస్టర్‌పర్‌ఫెక్ట్ ఇటీవల అమీర్‌ఖాన్ వెల్లడించారు. ఆయన బాటలోనే రామ్‌చరణ్, వరుణ్‌తేజ్, విజయ్‌దేవరకొండ సహా పలువురు తెలుగు కథానాయకులు అడుగులు వేస్తూ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుడుతున్నారు.

ఇట్లు.. ప్రేమతో.. మీ అభిమాన హీరో!


శర్వానంద్

''పడి పడి లేచే మనసు' సినిమాపై చాలా అంచనాలు పెట్టుకున్నాను. పెద్ద రేంజ్‌లో నిలుస్తుందని, గొప్ప సినిమా అవుతుందనుకున్నాను. సినిమాపై వచ్చిన విమర్శల్ని గౌరవంగా స్వీకరిస్తున్నాను. ప్రథమార్థం బాగుందని, ద్వితీయార్థంలో కొన్ని తప్పులు దొర్లాయని చెప్పారు. ఆ పొరపాట్లను సవరించుకుంటూ భవిష్యత్తులో అందరిని మెప్పించే మంచి సినిమాలు చేస్తాను' సినిమా విడుదలైన ఐదో రోజున శర్వానంద్ చెప్పిన మాటలివి. సినిమా థియేటర్లలో ఉండగానే ఫ్లాప్ అయిందని ధైర్యంగా ఒప్పుకొని ఇండస్ట్రీ వర్గాలతో పాటు అభిమానుల్ని ఆశ్చర్యపరిచారు. సినిమా విషయంలో కొన్ని తప్పులు చేశానని చెప్పి ఓటమిని అంగీకరించారు. విడుదలకు ముందు ప్రచార చిత్రాల్లో శర్వానంద్, సాయిపల్లవి కెమిస్ట్రీ, సంగీతం, దర్శకుడు హను రాఘవపూడి టేకింగ్ కారణంగా మణిరత్నం శైలిలో గుర్తుండిపోయే సినిమాగా నిలుస్తుందని ప్రచారం జరిగింది. ఆ అంచనాల్ని తారుమారు చేస్తూ అంతిమంగా పరాజయాన్ని చవిచూసింది. శర్వానంద్‌తో పాటు చిత్రబృందానికి నిరాశను మిగిల్చింది.

సామాన్య ప్రేక్షకుడి ఊహాశక్తికి..

స్పేస్ థ్రిల్లర్ కథాంశంతో తెలుగుతెరపై వచ్చిన తొలి సినిమాగా అంతరిక్షం ప్రారంభం నుండి దక్షిణాది సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో భారీ అంచనాల నడుమ గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్‌గా మిగిలింది. సైన్స్‌కు సంబంధించిన అంశాలతో సామాన్య ప్రేక్షకుడి ఊహాశక్తికి మించి కథాగమనం సాగడం, కథ, కథనాల్లో ఉత్కంఠ లోపించడం, బడ్జెట్ పరిమితుల కారణంగా కమర్షియల్‌గా నిర్మాతలకు ఈ చిత్రం నష్టాలను మిగిల్చింది. తమ సినిమా అందరిని మెప్పించలేకపోయిందని 'అంతరిక్షం' విడుదలైన కొద్ది రోజులకు వెల్లడించారు వరుణ్‌తేజ్. 'ప్రతి సినిమాపై ప్రశంసలతో విమర్శలు రావడం సహజం. మా 'అంతరిక్షం'పై వచ్చిన విమర్శల్ని అంగీకరిస్తున్నాను' అని తెలిపారు. అలాగే బీ,సీ వర్గాలను ఈ సినిమా ఆకట్టుకోవడం కొంత కష్టమేనని ముందే ఊహించానని పేర్కొన్న ఆయన ప్రేక్షకులు ఇచ్చిన తీర్పును ఒప్పుకున్నారు.


వరుణ్‌తేజ్

అల్లు అర్జున్ సైతం..

'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' తనకు పరాజయాన్నే మిగిల్చిందని లవర్స్ డే ఆడియో వేడుకలో పేర్కొన్నారు అల్లు అర్జున్. ఈ పరాజయానికి కారణాలేమిటో మాత్రం చెప్పలేదు. అలాగే కల్యాణ్‌రామ్ సైతం 'నా నువ్వే' కథలోని లోపాల కారణంగా సరైన ఫలితాన్ని అందివ్వలేదని చెప్పారు. వీరే కాదు చాలా మంది నవతరం హీరోలు ఫలితం ఏదైనా వాస్తవాల్ని దాచకుండా అభిమానులతో పంచుకుంటూ నిజాయితీని చాటుకుంటున్నారు.


రామ్‌చరణ్

రేయింబవళ్లు కష్టించాం..కానీ

రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినయవిధేయరామ. దాదాపు ఎనభై కోట్ల బడ్జెట్‌తో మాస్ ఎంటర్‌టైనర్‌గా ఎన్నో అంచనాల నడుమ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం అనూహ్యంగా పరాజయాన్ని చవిచూసింది. కథ, కథనాల్లోని లోపాలతో పాటు లాజిక్‌లతో సంబంధం లేకుండా వాస్తవికతకు దూరంగా సాగిన యాక్షన్ సన్నివేశాల కారణంగా అ చిత్రం ప్రేక్షక తిరస్కారానికి గురైంది. 'రంగస్థలం' విజయంతో దిగ్విజయీకృత ఉత్సాహంతో ఉన్న రామ్‌చరణ్‌ను ఈ చిత్ర ఫలితం నిరుత్సాహపరిచింది. పోరాట ఘట్టాల చిత్రీకరణతో పాటు దర్శకత్వ పనితీరు పరంగా బోయపాటి శ్రీను ఈ సినిమాతో చాలా విమర్శల్ని ఎదుర్కొన్నారు. ఈ సినిమా ఫలితంపై చిత్రబృందం ఇన్నాళ్లు పెదవి విప్పలేదు. ఎట్టకేలకు రామ్‌చరణ్ ఈ ఓటమిని నిజాయితీగా అంగీకరించారు. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించలేకపోయామని పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 'మా 'వినయవిధేయరామ' సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. నిర్మాత దానయ్య అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శనదారులకు కృతజ్ఞుడినై ఉన్నాను. అందరికీ నచ్చే మిమ్మల్ని వినోదింపచేసే సినిమా అందించడానికి మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు మేము అనుకున్న విధంగా ఒక మంచి సినిమాను అందించలేక మీ అంచనాలను అందుకోలేకపోయాం. మీరు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకొని భవిష్యత్తులో మీకు నచ్చే మీరు మెచ్చే సినిమాలు చేయడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తాను' అని రామ్‌చరణ్ పేర్కొన్నారు. 'వినయవిధేయరామ' పరాజయాన్ని హుందాగా అంగీకరించి అభిమానుల హృదయాల్ని గెలుచుకున్నారు


విజయ్ దేవరకొండ

గెలుస్తే గెలుస్తాం..

'నోటా చిత్రంతో తమిళంలో అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ అరంగేట్రంలోనే అపజయాన్ని ఎదుర్కొన్నారు. తమిళనాడు రాజకీయ పరిస్థితులకు అద్దంపడుతూ దర్శకుడు ఆనంద్‌శంకర్ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరించలేకపోయింది. తన కోసం 'నోటా' సినిమా చూడటానికి వచ్చిన వారిని మెప్పించలేకపోయానని విజయ్ దేవరకొండ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. 'నా పరాజయం కోసం ఎదురుచూసిన వారికి ఇప్పుడు సమయం వచ్చింది. ఇక పండుగ చేస్కోండి. నోటాలో నటించినందుకు పశ్చాతపడటంలేదు. గర్వపడుతున్నాను. మంచి కథ చెప్పడానికి ప్రయత్నించాం. తమిళనాడుతో పాటు జాతీయ స్థాయిలో కొందరు సినిమా బాగుందని అన్నారు. వారి ప్రేమను స్వీకసున్నాను. ఈ సినిమా విషయంలో వచ్చిన విమర్శల్ని అంగీకరిస్తున్నాను. వాటి పట్ల ఆత్మవిమర్శ చేసుకుంటూ తప్పుల్ని సవరించుకుంటాను. ఈ నిర్ణయాల వల్ల నా వృత్తిలో మార్పు వస్తుందే కానీ నా మనస్తత్వంలో మాత్రం రాదు. సక్సెస్, ఫెయిల్యూర్ ఏదైనా రౌడీని ఆపలేదు. రౌడీ అంటే నా దృష్టిలో గెలవడం కాదు విజయం కోసం పోరాడేతత్వం. పోరాడదాం. గెలుస్తే గెలుస్తాం. లేదా నేర్చుకుంటాం. మంచి విజయంతో మళ్లీ మీ ముందుకు వస్తాను' అని ట్విట్టర్ ద్వారా విజయ్ దేవరకొండ నోటా అపజయాన్ని ఒప్పుకున్నారు.


అల్లు అర్జున్


బెక్కం వేణుగోపాల్, దిల్‌రాజు, శ్రీహర్ష

ఊహించని విజయమిది!

'తొలి పాట రిలీజ్ రోజునే సినిమా బాగుందని, ఆడేలా వుందని చెప్పాను. నిజంగానే సినిమాను ప్రేక్షకులు ఆదరించారు. ఈ రోజుల్లో సినిమా ఆడేదే కష్టం. అలాంటిది 50 రోజులు పూర్తి చేసుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి అభినందనలు తెలియజేస్తున్నాను' అన్నారు దిల్ రాజు. తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్, దినేష్ తేజ్, ప్రియా వడ్లమాని, దీక్ష, హేమ ఇంగ్లే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హుషారు'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. బెక్కం వేణుగోపాల్, రియాజ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం యాభై రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో 50 డేస్ సెలబ్రేషన్స్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత దిల్ రాజు చిత్ర బృందానికి జ్ఞాపికల్ని అందజేశారు. అనంతరం బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ ''హుషారు' చిత్రాన్ని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. ఈ స్థాయి విజయాన్ని నేను ఊహించలేదు. కొన్ని ఏరియాల్లో షిఫ్టింగ్‌తో..హైదరాబాద్‌లోని శ్రీమయూరి థియేటర్‌లో ఫుల్ రన్‌తో 50 రోజులు పూర్తి చేసుకుంది. శ్రమిస్తే ఫలితం దక్కుతుందనడానికి మా సినిమా విజయమే నిదర్శనం. ఈ సినిమా కోసం ఏడాదిన్నర పాటు శ్రమించాం. దర్శకుడు శ్రీహర్ష చాలా ఓపికగా ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించాడు' అన్నారు. 'ఈ సినిమాకు పనిచేసిన ప్రతీ రోజు ఓ జ్ఞాపకమే. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని మళ్లీ మళ్లీ చూసి భారీ విజయాన్ని అందించారు' అని దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి అన్నారు. ఈ కార్యక్రమంలో తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్, దినేష్ తేజ్, ప్రియా వడ్లమాని, దీక్ష, హేమ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్ మెచ్చిన '4 లెటర్స్'!


వెంకటేష్, ఈశ్వర్

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం '4 లెటర్స్'. ఆర్.రఘురాజ్ దర్శకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. సెన్సార్ పూర్తయింది. ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ని ప్రత్యేకంగా వీక్షించిన హీరో వెంకటేష్ చిత్ర బృందాన్ని అభినందించారు. సరికొత్త నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నిర్మాతలు మాట్లాడుతూ 'వైజాగ్ సత్యానంద్ వద్ద శిక్షణ పొందిన ఈశ్వర్‌ను ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయం చేస్తున్నాం. కమర్షియల్ హంగులతో ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''కలుసుకోవాలని' సినిమా తరువాత తెలుగులో నేను రూపొందించిన నవతరం ప్రేమకథాచిత్రమిది. అందుకే 'కుర్రాళ్లకు అర్థమవుతుందిలే' అనే శీర్షికను పెట్టాం. ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటి తరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు ఎలా వుంటున్నాయి? అనే అంశాల్ని తీసుకుని వాస్తవికతకు దగ్గరగా తీసిన చిత్రమిది. కథ, కథనాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటూనే ఆలోచించే విధంగా సాగుతాయి. హీరోగా పరిచయమవుతున్న ఈశ్వర్‌కు ఈ సినిమాతో మంచి గుర్తింపు లభిస్తుంది' అన్నారు.


కాదంబరి కిరణ్, దశరథ్, రామ్మోహన్‌రావు, శ్వేతా లక్ష్మీరెడ్డి, బందరు బాబీ, వేణుగోపాల్

సైకో అంతం కోసం..

నయనతార కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'ఇమైక్క నోడిగల్' తెలుగులో 'అంజలి సిబిఐ ఆఫీసర్' పేరుతో అనువాదమవుతున్నది. ఆర్. అజయ్ జ్ఞానముత్తు దర్శకుడు. క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో నయనతార సీబీఐ అధికారిణిగా నటించింది. అథర్వ, రాశీఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించగా, బాలీవుడ్ దర్శకుడు అనురాగ్‌కశ్యప్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. విజయ్ సేతుపతి అతిథి పాత్రలో కనిపించారు. విశ్వశాంతి క్రియేషన్స్ పతాకంపై సి.హెచ్.రాంబాబు, ఆచంట గోపీనాథ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 22న విడుదలకానుంది. 'వరుస హత్యలకు పాల్పడుతున్న ఓ సైకో కిల్లర్‌ను తుదముట్టించడానికి ధైర్యవంతురాలైన సీబీఐ అధికారిణి ఏం చేసిందన్నదే చిత్ర కథ' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆర్.డి.రాజశేఖర్, సంగీతం: హిప్‌హాప్ తమిళ.


నయనతార

ఆత్మీయతను పంచుతున్నారు!

'మనం సైతం' స్వచ్ఛంద సేవా సంస్థ వరుసగా సేవా కార్యక్రమాల్ని చేపడుతూ ఆపన్నులకు అండగా నిలుస్తున్నది. నటులు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థ ఆశ్రితులకు సహాయసహకారాల్ని అందిస్తూ మానవతను చాటుకుంటున్నది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పదిమంది పేదలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరిలో విద్య, వైద్యం, క్రీడలు వంటి వివిధ అవసరాలు కలిగిన వారున్నారు. ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ 'నేను జీవితంలో ఎదుర్కొన్న బాధలు, కోపం, ప్రతీకారం, ఆవేదనకు మరో కోణంలో మొదలైందే మనం సైతం. మేము అందిస్తున్న సహాయానికి ఎన్నో రెట్లు దీవెనలు లభిస్తున్నాయి. ఏడుగురితో మొదలైన 'మనం సైతం' ఈరోజు లక్షా 70వేల మంది సభ్యులను సంపాదించుకుంది' అన్నారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ 'పేదలకు డబ్బుతో పాటు ఆత్మీయతను పంచుతున్నారు. చిత్ర పరిశ్రమలోని కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య భీమా సౌకర్యం లేదు. అలాంటి కార్మికులకు తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సగం ఖర్చు మినహాయింపుతో ఆరోగ్య భీమా అందజేస్తామని హామీ ఇస్తున్నాం. అలాగే చిత్రపురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించే ప్రయత్నం చేస్తున్నాం' అన్నారు. నేటి సమాజంలో మనం సైతం వంటి సంస్థల అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి చెప్పారు.